శ్రీమద్ యుగదర్శనం



విశ్వపతి



శ్రీమద్ యుగదర్శనం

విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

Phone : 98494 43752

श्री

SHRI DESIGNS

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

HYDERABAD

2023

శ్రీమద్ యుగదర్శనం

విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

ప్రథమ ముద్రణ : 2023

ప్రతులకు :

T.V.R.K.Murthy
(Viswapathi)
Flat No.903, F-Block
Vertex Sadguru Krupa Apartments
Near Sanghamitra School
Nizampet Road
Hyderabad-500085,INDIA
Ph.+91 9849443752

www.lordofsevenhills.com
E-mail: viswapathi@yahoo.com

Coverpage & Inner Illustrations
Sri K.V. Bhima Rao
Cell : 98484 44841

DTP :
Krishna Tamarapalli
Cell : 81858 14046

Printed at :
VIMAL PRINTERS
1-1-776/3/1, SBI Colony,
Gandhi Nagar, Hyderabad.
Cell : 98491 60301

ఒక విన్నపం

మనలో చాలా మందికి ఏదైనా కొత్త పుస్తకం చదువుతున్నప్పుడు ఆ రచయిత రాసిన ముందుమాట చదవకుండా పుస్తకంలోనికి వెళ్ళిపోవడం అలవాటు. అప్పుడు ఆ రచయిత మనస్సులో ఉన్న భావాలు, ఈ పుస్తకంలో చెప్పదలచుకున్న విషయాల పరమార్థం మనకు తెలియదు. ఈ పుస్తకం చదివేముందు మీరు తరువాత పేజీలో గల నివేదన తప్పక చదవండి. అప్పుడే మీకు ఈ పుస్తకం యొక్క పరమార్థం బాగా అర్థమవుతుంది. మీ అందరికి ఇదే నా విన్నపం.

విశ్వపతి

నివేదన

మనందరికి ఈ సృష్టి ఎప్పటినుంచి ఉంది? మనం ఇంతకు ముందు జన్మలలో ఎక్కడ ఉన్నాము? ఆ యుగాలలో జీవన విధానం ఎలా ఉండేది? అలాగే ఇన్ని కోట్ల జన్మల నుంచి ఈ ఆత్మ ఏ ఏ రూపాలలో జన్మిస్తూ ఉంది? అలాగే కృత, త్రేతా, ద్వాపరయుగాలలో భగవంతుడు భూమిపై అవతరించినప్పుడు, ఈ భూమిపై సంచరించినప్పుడు ఎలా ఉండేది? అసలు అప్పటి ప్రకృతి ఎలా ఉండేది? అలాగే మనం ఈ జన్మలో ఎన్ని మంచిపనులు చేస్తున్నా ఎందుకు ఇన్ని కష్టాలు పడుతున్నాము, అది కూడా కష్టం మీద కష్టం మనకే ఎందుకు వస్తున్నాయి? ఇటువంటి సందేహాలు మనలో చాలామందికి వస్తుంటాయి. ఇటువంటి సందేహాలకి సమాధానాలు ఈ పుస్తకంలో మీకు లభిస్తాయి.

అయితే ఈ పుస్తకాన్ని మీరు ఎటువంటి అనుమానాలు మనస్సులో పెట్టుకోకుండా చదవండి అప్పుడే మీకు సత్యం అర్థమవుతుంది. ఇది ఇలాగా? అది అలాగా? ఇది ఎలా సాధ్యం? అది ఎట్లా సాధ్యం? అనే ఆలోచనలకి ఏమాత్రం తావివ్వకుండా ఈ పుస్తకాన్ని స్వచ్ఛమైన మనస్సుతో చదివితే మీకు ఈ సృష్టికి సంబంధించిన అనేక విషయాలు ఎంతో తేలికగా అర్థమవుతాయి. మీరు ఈ జన్మలో పడుతున్న కష్ట సుఖాలకు ఏది కారణమో అది మీకు తేలికగా, స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడు మీ మనస్సుకి పూర్తి ప్రశాంతత లభిస్తుంది.

ఈ పుస్తకం రాస్తున్నప్పుడు నేను గడచిన 27 మహాయుగాలను నా హృదయంలో దర్శించాను. ఇది మాటలలో వర్ణించలేని, అక్షరాలలో రాయలేని అక అద్భుత అనుభవం. అన్ని మహాయుగాలను నా మనోనేత్రంతో దర్శిస్తూంటే నా కళ్ళముందు అనేక దృశ్యాలు కనబడసాగాయి. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం అనేక యుగాలలో జరిగిన సంఘటనలు, అప్పటి జీవన విధానాలు, అప్పటి సంస్కృతి, అప్పటి ప్రకృతి, అప్పుడు భగవంతుడు దాల్చిన అనేక అవతారాలు ఇలా ఎన్నో విషయాలు నా కంటిముందు ఆవిష్కృతమయ్యాయి. ఎన్నో లక్షల సంఘటనలు నా మనోనేత్రంలో ఒక అద్భుత దృశ్యకావ్యంలాగా చాలా వేగంగా కదలాడ సాగాయి. ఎంత అద్భుత అనుభవం అది! కోట్లాది సంవత్సరాల క్రితం ఈ విశ్వంలో జరిగిన సంఘటనలు ఎన్నో నాకు కనిపించ సాగాయి.

నాకు అలా కనిపించే వాటిలో అతి కొద్ది సంఘటనలు మాత్రమే ఈ పుస్తకంలో రాయడం జరిగింది. మన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇంకా ఎన్నో శాస్త్ర గ్రంథాలు ఎప్పుడు ఎవరు ఎలా రచించారు? ఈ భూమిపైకి ఇవన్నీ ఎలా వచ్చాయి? అలాగే ఏ తరాలలో, ఏ కాలంలో మన శాస్త్రాలలోని విశేషాలను మనం ఎలా పోగొట్టుకున్నాము? ఈరోజు మనకి మిగిలింది ఎంత? అసలు మహర్షులు ఈ కావ్యాలు రాస్తున్నప్పుడు ప్రకృతి ఎలా ఉంది? దేవతలు వారికి ఎలా సహకరించారు? అవన్నీ గురు పరంపరలో ఒకొక్క యుగంలోను ఎలా ప్రజాబాహుళ్యంలోకి వచ్చాయి? ఆ గురువులు వీటిని ఎలా శిష్యులకు అందించారు? అలాగే ఆ గురువులలో కొందరు ఈ విద్యను తరువాత తరాల వారికి ఎందుకు అందించలేదు? ఇటువంటి అనేక విషయాలు నాకు కనిపించాయి.

ఇవన్నీ మీలో చాలామందికి ఎంతో ఆశ్చర్యంగాను, ఎంతో నమ్మశక్యం లేనివిగాను అనిపించవచ్చును. కాని జరిగిన ప్రతీ సంఘటన నా కంటికి స్పష్టంగా గోచరించింది. ఇప్పటి కాలంలో ఎంతోమందికి తెలియని ఎన్నో విషయాలు నాకు కనిపించాయి.

ఈ పుస్తకం రాస్తున్న రోజుల్లో నేను వేరే ప్లేన్‌లోకి వెళ్ళడం జరిగింది. ఈ లౌకిక ప్రపంచంలో ఉంటూ అలా కొన్ని లక్షల సంవత్సరాల వెనుకకు, అనేక యుగాల వెనుకకు వెళ్ళడం, అప్పటి విశేషాలు దర్శించడం, ఆ కాలంలో జరిగిన అనేక సంఘటనలు ఎదురుగా జరుగుతున్నట్లు కనబడడం, తిరిగి ఈ లౌకిక ప్రపంచంలోకి రావడం ఇదంతా చాలా అద్భుతమైన, మాటల్లో వర్ణించలేని మధుర అనుభవాలు. ఇవన్నీ మీరు చదువుతున్నప్పుడు ఎటువంటి తర్కానికి తావివ్వకుండా చదివితే మీరు కూడా ఆ విషయాలన్నీ ఎంతో అద్భుతంగా దర్శించగలుగుతారు. మీరు కూడా ఆ కాలం నాటి పరిస్థితులు దర్శిస్తూ, ఒక గొప్ప దివ్య అనుభూతికి లోనౌతారు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.

ఈ పుస్తకం చదివితే కొన్ని కోట్ల జన్మలలో మనం ఇప్పుడు జీవిస్తున్న ఈ జన్మ ఎంత చిన్నదో అర్థమవుతుంది. ఇన్ని కోట్ల సంవత్సరాలు, ఇన్ని విధాలలో, అనేక ప్రదేశాలలో, అనేక రూపాలలో జన్మించిన మనం ఈరోజు ఈ జన్మలో అనుభవిస్తున్న కష్ట సుఖాలు ఎంత అణుమాత్రమైనవో మనకు తెలుస్తుంది. మనం మానవులగానే కాక క్రిమికీటకాదులుగా కూడా జన్మించి కొన్ని జన్మలలో కేవలం కొన్ని గంటలు మాత్రమే బ్రతికిన జన్మలు కూడా ఉండవచ్చు. ప్రస్తుతం మనం జీవిస్తున్న జన్మలో ప్రతి క్షణం మంచి ఆలోచనలతో ఉంటూ, చుట్టూ ఉన్న నలుగురికి మనకు వీలైనంత సహాయం చేస్తూ జీవించాలి. అప్పుడే మనం భగవంతుని సన్నిధికి త్వరగా చేరగలుగుతాము.

ఈ పుస్తకంలో ప్రతీ అక్షరం దైవదత్తమే. ఋషిప్రోక్తమే. అందుకే ఈ పుస్తకం చదువుతున్న మీ అందరికీ కూడా తప్పక అద్భుత అనుభవాలు కలుగుతాయని నా నమ్మకం, నా విశ్వాసం. ఈ శ్రీమద్ యుగదర్శనం పుస్తకం చదవడం పూర్తి చేసే సరికి మీకు సరికొత్త ఉత్సాహం, జీవితంపై గొప్ప అవగాహన తప్పక కలుగుతాయని నా నమ్మకం.

ఈ పుస్తకానికి అద్భుతమైన ముఖచిత్రం, లోపల పేజీలలో ఎన్నో చక్కటి చిత్రాలు వేసి ఇచ్చిన ఆప్తులు శ్రీ కె.వి. భీమారావు గారికి ఎన్నో కృతజ్ఞతలు. ఈ పుస్తక రచనలో, ప్రచురణలో నాకు ఎంతో మంది సహకరించారు. మీ అందరిని ఆ శ్రీలక్ష్మీశ్రీనివాసులు, సర్వదేవతలు ఎల్లప్పుడూ చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నాను. మీకు ఈ జన్మ శుభప్రదంగా జరిగి ముందు ముందు మరిన్ని ఉత్తమ జన్మలు రావాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు
సర్వేజనా సుఖినోభవంతుః
సమస్త కళ్యాణానిభవంతుః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Hyderabad
2023

www.lordofsevenhills.com
viswapathi@yahoo.com
Ph.: 98494 43752

అంకితము

ఈ శ్రీమద్ యుగదర్శనం పుస్తకాన్ని
శ్రీలక్ష్మీశ్రీనివాసుల దివ్య చరణారవిందములకు
భక్తితో సమర్పిస్తున్నాను.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

1

ఈ విశ్వంలో ఎన్నో కోట్ల గ్రహ మండలాలు ఉన్నాయి. వీటిలో మన కంటికి కనిపించేవి అతి తక్కువ. ఈ మహా విశ్వంలో మనకు కనబడే గ్రహమండలాలు ఎంత ప్రమాణంలో ఉన్నాయి, వాటిలో ఎటువంటి జీవరాశి ఉంది అనేది తెలుసుకుంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. మన కంటికి కనబడే సూర్య, చంద్రులను, అనేక నక్షత్రాలను చూసి మనం ఎంతో ఆశ్చర్యపోతాం. కాని ఈ విశ్వంలో మనకు కనబడే నక్షత్రాలకంటే ఎంతో పెద్దవి అయిన నక్షత్రాలు అనేకం ఉన్నాయి.

ఈ బ్రహ్మాండంలో మనకి కనబడుతున్న సూర్యుడు కంటే వేలరెట్లు శక్తి గల సూర్యులు, మన భూమికంటే ఎన్నో వేలరెట్లు పెద్దవి అయిన ఎన్నో వేల నక్షత్ర మండలాలు ఉన్నాయి. ఒక్కసారి ఈ దృశ్యాన్ని మన మనో నేత్రంతో వీక్షిస్తే ఎంతో అద్భుతంగా, ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. మనం అందరం ఈ భూమి మీద జరిగే అనేక విశేషాలు గమనిస్తూ జీవించాము. మన ఈ జీవితంలో మనకు

జరిగిన ఎన్నో సంఘటనలు, మనం ఈ జన్మలో కలిసే ఎందరో మనుషులు, మనం తిరిగే ప్రదేశాలు కోట్లాది జన్మల నుంచి మనకి ఏదో బంధం ఉండి ఉంటుంది. ఆ బంధం వలననే మనకు ఈ జన్మలో తల్లి దండ్రులతో, అన్నదమ్ములతో, భార్యా పిల్లలతో, బంధువులతో, స్నేహితులతో మనకు బంధం ఏర్పడుతుంది.

అయితే ఈ బంధాలు ఎంతో విచిత్రంగా ఉంటాయి. కొన్ని బంధాలు ఎందుకు వస్తాయో, ఎలా వెళ్ళిపోతాయో కూడా తెలీదు. కొన్ని బంధాలు జీవితాంతం ఉంటే కొన్ని కేవలం కొన్ని నెలలు మాత్రమే ఉంటాయి. ఏ బంధం ఎంతకాలం ఉంటుంది అన్నది మనకు ఇంతకుముందు జన్మలలో వీటితో ఎంత గాఢమైన బంధం ఉన్నది అన్నదాన్నిబట్టి ఉంటుంది. ఈ సృష్టి ప్రారంభం నుండి మనం ఎన్నో యుగాలలో, ఎన్నో కోట్ల జన్మలలో, ఎన్నెన్నో రూపాలలో, ఎక్కడెక్కడో ప్రదేశాలలోను జన్మిస్తూ ఈనాటికి ఈ జన్మకు వచ్చాము. ఏ జన్మలో బంధం అటు తరువాత ఏ జన్మలో ఎప్పుడు ఎవరితో కలుగుతుందో అన్నది భగవన్నిర్ణయం.

ఒక ఇరవై లక్షల సంవత్సరాల క్రితం త్రేతాయుగంలో మనం జన్మించినప్పుడు మన తోబుట్టువు ఈ కలియుగంలో మళ్ళీ మన తల్లిగానో, తండ్రిగానో కావచ్చు. అలాగే ఏ ద్వాపరయుగంలోనో మన భార్యగా జన్మించిన యువతి ఈ జన్మలో మన తమ్ముడే కావచ్చును. ఇలా ఈ కోట్లాది జన్మలలో ఏ బంధం ఎప్పుడు వస్తుంది అన్నది భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఒక జన్మలో మీ తండ్రి ఈ జన్మలో మీ కుమారుడిగా పుట్టవచ్చును. అలాగే ఒక జన్మలో మీ కుమారుడు ఈ జన్మలో మీకు ఎంతో గొప్ప స్నేహితుడిగా పుట్టవచ్చును.

ఇన్ని యుగాలలో ఇన్ని కోట్ల సంవత్సరాలలో జరిగిన సృష్టి పరిణామ క్రమము, అనేక జీవజాతులు, అనేక సంఘటనలు,

వ్యక్తులు, జీవన విధానాలు, ఆయా కాలాలనాటి సంస్కృతి, అనేక జీవుల ఆత్మ ప్రయాణం ఇలా ఇటువంటి విశేషాలన్నీ నా హృదయంలో నిత్యం ఒక మహా దృశ్యకావ్యంలాగా దర్శనమిస్తూంటాయి. ఇటువంటి అనేక విషయాలు ఈ పుస్తకంలో వ్రాసాను. నాకు కనబడిన కోట్లాది విశేషాలలో కొన్ని మాత్రమే ఈ పుస్తకంలో వ్రాసాను. ఇంతకంటే ఇంకా ఎంతో అద్భుతమైన విశేషాలను ఆయా యుగాలలో నా మనో నేత్రంతో దర్శించాను.

ఇవి చాలా ఆశ్చర్యకరంగాను, ఒక్కోసారి నమ్మశక్యం కానివిగానూ ఉంటాయి. కాని నేను నా మనో నేత్రానికి కనబడినది కనబడినట్టుగా వ్రాస్తున్నాను. ఏ మాత్రం మార్పులు, చేర్పులు చేయను. ఏది దర్శించానో అది మాత్రమే వ్రాసాను. ఎటువంటి కల్పనలు లేకుండా నేను చూసిన సత్యాన్నే ఇందులో వ్రాసాను. ఇది చదివిన మీకు క్రిందటి యుగాలలో జరిగిన అనేక అద్భుత సంఘటనలు, ఎన్నో విశేషాలు తెలుస్తాయి. ఇవి మీకు ఎంతో ఆనందదాయకం అవుతాయని నా నమ్మకం.

అది కృతయుగంలోని 2,24,222వ సంవత్సరం. ఒక్కసారి ఆనాటి రోజులో జరిగిన కొన్ని విశేషాలు మనం ఇప్పుడు చూద్దాం. ఆ రోజు నేటి మానస సరోవర ప్రాంతం ఎంతో అద్భుతమైన ప్రకృతితో విరాజిల్లుతోంది. ఇప్పటికంటే ఎన్నో వేలరెట్లు తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆ రోజు వైశాఖ శుద్ధ పౌర్ణమి. ఆనాడు ఉదయం నుంచే ఆ ప్రాంతం రోజుకంటే ఎంతో ఎక్కువ తేజస్సుతో ప్రకాశిస్తోంది.

ఆ రోజు శ్రీ పరమేశ్వరుడు, శ్రీ పార్వతిదేవి ఉదయం నుంచి అక్కడే ఉన్నారు. ఆకాశమంతా ఎంతో అద్భుత కాంతితో ప్రకాశిస్తోంది. అక్కడి సరోవరంలో రాజహంసలు ఎంతో ముచ్చటగా అటూ ఇటూ తిరుగుతున్నాయి. వాటిలో కొన్ని దేవజాతులకు

సంబంధించిన హంసలు కూడా ఉన్నాయి. ఆ హంసలకు సంస్కృత భాష కూడా తెలుసు. అటువంటి దేవ హంసలు త్రేతాయుగంలోను, ద్వాపరయుగంలోను, మానస సరోవరంలో ఉండేవి. ఇప్పుడు కలియుగంలో అవి పూర్తిగా అదృశ్యమయ్యాయి. అయితే ఇప్పటికి యోగులకు, సిద్ధులకు ఈ దివ్య దేవలోకపు హంసలు ఎప్పుడైనా ఒకటి, రెండు దర్శనమిస్తుంటాయి.

2

ఆనాడు అక్కడ ఉన్న మానస సరోవరం సరస్సు అంతా ఎంతో స్వచ్ఛమైన నీటితో ప్రకాశిస్తోంది. ఆ నీటిపై తెరలు తెరలుగా అక్కడక్కడ నీరు గడ్డకట్టుకుంది. ఆ పొరలపై కొన్ని కొంగలు వచ్చి వాలి వెళ్తున్నాయి. మానస సరోవరం ప్రాంతంలో ఆనాడు చుట్టూ ఎన్నో మంచుకొండలు, ఎన్నో అద్భుతమైన దేవతా రూపాలలో ఉన్నాయి. పరమేశ్వర రూపం, సుబ్రహ్మణ్యేశ్వర రూపం, విఘ్నేశ్వర రూపం, శ్రీబ్రహ్మ రూపం, శ్రీ మహావిష్ణురూపంలో ఉన్నాయి.

అదిగో! ఆ పరమేశ్వర రూపంలో ఉన్న ఆ ఎదురుగా ఉన్న గొప్ప మంచుకొండను చూడండి! ఎంత అద్భుతంగా, ఎంత దివ్యంగా ప్రకాశిస్తోందో! ఆ కొండంతా ఆకాశమంత ఎత్తుగల బంగారు కాంతితో ప్రకాశిస్తోంది. ఆ కొండపై మధ్యలో పరమేశ్వరుని త్రిశూలం దివ్యంగా ప్రతిష్ఠించబడి ఉంది. పరమేశ్వరుడు తమ త్రిశూలాన్ని ఇప్పుడే అక్కడ ఉంచి ఇటువైపు నడుస్తూ వస్తూంటే జగత్తు అంతా నృత్యం చేస్తున్నట్లుంది. పరమేశ్వరునితోపాటు జగన్మాత కూడా వయ్యారంగా

నడుస్తూ ఈ సరోవరం వద్దకు వస్తున్నది. ఈ జగత్మాతాపితరులను దర్శించిన మనం ఎంత అదృష్టవంతులము!.

ఆ జగన్మాత తేజస్సుకు పైన ఆకాశంలోని సూర్యకాంతి కొంచెం వెలవెలబోయినట్లు అయింది. ఇంకా అద్భుతం ఏంటంటే పరమేశ్వరుని తేజస్సు, జగన్మాత తేజస్సు కలిసి ఆ ప్రదేశమంతా ఒక అద్భుతమైన కాంతి వలయంగా ఏర్పడింది. ఆ రంగులు ఈనాటి భాషలో మనం వర్ణించలేము. ఆ కాంతిని ఈనాడు మనకు తెలిసిన పదాలతో చెప్పలేము.

ఆహా! ఓ పార్వతి పరమేశ్వరులారా! మానస సరోవరంలో మిమ్మలను దర్శించిన మా జన్మధన్యమైంది. పరమేశ్వరుడు ఎంతో ప్రసన్నవదనంతో రుద్రాక్ష మాలలతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. పరమశివుడు తమ ప్రియసఖి పార్వతితో ఇలా అంటున్నాడు. ఈ రోజు అత్యంత శుభదినం. వైశాఖ పౌర్ణమి. కాసేపట్లో ఇక్కడకి ఎందరో దేవతలు రాబోతున్నారు. ఎన్నో విశేషాలు నువ్వుగమనిస్తావు. మనం ఈ రోజు రాత్రిదాకా ఇక్కడే ఉండి తెల్లవారుఝామునే కైలాసం వెళదాము అని అన్నాడు.

ఈ సంగతి అప్పటికే గ్రహించిన జగన్మాత అలాగే స్వామి అని చెప్పి సంతోషంగా చిరునవ్వు నవ్వుతూ తల ఊపింది. ఇంతలో అటుపక్కగా ఒక తెల్లటి ఏనుగుల గుంపు వచ్చింది. అవి పరమేశ్వరుని చూడగానే తమ తొండాన్ని పైకెత్తి బ్రహ్మాండమైన ఘీంకారనాదం చేసాయి. ఆహా అద్భుతం! ఆ ఘీంకారం ఒక్కసారిగా పరమేశ్వరుని ఢంకానాదంలా వినిపించింది. స్వామి వాటి వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

కృత యుగంలో మానస సరోవరంలోని ఇంకా కొన్ని ప్రదేశాలలో తెల్లటి ఏనుగులు సంచరించేవి. అటు తరువాత రెండు లక్షల సంవత్సరాలకు అవి మాయమయ్యాయి. ఇలా ఆ ఏనుగులన్నీ పరమేశ్వరుని పక్కనుంచి ఆ సరోవరం వద్దకు చేరుకున్నాయి. పార్వతీ పరమేశ్వరులు వాటిని నెమ్మదిగా చేతితో నిమిరారు. అవి ఎంతో ఆనందపడుతూ ముందుకు సాగాయి.

ఇంతలో ఒక అద్భుతమైన పక్షులు వచ్చి పరమేశ్వరుని ముందు వాలాయి. వాటిని కేసర పక్షులు అనేవారు. అవి నేడు కానరావు. ఆ పక్షులు ఈ కలియుగం నాటి గ్రద్దల ఆకారంలో ఉండి ఎంతో అద్భుతమైన రంగు రంగుల ఈకలతో ఉండేవి. అటువంటి జంట పక్షులు రెండు వచ్చి పరమేశ్వరుని పక్కన వాలాయి. స్వామివారు, పార్వతీదేవి అక్కడ కొంచెం ఎత్తుగా ఉన్న ప్రదేశంపై కూర్చున్నారు. ఆ పక్షులు రెండు దగ్గరకు రాగానే ఎంతో చక్కగా కూయసాగాయి.

ఈ పక్షులు వేరే గ్రహమండలంనుంచి అక్కడకి వచ్చాయి. అవి అటు ఇటు కదులుతూ ఉంటే చూడడానికి ఎంతో రమ్యంగా, ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. స్వామివారు, పార్వతీదేవి వాటి వైపు చిరునవ్వుతో చూసారు. అవి తిరిగి చక్కగా మళ్ళీ పాడసాగాయి. ఇంతలో ఒక తెల్లటి నాగుపాము అటుగా వచ్చింది. వచ్చి పరమేశ్వరుని పక్కనే చేరి తలెత్తి పరమేశ్వరుని ముఖారవిందాన్ని చూస్తూ ఎంతో ఆనందంతో తల అటూ ఇటూ ఆడించసాగింది. ఈ తెల్లనాగు కైలాసం నుంచి వచ్చిన నాగజాతి లోనిది. ఈ శ్వేతనాగులు మానస సరోవర ప్రాంతంలో ఒకప్పుడు చాలా కనబడుతూ ఉండేవి. ద్వాపర యుగంలో అవి మాయమయ్యాయి. ఒక్కసారి శ్రీకృష్ణుల వారికి అవి కనబడ్డాయి.

ఇంతలో ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది. పరమేశ్వరుడు చిరునవ్వుతో ఆకాశం వంక చూసాడు. అప్పుడు ఆ స్వామికి వైకుంఠం నుంచి శ్రీ గరుత్మంతుల వారిపై వస్తున్న శ్రీమన్నారాయణుల వారు, శ్రీ మహాలక్ష్మీ కనబడ్డారు. శ్రీ గరుత్మంతుల వారు వాయువేగంతో వచ్చి పరమేశ్వరులు వారు ఉన్న ప్రాంతంలో వాలాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు, శ్రీమహాలక్ష్మీ గరుత్మంతులవారి పైనుంచి కిందకి దిగి పార్వతీ, పరమేశ్వరుల ప్రక్కనే కూర్చున్నారు. గరుత్మంతులవారు తిరిగి వేగంగా ఎగిరి ఎటు పక్కకో వెళ్ళిపోయారు. పార్వతీ పరమేశ్వరులు, శ్రీలక్ష్మీనారాయణులు కుశల ప్రశ్నలు వేసుకున్నారు.

వీరు అనేక విశేషాలు ముచ్చటిస్తూ ఉండగా అక్కడకి హనుమంతులవారు వచ్చారు. శ్రీమన్నారాయణుల వారు హనుమంతులవారిని చూసి నాయనా! ముున్ముందు వచ్చే త్రేతాయుగంలో నీవు గొప్ప కార్యం నెరవేర్చవలసి ఉంది అని అన్నారు. అందుకు శ్రీ ఆంజనేయుల వారు ఎంతో సంతోషంగా తల ఊపుతూ అవశ్యం స్వామీ అన్నారు.

శ్రీమన్నారాయణుల వారి తేజస్సు, శ్రీమహాలక్ష్మీ తేజస్సు వర్ణించ అలవికానిది. ఆహా! శివకేశవులను, ఇద్దరి జగన్మాతలను ఒకే చోట దర్శించిన మనం ఎంత అదృష్టవంతులమో కదా! ఇంతలో అక్కడకి దూరంగా కొందరు మహార్షులు వస్తూ కనబడ్డారు. వారందరూ ఇక్కడకి వచ్చి పార్వతీ, పరమేశ్వరులకు, లక్ష్మీ, నారాయణులకు అభివాదం చేసారు. అద్భుతమైన వేదగానం చేసారు.

అప్పుడు పరమేశ్వరుడు నాయనలారా! మీ తపస్సులు చక్కగా జరుగుతున్నాయి కదా! ఎటువంటి ఆటంకాలు లేవు కదా అన్నారు. అందుకు వారు తమ తపస్సులో ఎటువంటి ఆటంకాలు

లేకుండా నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి అన్నారు. ఇలా మాట్లాడుతుండగా వారిలో ఒక మహర్షి కమండలంలో నుంచి కొద్దిగా నీరు ఉబికి అక్కడ కింద మంచుపై పడింది. జరిగిన పరిణామానికి ఆ మహర్షి ఆశ్చర్యపోయాడు. అప్పుడు పరమేశ్వరుడు ఆ మహర్షితో ఇలా అన్నాడు. నాయనా ఇలా జరిగినందుకు నీవు చింతించవద్దు వచ్చే త్రేతాయుగంలో నీవు గొప్ప మహర్షివై జన్మిస్తావు. అప్పుడు శ్రీమన్నారాయణుల వారు శ్రీరామచంద్రుల వారిగా జన్మిస్తారు. నీవు అప్పుడు ఆ స్వామిని దర్శించి శ్రీరామచంద్రుల వారు నీతో కలిసి ఈ మానస సరోవర ప్రాంతానికి కొంతకాలం వస్తారు. అప్పుడు స్వామి వారు ఈ ప్రదేశంలోనే కొంతకాలం ఉంటారు.

ఈ రోజు జరిగిన సంఘటన ఈ ప్రదేశ పవిత్రతను సూచిస్తుంది. అంతే కాదు తరువాత కాలంలో 14 లక్షల సంవత్సరాలకు ఇక్కడ గొప్ప ఆశ్రమాలు వెలుస్తాయి. అందులో నిత్యం అనేకమంది మహర్షులు తపస్సు చేస్తూ, వేద పఠనం చేస్తూ ఉంటారు. వారి వలన ఈ విశ్వంలో ధర్మం కాపాడబడుతూ ఉంటుంది. ఈ ప్రదేశం ఎంతో పవిత్ర ప్రదేశంగా ప్రసిద్ధి పొందుతుంది.

మీరందరూ కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేసి మరల మరల ఈ ప్రదేశంలోనే జన్మించి ఈ సృష్టిలో ధర్మాన్ని నిలుపుతారు. ఈ విశ్వంలో ధర్మ ప్రచారం గావించి అన్ని కాలాలలో ధర్మం నిలబడేలా ఎన్నో గొప్ప కార్యాలు చేస్తారు. మేము అన్ని యుగాలలో ఈ ప్రదేశంలో సంచరిస్తూ ఉంటాము. అయితే కలియుగంలో అదృశ్యరూపంలో ఇక్కడకి వస్తూంటాము. యోగులకు, సాధువులకు అప్పుడప్పుడు మా దర్శనం అనుగ్రహిస్తాము అని పరమేశ్వరుల వారు చెప్పారు.

ఇంతలో అక్కడకి చతుర్ముఖ బ్రహ్మ, సరస్వతీ దేవి కూడా వచ్చారు. త్రిమూర్తులు ముగ్గురు మానస సరోవరంలో ఒకే

సమయంలో కొలువవడంతో ఆ ప్రదేశమంతా దివ్యంగా మెరిసిపోతుంది. ఆనాటి ఆ తేజస్సు వలన ఆ ప్రదేశానికి, మానస సరోవరం మొత్తానికి, హిమాలయా పర్వత ప్రాంతాల మొత్తానికి కలిగిన ఆనాటి దివ్య తేజస్సు కొన్ని యుగాలదాకా ఉంటుంది. సాధకులు, యోగమార్గంలో ఉన్నవారు ఈ అద్భుత శక్తిని ఇప్పటికి ఆ ప్రాంతంలో గ్రహించగలుగుతారు.

త్రిమూర్తులు ముగ్గురు ఏవో దేవరహస్యాలు మాట్లాడుకుంటున్నారు. ముగ్గురు జగన్మాతలు పక్క పక్కనే కూర్చొని ఏవో ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. పరమేశ్వరునికి మహావిష్ణువుతో రాబోయే యుగాలలోని కొన్ని విశేషాలు చెప్తున్నారు. శ్రీమన్నారాయణుడు కూడా పరమేశ్వరునితో రాబోయే యుగాలలో జరగబోయే కొన్ని విశేషాలు చెప్తున్నారు.

ఈ విషయాలన్నీ మధ్య మధ్యలో అక్కడ ప్రక్కనే ఉన్న సరస్వతి, లక్ష్మీ, పార్వతీ వింటున్నారు. వారింతలో లేచి పక్కనే ఉన్న పూల మొక్కల వద్దకు వెళ్ళారు. ఆహా ఎంత అద్భుతంగా ఉన్నాయి ఈ పూల మొక్కలు...ఆ పూలు శ్వేత, విరాహి, వినోద, పినాకి అనే పేరుగల గొప్ప పుష్పాలు. కృతయుగంలో ఉన్న ఈ పుష్పాలు తరువాత యుగంలో మాయమయ్యాయి. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలు నడవడం చేత దేవతలకు సాధ్యమయ్యే అద్భుతాలు, దేవతలకు గల కొన్ని శక్తులు భూలోకంలో యోగులు, సిద్ధులకు కూడా సాధ్యమయ్యేవి. దేవతలు దర్శించే విశేషాలు ఆనాటి కాలంలో మానవులు కూడా దర్శింపగలిగేవారు.

3

జగన్మాతలు ముగ్గురు అటూ ఇటూ తిరుగుతూ ఆ పూలమొక్కల వద్దకు వచ్చారు. ఇంతలో పార్వతీ దేవి చక్కటి పుష్పాన్ని కోసి చేతిలోకి తీసుకుంది. ఎంతో ముచ్చటగా ఉంది అని అనుకుంటుండగా ఒక్కసారి వీచిన గాలికి ఆ పుష్పం విచిత్రంగా పైకి ఎగిరి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోయింది. పార్వతీ దేవి ఒక్కసారి కనులు మూసుకొని చిరునవ్వుతో కనులు తెరచింది. ఆ పుష్పం గాలిలో అలా ఇలా ఎగురుతూ ప్రస్తుత కలియుగంలోని ఉత్తర భారతదేశంలోని ఒక స్థలంలో పడింది. ఆ స్థలంలోనే ఈనాడు ఒక ప్రసిద్ధ అమ్మవారి క్షేత్రం వెలసింది.

అదే సమయంలో ఆశ్చర్యంగా శ్రీ మహాలక్ష్మీ చేతిలోకి తీసుకున్న మరొక తెల్లటి దివ్య పుష్పం కూడా గాలిలోకి ఎగిరి వెళ్ళింది. కాసేపటికి శ్రీ సరస్వతీ మాత తీసుకున్న పుష్పాలలో నాలుగు పుష్పాలు కూడా గాలికి ఎగిరి వెళ్ళిపోయాయి. శ్రీమహాలక్ష్మీ చేతినుంచి జాలువారిన ఆ పుష్పం తిరిగి తిరిగి ఇప్పటి కొల్హాపూర్ ప్రాంతంలో పడింది. అందుకే అక్కడ ఒక అద్భుత శ్రీమహాలక్ష్మీ క్షేత్రం వెలిసింది.

అలాగే శ్రీ సరస్వతీ దేవి చేతినుంచి జారిన నాలుగు పుష్పాలు ఎంతో వేగంతో గాలిలో ఎగురుతూ భారతదేశంలోని నాలుగువైపులా పడ్డాయి. ఆ ప్రదేశాలలోనే ఇప్పటి కలియుగంలో నాలుగు గొప్ప వైదిక మఠాలు ఏర్పడ్డాయి. అవే ఇప్పటి శ్రీనగర్, శృంగేరి, కంచి మఠం, ద్వారక మఠం ఉన్న ప్రాంతాలు.

ఒక మహాయుగంలో ఆనాడు కృతయుగంలో జగన్మాతల చేతుల నుంచి జాలువారిన ఆ పుష్పాలు పడిన ప్రదేశాలే ఈనాటి ఈ గొప్ప మఠాలు గల గొప్ప క్షేత్రాలు. విశేషం ఏమిటంటే అవి దేవతా పుష్పాలు కాబట్టి అవి ఎన్ని యుగాలైన ఇప్పటికి ఆ ప్రదేశాలలోనే ఉన్నాయి.

అయితే ఇవి కృతయుగం తరువాత సామాన్య మానవులకు కనబడడం మానివేసాయి. త్రేతా, ద్వాపర, కలియుగాలలో ఇవి అదృశ్యరూపంలోనే ఉన్నాయి. అందుకే ఇప్పటికి జగన్మాతలు ముగ్గరుకి ఈ క్షేత్రాలంటే ఎంతో ఇష్టం. కాబట్టి ఈ క్షేత్రాలలో ఆ జగన్మాతలు ముగ్గురు నేటికి తెల్లవారుఝాము వేళల్లో విహరిస్తూంటారు.

సాధన మార్గంతో ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నవారు ఆ దేవతల సంచారాన్ని గ్రహించగలుగుతారు. అలాగే ఆ దేవతా పుష్పాల దివ్య వాసనలు కూడా కొన్ని క్షణాల పాటు ఆఘ్రాణించగల్గుతారు.

ఆహా! ఆ ప్రదేశం ఎంత దివ్యంగా ఉంది! ఇంతలో అటుప్రక్కన ఉన్న పూల తీగలపై చిన్న చిన్న పక్షులు ఎంతో ముచ్చటగా కూయసాగాయి. వాటిని చూసిన జగన్మాతలకు ఎంతో ఆనందం కలిగింది. ఆ ఆనందంతో సరస్వతీ దేవి చక్కటి వీణానాదం మొదలుపెట్టింది. పరమేశ్వరుడు, బ్రహ్మదేవుడు, శ్రీమన్నారాయణుడు,

పార్వతీ, లక్ష్మీ, ఈ వీణానాదాన్ని ఎంతో ఆనందంగా ఆలకించ సాగారు. ఈ అద్భుత వీణానాదంతో ప్రకృతి అంతా పరవశించిపోయింది. చుట్టూ ఉన్న చెట్లపై ఉన్న పక్షులు అన్నీ తాము కూయడం మానివేసి ఒక్కసారి సరస్వతీ దేవి వీణానాదాన్ని వినసాగాయి.

ఆ వీణానాదానికి ఎక్కడో దూరాన ఉన్న జింకలు రివ్వు రివ్వున ఇక్కడకు చేరుకున్నాయి. కొన్ని లేడి పిల్లలు చెంగు చెంగున ఎగురుతూ ఇక్కడకి వచ్చాయి. పక్కనే సరోవరంలో ఉన్న దేవ హంసలు ఆ వీణానాదాన్ని ఎంతో ఇంపుగా వినసాగాయి. సరస్వతీ దేవి ఎంతో ఆనంద పడుతూ అద్భుతంగా వీణ వాయించ సాగింది. ఆ వీణానాదం దాదాపు రెండు గంటలపాటు సాగింది. ఆ అద్భుత వీణానాదం విని ఎంతో సంతోషపడి ఆకాశం నుంచి అనేక దేవతలు మానస సరోవరానికి విచ్చేసారు.

ఆ రోజు అక్కడ చెట్లపై ఉన్న పక్షులు, అక్కడకి వచ్చిన లేళ్ళు, జింకలు, తెల్ల ఏనుగులు, హంసలు ఇంకా అనేక జాతుల వన్యప్రాణులు అవి తరువాతి యుగాలలో మానవులుగా జన్మించి గొప్ప సంగీతకారులయ్యారు. ఆనాడు త్రిమూర్తులు, ముగ్గురు జగన్మాతల సమక్షంలో సాక్షాత్తూ శ్రీ సరస్వతీదేవి వీణానాదం విన్న భాగ్యం చేత ఆ జీవులన్నీ ఎన్నో జన్మలెత్తి, మధ్యమధ్యలో సామాన్య జన్మలు గడిపినప్పటికి తరువాత కొన్ని జన్మలలో అద్భుత సంగీత కారులయ్యారు.

మనకి తెలిసిన కొందరు సంగీతకారులు అప్పటి ఆ పక్షులే! అప్పటి ఆ లేళ్ళ గుంపులోని వారే! వీరందరూ ఎంతో పుణ్యాత్ములు .వీరందరు తమ సంగీత ప్రావీణ్యంతో అటు భగవంతుని, ఇటు సామాన్య ప్రజలను ఎంతగానో అలరించారు.

బ్రహ్మదేవుడు సరస్వతితో చెప్తున్నాడు. ఆ కనిపిస్తున్న లేడిపిల్ల చూడు! ఎంత ఆనందంగా నీ వీణానాదం వింటున్నదో! ఈ లేడిపిల్ల ముందు ముందు యుగాలలో ఒక నాలుగు జన్మలలో గొప్ప సంగీత విద్వాంసుడుగా గొప్ప పేరు పొందుతాడు. అలాగే ఆ పక్షిపిల్ల కలియుగంలో దక్షిణ భారతదేశంలో ఒక గొప్ప సంగీత కళాకారిణిగా జన్మిస్తుంది. తన దివ్య మధుర కంఠంతో మనందరిని అలరిస్తుంది. ఆ పక్షి అటుతర్వాత ఎన్నో యుగాలలో ఎన్నో జన్మలు ధరించి ఎన్నో పుణ్యకార్యాలు చేసింది.

ఒకనాడు శ్రీరామచంద్రులవారు వనవాసంలో ఉన్న కాలంలో ఈ పక్షి మళ్ళీ పక్షి జన్మలో పుట్టి రోజు రామచంద్రులవారి ఆశ్రమం దగ్గరిలో చెట్టుపై నివసిస్తూ ఎంతో శ్రావ్యంగా పాడేది. శ్రీరామచంద్రులవారు అప్పుడు సీతమ్మతల్లితో ఈ పక్షి యొక్క పూర్వజన్మ వృత్తాంతం అంతా వివరంగా చెప్పారు. మానస సరోవరంలో సరస్వతీ దేవి వీణానాదం చేసిన విశేషం సీతాదేవికి గుర్తుతెచ్చాడు. ఈ పక్షి తాను ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా జన్మించినపుడు గోపికలలో ఒకరిగా జన్మిస్తుందని ఒకనాడు ఆ గోపిక తన చేతిలోని వేణువును తీసుకొని ఎంతో సుమధురంగా వేణునాదం చేస్తుందని సీతమ్మతల్లితో చెప్పాడు.

సీతమ్మతల్లి ఆ పక్షిని చూసి ఎంతో ముచ్చట పడింది. ఆ పక్షి ఒకొక్కసారి ఉదయం వేళల్లో ఒకొక్కసారి సాయంత్రం వేళల్లో ప్రక్కనే ఉన్న చెట్టుపై కూర్చొని ఎంతో శ్రావ్యంగా గొంతెత్తి పాడేది. అక్కడ చెట్లకు పండిన చిన్న చిన్న పళ్ళను తినేది.

మళ్ళీ మనం మానస సరోవరం వద్దకు వద్దాం. ఆరోజు త్రిమూర్తులందరూ రాత్రి దాకా అక్కడే కొలువై ఉన్నారు. ఆనాటి రాత్రివేళ నీలిఆకాశంలో అద్భుత కాంతి పుంజాలు కనబడ్డాయి. అవన్నీ

ఎన్నో గ్రహమండలాలు. ఆ గ్రహమండలాలపై ఎందరో దేవతలు ఉండడం చేత ఆ మండలాలన్నీ ఎంతో కాంతివంతంగా ప్రకాశిస్తున్నాయి.

ఆ రోజు పౌర్ణమి కావడం చేత రాత్రి ఎంతో అద్భుతంగా ఉంది. వెన్నెల ఎంతో చల్లగా ఉన్నది. త్రిమూర్తులు జగన్మాతలతో కలిసి కాసేపు మానస సరోవరం అంతా అప్పుడు విహరించారు. అక్కడ తపస్సు చేసుకుంటున్న మునులకు తమ దర్శనం ఇచ్చారు. ఆ మునీశ్వరులందరూ త్రిమూర్తులను, జగన్మాతలను దర్శించి ఎంతో ఆనంద పడ్డారు.

పరమేశ్వరుడు ఆ మునీశ్వరులతో ఇలా అన్నాడు ఓ మునీంద్రులారా! రాబోయే త్రేతా, ద్వాపర యుగాలలో వీరందరూ మహా తపస్సంపన్నులుగా, గొప్ప మహాపురుషులుగా జన్మిస్తారు. ఈ భూమిపై ధర్మం నిలుపుతారు. అప్పుడు మీరు ఈ భూమిపై ధర్మం ఆచరిస్తున్న మహనీయులను మీరు ఉత్తేజ పరచండి. వారు మరిన్ని ధర్మ కార్యాలు చేసేలాగా వారిని ప్రేరేపించండి అని చెప్పాడు. అప్పుడు మహర్షులందరూ ఎంతో సంతోషంతో తప్పక అలాగే చేస్తాము అని అన్నారు.

అటు తరువాత త్రిమూర్తులు వారి భార్యలతో సహా వారి వారి లోకాలకు వెళ్ళిపోయారు. మానససరోవరం అంతా అప్పటి నుంచి ఆ ప్రదేశమంతా ఎంతో తేజస్సుతో ప్రకాశించ సాగింది. అక్కడ అంతా దేవతలు, యోగులు, సిద్ధులు, కృత, త్రేతా, ద్వాపర యుగాలలో మానససరోవరంలో ప్రత్యక్షంగా సంచరించేవారు. ఈ కలియుగంలో వారు అక్కడ అదృశ్యరూపంలో సంచరిస్తూంటారు.

సాధనలో ఎంతో ఉన్నత మార్గంలో ఉండే వారికి మాత్రం వారు అప్పుడప్పుడు దర్శనమిస్తూంటారు. వారు ఇక్కడే ఉండి భూమిపై వివిధ ప్రదేశాలలో సనాతన ధర్మ ప్రచారం ఎంతో ఎక్కువగా, ఉన్నతంగా చేస్తున్న వారికి అనేక సందేశాలు పంపుతూ వారిచే లోక కళ్యాణం కోసం అనేక కార్యాలు చేయిస్తారు. ఈ మహాపురుషులు అన్ని కాలాలలోను ఇక్కడ మానససరోవరంలో సంచరిస్తుంటారు.

4

ఈ విశ్వం ఎంతో పెద్దది. మనకు భూమి మీద కనబడే సూర్యచంద్రులు, నక్షత్ర మండలాలు కొన్ని మాత్రమే. ఇంకా వేల రెట్లు ఈ విశ్వంలో ఉన్నాయి. మనం ఈ భూమిమీద నుండి ఆకాశాన్ని చూసినప్పుడు ఈ విశ్వంలో ఒక వైపులో కొంత భాగం మాత్రమే చూడగలుగుతాం. కానీ ఈ విశ్వంలో మన కంటికి కనిపిస్తున్న సూర్యుడి కంటే వేల రెట్లు ప్రకాశవంతమైన సూర్యులు ఉన్నారు. అలాగే మన కంటికి కనబడే నక్షత్రాలు కొన్ని ఈ భూమి కంటే వేల రెట్లు పెద్దవి.

ఈ నక్షత్రాలలో, ఈ గ్రహమండలాలలో అనేక శక్తి సంపన్నులు ఉన్నారు. వారు దేవతా స్వరూపులు. వారు ఒక గ్రహమండలం నుంచి మరొక గ్రహమండలానికి ఒక్క క్షణ కాలంలో ప్రయాణిస్తారు. వారికి ఈ విశ్వంలో తెలియని విషయం లేదు. ఇంతకు ముందు మహా యుగాలలో జరిగింది, ప్రస్తుత యుగంలో జరుగుతున్నది, రాబోయే మహాయుగాలలో జరగబోయే అన్ని విశేషాలు వారికి పూర్తిగా ఎరుకే.

కృత యుగం పరిమాణం 17,28000 వేల సంవత్సరాలు. అప్పుడు సనాతన ధర్మం ఎంతో గొప్పగా విరాజిల్లుతుండేది. మహర్షులు లోక కళ్యాణం కోసం అడవులలోను, నదీ తీరాలలోను తపస్సు చేసుకుంటూ ఉండేవారు. కృత యుగంలో ఈ భూమి మొత్తం ఎంతో పచ్చగా ఉండేది. ఎక్కడ చూసినా ఎన్నో పంట పొలాలు, అద్భుతమైన కొలనులు, అద్భుత సరోవరాలు వీటన్నిటితో ప్రకృతి ఎంతో అద్భుతంగా ఉండేది. అన్ని వృత్తులవారు ఎంతో ధర్మపరంగా జీవిస్తూ ఉండేవారు.

అది కృత యుగంలో 12,40,020 వ సంవత్సరం. ఆనాడు మాఘ పౌర్ణమి. ఆనాడు అడవిలో ఒక చెట్టు క్రింద ఒక మహర్షి ఎంతో గొప్ప తపస్సు చేసుకుంటున్నాడు. ఆ మహర్షి తపస్సు మొదలు పెట్టి అక్కడకి ఒక లక్ష సంవత్సరాలు పైగా అయింది. లక్ష సంవత్సరాలుగా అదే చెట్టు క్రింద కూర్చొని ఉన్నాడు. కృత యుగంలో కొన్ని వృక్షాలు లక్షల సంవత్సరాలుగా జీవించాయి.

అప్పటి మానవులు, జంతువుల ఆయుఃప్రమాణం ఎక్కువగా ఉండేది. కొన్ని జాతుల సర్పాలు వేల సంవత్సరాలు కూడా జీవించేవి. ఆ రోజు మహర్షి తపస్సులో ఉండగా అటు ప్రక్కనుంచి ఒక పెద్ద దేవతా సర్పం వెళ్ళింది. ఈ సర్పం ప్రతిరోజు కొన్ని సంవత్సరాలుగా ఆ మహర్షి వద్దే ఉంటూ అక్కడే తిరుగుతూ ఎప్పుడూ ఆ మహర్షిని కాపాడుతుండేది. మహర్షి తపస్సుకు ఏ మాత్రం ఆటంకం లేకుండా చూస్తూండేది. నేను ఈ అద్భుత దృశ్యం దర్శించిన ఈ మాఘ పౌర్ణమి నాడు కూడా ఈ మహాసర్పం ఆ మహర్షి వద్దనే పూర్తిగా చుట్టుకునే ఉంది. ఆ మహర్షి దీర్ఘమైన తపస్సులో నిమగ్నమై ఉన్నాడు. ఆ మహర్షి యొక్క తలవెంట్రుకలు క్రింద నలువైపులా పెరిగి చుట్టు ప్రక్కల అంతా వ్యాపించి ఉన్నాయి.

ఆ మహర్షి ఉన్న ప్రదేశానికి ఏ జంతువూ రాజాలదు. అతడి నుండి ఎంతో తేజస్సు ఎంతో దూరం వరకు వ్యాపిస్తున్నది. అప్పుడు అటుగా రాబోయే పెద్దపులి ఒక్కసారిగా దిక్కు మార్చుకొని మరో వైపు వెళ్ళిపోయింది. అటు రాబోయిన పెద్ద ఏనుగుల సమూహం కూడా ఆ తేజస్సుకు తట్టుకోలేక వేరే ప్రాంతానికి వెళ్ళిపోయింది. అక్కడ ఉన్న మహాసర్పం అక్కడే తిరుగుతూ తన పడగ పైకెత్తి దూరంగా ఏ అలికిడి జరిగినా జాగ్రత్తగా గమనిస్తుంది.

ఇంతలో ఆ మహాసర్పానికి దాదాపు 20 మైళ్ళ దూరంలో ఒక సింహాల గుంపు ఇటు ప్రక్కవస్తున్నట్లు తెలిసింది. అప్పుడు ఆ సర్పం పడగ విప్పి నోటితో ఊదగానే ఎంతో దివ్యమైన, శక్తివంతమైన తరంగాలు ఆ సింహాల గుంపు వస్తున్న దిశగా ప్రయాణించాయి అంతే! ఆ దివ్య తరంగాల తాకిడికి తట్టుకోలేక ఆ సింహాలన్నీ ఒక్కసారి భయపడి విపరీతమైన వేగంతో పరిగెత్తి వెళ్ళిపోయాయి.

ఆ విధంగా ఆ దేవతా సర్పం ఆ మహర్షిని ఎప్పుడూ రక్షిస్తూ ఉండేది. ఆ మహర్షి ఆ విధంగా 2,20,000 ల సంవత్సరాలు తపస్సుచేసాడు. ఒకనాడు ఆ మహర్షికి శ్రీమన్నారాయణులవారు ప్రత్యక్షమయ్యారు. శ్రీమన్నారాయణుడు గరుత్మంతుడిపై వాయు వేగంతో వస్తూండడంతో కొన్ని కాంతి పుంజాలు వేగంగా కదులుతూ వలయాలు, వలయాలుగా భూమికి దగ్గరవుతుంటే ఆ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంది.

శ్రీమన్నారాయణుల వారిని చూసిన ఆ మహర్షి ఎంతో ఆనందపడ్డారు. శ్రీ స్వామివారిని అనేక విధాలుగా స్తుతించాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ మహర్షిని ఏమి కోరికతో నీవు ఇంతకాలం తపస్సు చేశావు మహానుభావా అని అన్నాడు. అప్పుడు ఆ మహర్షి శ్రీమన్నారాయణుడితో ఇలా అన్నాడు. స్వామీ! రాబోయే త్రేతా,

ద్వాపర, కలియుగాలలో ధర్మం నెమ్మది నెమ్మదిగా క్షీణించ సాగుతుంది. ముఖ్యంగా ద్వాపర యుగంలో కొద్దిగా కనబడే ఈ పరిస్థితి కలియుగంలో మరింత క్షీణిస్తుంది. కలియుగంలో మనుష్యులు ఎన్నో అధర్మ కార్యాలు చేస్తారు, ఎన్నో కష్టాలకు లోనవుతారు అనేక యుగాలలో ఎన్నో కోట్ల జన్మలలో జన్మించిన ఈ ఆత్మలన్నీ అనేక పాప పుణ్యకార్యాలు చేస్తూ ఎన్నో కష్టాల పాలవుతారు. ధర్మం ఆచరించేవారు రాను రాను చాలా తక్కువ అవుతారు. కలియుగంలో ప్రజలు చేసే పాపాలకు ప్రకృతి విలపిస్తుంది. అనేక ప్రకృతి వైపరీత్యాలు జరుగుతాయి, అనేక దుస్సంఘటనలు చాలా ఎక్కువగా సంభవిస్తాయి.

కలియుగంలో మొదటి 500 ల సంవత్సరాలు ధర్మం కొంతమేర ఆచరింపబడుతుంది. అటు తరువాత నెమ్మదిగా ధర్మాచరణ తగ్గడం ప్రారంభిస్తుంది. ఒక 500 సంవత్సరాలు గడిచేటప్పటికి ప్రజలలో దాదాపు 90 శాతం అధర్మానికి పాలుపడుతూంటారు. విచ్చలవిడి తనం ఎక్కువ అవుతుంది. ఇలా కొనసాగితే కలియుగ ప్రమాణమైన 4,32,000 వేల సంవత్సరాలలో మొదటి 10,000 వేల సంవత్సరాలు కూడా పూర్తి కాకుండా పూర్తి అధర్మం పెరిగి ఈ సృష్టి సర్వనాశనానికి దారితీస్తే ఎలా తండ్రి? ఈ సృష్టి క్రమం ఎలా జరుగుతుంది తండ్రి? దయచేసి దీనికి ఏదైనా ఉపాయం అనుగ్రహించండి అని ప్రాధేయ పడ్డాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు ఆ మహర్షితో ఇలా అన్నారు! నాయనా నీవు వేసిన ప్రశ్న ఎంతో సమంజసమైనది. నీ కోరిక ఎంతో ధర్మపరమైనది. నీవు లోక కళ్యాణం కోసం చేసిన ఈ తపస్సు అమోఘమైనది. ఈ తపోఃఫలంచేత అనేక పుణ్య కార్యాలు జరుగుతాయి. ఈ భూమాత ఎంతో ఆనంద పడుతుంది. ఈ తపోఃఫలంచేత రాబోయే యుగాలలో ఎందరో మానవులు మంచి మార్గంలో ప్రయాణిస్తారు. వారు ధర్మం ఆచరిస్తారు. లోక కళ్యాణం

కోసం ఎంతో కృషి చేస్తారు. అంతే కాదు ఈ తపోఃఫలంచేత కలియుగంలో భూమిపై 44 ప్రదేశాలలో అత్యంత శక్తిగల దేవాలయాలు ప్రతిష్ఠింపబడతాయి. ఈ ప్రదేశాలన్నీ ఎంతో శక్తివంతమై ఇవన్నీ దివ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందుతాయి. ఇన్ని సంవత్సరాల నీ తపోఃఫలంతో ఆక్షేత్రాలలో దివ్యశక్తి అద్భుతంగా కొన్ని లక్షల సంవత్సరాల పాటు నిక్షిప్తమై ఉంటుంది.

మరొక విషయం చెప్తాను సావధానంగా వినవలసింది. ప్రతీయుగంలోను అన్ని కాలాలలోను ధర్మాన్ని రక్షించడం కోసం కొంత మంది మహనీయులు జన్మిస్తారు. వీరి వలన ఈ సృష్టి మొత్తం సర్వనాశనం కాకుండా ఎల్లప్పుడు రక్షింపబడుతూ ఉంటుంది. వీరు ప్రతీ కాలంలోను జన్మిస్తూ తమ ప్రవచనాల ద్వారా గాని, తమ సంకీర్తనల ద్వారా గాని ఇంకా ఎన్నో విధాలా ఈ సృష్టి వినాశనం కాకుండా కాపాడుతూ ఉంటారు

వీరిలో కొందరు ప్రజలకు ధ్యానబోధ చేస్తూంటారు. మరికొందరు దేశాటన చేస్తూ ప్రవచనాలు చెప్తూంటారు అని శ్రీమన్నారాయణుల వారు చెప్పసాగారు. ఇలా శ్రీమన్నారాయాణుల వారు చెప్పడం మొదలు పెట్టగానే ఇదంతా సర్వదేవతలు వినడం ఆరంభించారు. ముందు ముందు కాలాలలో జరిగే విశేషాలు కొన్ని శ్రీమన్నారాయణుల వారు ఆ మహర్షికి చెప్తూంటే సమస్త దేవతలు ఎంతో ఆసక్తితో వినసాగారు.

శ్రీమన్నారాయణుల వారు ఆ మహర్షితో ఇలా చెప్పసాగారు! నాయనా ఇలా జన్మించే ఈ మహాపురుషులు కలియుగంలో ఏ కాలంలోనైన 200 లకు మించి ఉండరు. వీరు కలియుగంలో మొదటి 1500 వ సంవత్సరాల వరకు ప్రజల మధ్యనే జీవిస్తుంటారు. అప్పటి సామాజిక పరిస్థితులు కూడా వీరు ప్రజల మధ్య

ప్రశాంతంగా జీవించడానికి అనువుగా ఉంటాయి. అయితే రాను రాను ప్రజలలో అధర్మం పెరిగి వీరి ప్రశాంత జీవనానికి అవరోధం కలిగే పరిస్థితులు కలుగుతాయి. ఇక్కడితో వీరు ప్రజల మధ్య జీవించడం క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఇక 2000 వ సంవత్సరం వచ్చేటప్పటికి ఇటువంటి మహనీయులు ప్రజల మధ్య జీవించడం పూర్తిగా తగ్గిస్తారు. ప్రజల మధ్య ఉండే కొద్ది మంది కూడా తమ చుట్టూ ఉండే ప్రజలను మాయతో కప్పేస్తూ అతి సాధారణ వ్యక్తుల వలె వారికి కనిపిస్తూంటారు.

కృత, త్రేత, ద్వాపర, కలియుగాలలో జన్మించే ఈ మహాపురుషులు అనేక దేవతాంశలతో జన్మిస్తారు. కొందరు గ్రహమండలాలలో సంచరిస్తున్న దివ్య పురుషులు కూడా ఈ విధంగా భూమిపై అప్పుడప్పుడు జన్మిస్తూంటారు. వీరు ఈ భూమిపై అనేక ప్రదేశాలలో జన్మిస్తారు. వీరు ఎంత శక్తి గలవారంటే ఆయా ప్రాంతాలలో ఎటువంటి ప్రకృతి విపత్తులు జరగకుండా కాపాడుతూ ఉంటారు. దీని వలననే ఈ సృష్టి మొత్తం సర్వనాశనం కాకుండా కాపాడుతూ ఉంటుంది.

నాయనా! నీకు మరొక ముఖ్య విషయం కూడా చెప్తున్నాను. కలియుగంలో ధర్మ సంరక్షణార్థం, ధర్మ ప్రచారణార్థం అనేక పీఠాలు వెలుస్తాయి. వీటిలో కంచి, శృంగేరి, ద్వారక, పుష్పగిరి, కాశ్మీరం, కుర్తాళం వంటి 12 పీఠాలు అత్యంత ప్రభావశీలంగా ఉంటాయి. మరొక విశేషం ఏమిటంటే కృత, త్రేతా, ద్వాపరయుగాలలో భగవంతుడి సన్నిధిలో గడిపిన ఎంతో గొప్ప సాధకులు కలియుగంలో ఈ 12 పీఠాలను అధిరోహిస్తారు.

ఈ పీఠాలను అధిరోహించే గురువులు కూడా భగవత్‌నిర్దేశం ప్రకారం కొంతకాలం మాత్రం ఈ భూమిపై జీవించి

తిరిగి భగవంతుని వద్దకో, లేదా వారు వచ్చిన గ్రహమండలానికో తిరిగి వెళ్తారు. వీరిలో కొందరు కేవలం 25 సంవత్సరాలు జీవిస్తే మరికొందరు 200 సంవత్సరాలు జీవిస్తారు. మరొక ముఖ్య విశేషం ఏమిటంటే ఒక జన్మలో ఒక పీఠం పరంపరలో జన్మించిన మహాపురుషుడు కొన్ని సంవత్సరాల తర్వాత మరొక పీఠ పరంపరలో పీఠాధిపతిగా రావచ్చును.

భగవంతుడు కొందరు మహా పురుషులను ఈ విధంగా గొప్ప పీఠాధిపతుల పరంపరలో మధ్య మధ్యలో ఒక పీఠాధిపతిగా వీరిని భూమిపైకి పంపిస్తుంటారు. వారు ఆ పీఠాధిపత్యం అధిరోహించిన కాలంలో ఆ పీఠం ఎంతో వైభవాన్ని సంతరించుకుంటుంది. వీరి ద్వారా ప్రపంచమంతటా ఎంతో గొప్పగా సనాతన ధర్మ ప్రచారం జరుగుతుంది.

మరొక గొప్ప విశేషం ఏమిటంటే ఇటువంటి మహానుభావులు జన్మించే తల్లి దండ్రులు 2000 జన్మల పాటు ఎంతో ధర్మపథంగా జీవించి, అనేక ధర్మకార్యాలు చేసిన వారై ఉంటారు. అటువంటి పుణ్యదంపతులకు ఈ పీఠాధిపతులు జన్మిస్తారు. వీరిలో కొందరు జన్మించిన మొదటి సంవత్సరాలలో సామాన్యులుగా కనబడి ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి అసాధారణ ప్రతిభను కనపరుస్తారు. తరువాత అనేక శాస్త్రాలలో ప్రావీణ్యత సంపాదిస్తారు.

ఒక్కొక్క కాలంలో చాలా అవసరం, అవశ్యం అయినప్పుడు సాక్షాత్తూ కొందరు దేవతలే మానవులుగా జన్మించి ఈ పీఠాల గురు పరంపరలోకి వస్తారు. కాల, గ్రహ పరిస్థితుల వలన ఈ 12 పీఠాలలో ఏవైనా కొన్ని వాటి ప్రాభవం కొద్దిగా తప్పినప్పుడు సాక్షాత్తూ త్రిమూర్తులలో ఒకరు గాని, త్రిశక్తులలో ఒకరు గాని లేదా ఇతర దేవతలో ఒకరు గాని మానవ జన్మ తీసుకొని తిరిగి ఆ పీఠానికి

పూర్వ వైభవం తీసుకొస్తారు. వారి వలన పీఠం ఎంతో శక్తివంతమైన పీఠంగా తిరిగి కొలవబడుతుంది. ఆ పీఠంలో కొలువై ఉన్న దేవత కూడా ఎంతో ఆనందపడి తన శక్తిని ఆ పీఠాధిపతికి అనుగ్రహించి ఆ పీఠాధిపతిచేత ధర్మం ఎంతో ఎక్కువగా ప్రచారం చేయబడి ప్రజలలో ఎంతో చైతన్యం తీసుకురాబడుతుంది.

అలాగే ఈ పీఠాలు నెలకొల్పబడే ప్రదేశాలు కూడా ఎంతో శక్తివంతమై ఉంటాయి. ఇంతకు ముందు యుగాలలో ఈ ప్రదేశాలలో ఎన్నో గొప్ప యజ్ఞ యాగాదులు చేయబడి ఉంటాయి. ఎందరో గొప్ప మహర్షులచే అనేక దేవతల సమక్షంలో గొప్ప యజ్ఞాలు నిర్వహింపబడి ఉంటాయి. అందుకే ఈ పీఠాలు ఉన్న ప్రదేశాలు కూడా ఎంతో శక్తివంతమై ఉండి, వీటిని దర్శించిన ప్రజలకు ఎంతో శుభం కలుగుతుంది. అనేక కష్టాల నుండి వారికి ఉపశమనం కలుగుతుంది. అనేక మానసిక సమస్యలు తొలగిపోతాయి. వారికి ఎన్నో ఉత్తమ జన్మలు లభిస్తాయి. ముందు ముందు జన్మలలో వారు ఎన్నో పుణ్యకార్యాలు చేస్తారు.

ఆ మహర్షికి శ్రీమన్నారాయణుల వారు ఈ విధంగా చెప్పగానే ఆ మహర్షి ఎంతో ఆనందపడ్డారు. శ్రీమన్నారాయణుల వారి లోక కళ్యాణగుణాన్ని ఎన్నో విధాల స్తుతించాడు. అప్పుడు శ్రీమన్నారాయణుల వారు తిరిగి తమలోకానికి వెళ్ళిపోయారు. ఆ మహర్షి తరువాత కాలంలో ఎందరో శిష్యులను తీర్చిదిద్ది తన జీవితం సార్థకం చేసుకొని, తాను వచ్చిన లక్ష్యం పూర్తికాగానే తిరిగి శ్రీస్వామివారిలో ఐక్యమయ్యాడు.

5

అది కృతయుగంలో 4,24, 400 సంవత్సరంలో ఒక నాడు బ్రహ్మ, సరస్వతి ఆకాశమార్గాన పయనిస్తున్నారు. సత్యలోకం నుంచి బయలు దేరి మానస సరోవరం ప్రాంతానికి రావడానికి వారు బయల్దేరారు. వారు ఎన్నో దేవలోక విశేషాలను ముచ్చటించుకుంటూ ఆకాశమార్గాన వస్తుండగా శ్రీసరస్వతీ దేవి శిరస్సు నుండి ఒక దేవ పుష్పం ఎగురుతూ ఎగురుతూ వచ్చి రాలి భూలోకంలో నేటి ఉత్తర ప్రదేశ్ ప్రాంతంలో ఒక పెద్ద రాజప్రాసాదం ప్రక్కగా పడింది. బ్రహ్మ, సరస్వతి ఆ సంఘటనతో ఒక్కసారి ఆశ్చర్యపోయి క్రిందకి చూసారు.

అప్పుడు బ్రహ్మదేవుడు సరస్వతితో ఇలా అన్నాడు. ప్రియసఖీ! ఈరోజు నీ శిరస్సునుండి భూమిపై రాలిన ఈ పుష్పం పడిన ప్రదేశంలో రాబోయే త్రేతా, ద్వాపర, కలియుగాలలో ఎంతో ప్రభావవంతమైన విశ్వవిద్యాలయాలు ఏర్పడతాయి. ఇప్పుడు మనకి ఇక్కడ ఒక పెద్ద రాజప్రాసాదం కనిపిస్తున్నది కదా! కొంతకాలానికి ఈ స్థలంలో ఒక పెద్ద సనాతన ధర్మ ప్రచార విశ్వవిద్యాలయం వస్తుంది.

ఎందరో మహర్షులు ఇక్కడ శిష్యులకు గొప్ప వేద విజ్ఞాన పరంపరలు అందిస్తారు.

ఈ విశ్వవిద్యాలయం ఒక 20,000 సంవత్సరాల పాటు అద్భుతమైన వేద విజ్ఞానాన్ని ఎందరో శిష్యులకు అందిస్తుంది. ఇంతే కాదు భారద్వాజ, విశ్వామిత్ర, వశిష్ట, భృగు మహర్షుల వంటి దివ్య జ్ఞాన సంపన్నుల అంశతో జన్మించిన మహర్షి పుంగవులు ఈ ప్రదేశంలో ఎన్నో వేల సంవత్సరాలు నివశించి తపస్సు చేసుకుంటూ ఎందరో శిష్యులను గొప్ప జ్ఞానులుగా తీర్చిదిద్దుతారు. వీరు తమ జ్ఞాన సంపదను తమ తరువాత తరాల వారికి గురుశిష్య పరంపరలో అందిస్తారు.

అటుతరువాత త్రేతా యుగంలో ఇక్కడ మళ్లీ గొప్ప ఆశ్రమాలు వెలుస్తాయి. ఈ ఆశ్రమాలలో గొప్ప వేద విద్య లభిస్తుంది. అంతేకాదు శ్రీ మహావిష్ణువు ఆ త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా అవతరించినప్పుడు సాక్షాత్తూ స్వామివారు కూడా ఈ ప్రాంతాన్ని దర్శిస్తారు. అలాగే అటు తరువాత ద్వాపర యుగంలో కూడా ఈ ప్రదేశంలో అనేక ముని ఆశ్రమాలు వెలుస్తాయి. వేదఘోష నిత్యం వినిపిస్తూ ఉంటుంది. వేలాదిమంది శిష్యులు గొప్ప జ్ఞానులుగా తీర్చిదిద్దబడతారు. ఇంతే కాదు కౌరవ, పాండవ కుటుంబాలలోని కొందరు వీరులు కూడా గొప్ప విద్యలను అభ్యసిస్తారు.

ద్వాపరయుగాంతానికి ఈ ఆశ్రమ విశ్వ విద్యాలయం పూర్తిగా కనుమరుగవుతుంది. అటుతరువాత కలియుగంలో ఒక గొప్ప విశ్వవిద్యాలయం ఇక్కడ నెలకొల్పబడుతుంది. ఈ విశ్వవిద్యాలయంలో ప్రపంచం నలుమూలల నుంచి అనేక వేలమంది విద్యార్థులు వచ్చి చదువుకుంటారు. ఇది ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయంగా ప్రసిద్ధి చెందుతుంది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతో గొప్ప

జ్ఞానవంతులై ఎన్నో రంగాలలో రాణిస్తారు. కానీ కొంతకాలం తరువాత కలిప్రభావంతో కొన్ని దురదృష్టకర సంఘటనలతో ఈ విశ్వవిద్యాలయం పూర్తిగా ధ్వంసం చేయబడి పూర్తిగా అంతరించిపోతుంది. ఇలా చతుర్ముఖ బ్రహ్మ చెప్పగానే సరస్వతి కంట తడి పెట్టుకుంది.

అప్పుడు బ్రహ్మ దేవుడు సరస్వతితో ఇలా అన్నాడు! ప్రియసఖి నువ్వు అస్సలు బాధ పడవద్దు అటు తరువాత 400 సంవత్సరాలకు తిరిగి ఆ ప్రదేశంలో అద్భుతమైన విశ్వవిద్యాలయం నెలకొల్పబడుతుంది. ఈ ప్రదేశం యొక్క అపారమైన శక్తి వలన మధ్య మధ్యలో అవాంతరాలు వచ్చినప్పటికి ఎన్ని యుగాలు మారిన ఇక్కడ ఇప్పుడు గొప్ప విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడుతూ ఉంటాయి. ఇవి ఎంతో ప్రసిద్ధి పొంది ప్రపంచం నలుమూలల నుండి విద్యార్థులను ఆకర్షిస్తాయి. ఇలా ఈ రోజు నీ శిరస్సు నుండి పుష్పం పడిన ఈ ప్రదేశం అన్ని మహాయుగాలలోను ఎన్నో గొప్ప విద్యాలయాలకు నిలయం అవుతుంది అని చతుర్ముఖ బ్రహ్మ తన ప్రియసఖి సరస్వతితో అన్నాడు.

విశేషం ఏమిటంటే కృతయుగం నాటి ఆ దివ్య పుష్పం ఇప్పటికి ఆ ప్రదేశంలోనే అదృశ్యరూపంలో నిక్షిప్తమై ఉంది. కలియుగంలో సామాన్య మానవులకు కనబడక సాధకులకు మాత్రం అప్పుడప్పుడు దర్శనమిస్తూ ఉంటుంది. ఆ పుష్పం ఉన్న ప్రదేశానికి రాగానే ఏదో చెప్పరాని గొప్ప అనుభూతి కలుగుతుంది. మన మనస్సు ఎంతో ఆనందంతో నిండిపోతుంది. ఇది ఇప్పటికి మనం గమనించవచ్చును.

6

అది త్రేతాయుగంలో 2,22,240 వ సంవత్సరం ఆరోజు కార్తీక శుద్ధ ద్వాదశి. మనం ఇప్పుడు కలియుగంలో అమెరికా దేశంలోని కాలిఫోర్నియా అని పిలవబడుతున్న ప్రాంతాన్ని చూస్తున్నాము. త్రేతాయుగంలో ఈ ప్రాంతం అంతా దట్టమైన అడవులతో నిండి ఉండేది. ఇక్కడ ప్రకృతి ఎంతో అద్భుతంగా విరాజిల్లుతూ ఉంటుంది. ఇక్కడ ఎన్నో సెలయేర్లు, పెద్దపెద్ద కొండలు, ఆకాశమంత ఎత్తైన చెట్లు, ఎంతో అందమైన పూల మొక్కలు, బ్రహ్మాండమైన ఫలవృక్షాలు ఉండేవి.

లేళ్ళు, జింకలు అటు ఇటు తిరిగేవి. క్రింద ఎంతో ముద్దుగా కనిపిస్తున్న కుందేళ్ళు అటు ఇటు చెట్ల పొదలలో దూకుతూ వెళుతున్నాయి. ఆనాటి కుందేళ్ల జాతి ద్వాపరయుగం వచ్చేటప్పటికి అంతరించాయి. ఆ కుందేళ్ళు చూడడానికి ఎంతో ముచ్చటగా ఉన్నాయి ముట్టుకుంటే కందిపోయేటట్లు వీటి శరీరం ఎంతో మృదువుగా ఉంటుంది.

ఆ ప్రాంతం అంతా ఎన్నో ఆశ్రమాలతో నిండి ఉంది దగ్గర దగ్గరగా 46 గొప్ప ఆశ్రమాలు ఉన్నాయి. ఆ రోజు అక్కడంతా పండగ వాతావరణం నెలకొంది. ఆశ్రమాల వద్ద ఉన్న దివ్య వృక్షాల క్రింద కొందరు మహర్షులు ధ్యానం చేసుకుంటూ కనబడుతున్నారు. వారిలో కొందరు 400 సంవత్సరాల నుంచి తపస్సు చేస్తున్నారు. ఆ కాలంలో ఆయుఃప్రమాణం చాలా ఎక్కువగా ఉండేది. త్రేతా యుగంలో అద్భుతమైన పంటలు పండేవి. ఈ భూమి ఎప్పుడూ సస్యశ్యామలంగా ఉండేది. ప్రజలందరూ ధర్మపరులై ఎంతో ఆనందంగా జీవిస్తూండేవారు.

ఆరోజు ఆశ్రమం ఉన్న ప్రదేశానికి ఎక్కడెక్కడినుంచో ఎందరో గొప్ప మహర్షులు తరలి వస్తున్నారు. కొందరు భూమార్గాన నడుచుకుంటూ వస్తూండగా కొందరు ఆకాశమార్గాన వాయువేగంతో వస్తున్నారు. ఇలా ఆరోజు ఆ ఆశ్రమాల వద్దకు దాదాపు 200 మంది మహర్షులు చేరారు. ఇంతమంది మహర్షులు అక్కడకు ఆరోజు చేరడంలో ఏదో విశేషం తప్పక ఉండి ఉంటుంది. అదేమిటో మనం ఇప్పుడు చూద్దాము.

వారందరూ ఆ ఆశ్రమాల మధ్యలో ఉన్న ఒక పెద్ద సమావేశ మందిరానికి వచ్చారు. ఆ సమావేశ మందిరం అంతా చెట్టు కర్రలతో పైన పెద్ద చెట్ల కొమ్మలతో నిర్మించబడి ఉంది. ఆ కొమ్మల మధ్యలో ఎన్నో పూల తీగలు వేలాడుతున్నాయి. ఆ పుష్పాలు ఎంతో గొప్ప సువాసలను వెదజల్లుతూ అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అప్పుడప్పుడు చిన్న చిన్న పిట్టలు ఆ పూల తీగలపై కూర్చొని చిన్నగా కూతలు కూస్తూ తిరిగి ఎగిరి వెళ్ళిపోతున్నాయి.

అక్కడ మందిరంలో మహర్షులందరూ ముందు వరుసలో కూర్చొని ఉన్నారు. వారి వెనక కొద్ది వరుసల వెనుక కొందరు రాజులు కూర్చొని ఉన్నారు. వారందరూ అక్కడికి చుట్టుప్రక్కల రాజ్యాలనుంచి వచ్చారు. వారందరూ ఎంతో తేజస్సుతో వెలిగిపోతూ ఒకరితో ఒకరు ఏవో విశేషాలు ముచ్చటించుకుంటున్నారు.

ఆ మందిరంలో పండితులు, సామాన్య ప్రజలు కూడా కూర్చొని ఉన్నారు. వారందరి వస్త్రధారణ కూడా ఎంతో విచిత్రంగా ఉంది. వారందరూ నడుమ వరకే వస్త్రాలు ధరించి ఉన్నారు. కొందరు తమ భుజాలపై ఏవో వింత వస్త్రాలు వేసుకొని ఉన్నారు. ఆరోజు ఆ సమావేశ మందిరంలో దాదాపు ఒక 500 మంది దాకా ఉండవచ్చును.

ఇంతలో ఒక మహర్షి లేచి అక్కడ ఉన్న సభికులను ఉద్దేశించి ఇలా చెప్పసాగారు. నాయనలారా మీలో మహాతపశ్శాలురు, మహాపండితులు, ఎందరో రాజులు, ఎందరో జ్ఞానులు ఉన్నారు. మీరందరూ ఈరోజు కొంతమంది గొప్ప సంగీతకారుల అద్భుత గానం వినబోతున్నారు. ఈ సంగీతకారులందరూ దేవతాంశలతో జన్మించి సంగీతంలో ఎంతో గొప్ప ప్రావీణ్యం కలవారు. వీరి సంగీతంతో ప్రకృతి అంతా పరవశించిపోతుంది. వీరందరూ ఈ రోజు ఇక్కడికి వచ్చి మనందరిని తమ గానకౌశల్యంతో అలరించబోతున్నారు.

ఇక్కడ మీకు మరొక విశేషం కూడా చెప్తున్నాను. ఈనాటి ఈ సభను దేవలోకాలలోని త్రిమూర్తులు, జగన్మాతలు ఇంకా అనేకమంది దేవతలు వీక్షిస్తున్నారు. ఈరోజు ఇక్కడ పాడబోయే ప్రతీ విద్వాంసుడు వచ్చే ద్వాపర, కలియుగాలలో గొప్ప సంగీతకారులుగా జన్మిస్తారు. తమ అద్భుత గానంతో ప్రజలందరిని అలరిస్తారు. వీరి గానం దేవతలని కూడా ఎంతో ఆనందింపచేస్తుంది. వీరు గానం చేసిన అనేక ఆలయాలు కలియుగంలో ప్రసిద్ధ ఆలయాలుగా

వెలుగొందుతాయి. వీరు ఇప్పటినుంచి ఎన్నో జన్మలు పొంది పుణ్యకార్యాలు చేస్తూ సంగీత విద్యను నలుగురికి పంచుతూ ప్రజలందరిని ఆనందింపచేస్తారు.

వీరు గాత్ర సంగీతంలోనే కాకుండా అనేక వాయిద్యాలలో కూడా నిష్ణాతులౌతారు. వీరు ఒక్కో వాయిద్యం వాయిస్తూ ఉంటే ఆ ప్రదేశంలో దివ్య తరంగాలు ఉద్భవిస్తాయి. వింటున్న ప్రేక్షకులు శరీరం మరచిపోతారు. వారిలో ఎవరికైనా ఏదైనా అనారోగ్యం ఉంటే ఆ తరంగాలు తాకి వారు వెంటనే పూర్తిగా ఆరోగ్యవంతులౌతారు. అని ఆ మహర్షి చెప్పి ముందుగా కేశవుడు అనే గాత్ర సంగీతకారుడు మొదలు పెడతాడు. అని చెప్పి వెళ్ళి తమ స్థానంలో తను కూర్చున్నాడు.

అప్పుడు సభలో కూర్చున్నవారందరూ కేశవుడి కోసం ఆత్రంగా ఎదురు చూడ సాగారు. ఇంతలో సభికులలో వెనుక వరుసలో కూర్చున్న కేశవుడు నెమ్మదిగా నడుస్తూ మండపం మీదకు చేరుకున్నాడు. కేశవుడి వయస్సు అప్పటికి 22,000 సంవత్సరాలు ఎంతో అద్భుత తేజస్సుతో నడుచుకుంటూ వస్తున్న అతనిని చూసి ఆశ్చర్యపోయారు. ఆ తేజస్సుకి మండపం పై భాగంలో ఉన్న పువ్వులన్నీ మరింత ప్రకాశవంతంగా కనబడుతున్నాయి.

సభికులందరికి నమస్కరించి ముందు విఘ్నేశ్వరుని స్తుతిస్తూ ఒక గొప్ప కీర్తన పాడాడు. విఘ్నరాజా వినుము స్వామీ! విఘ్ననాయకా వినుము స్వామీ! అనే కీర్తన ఎంతో గొప్పగా ఆలపించాడు. ఆ కీర్తన విన్న సభికులందరూ ఎంతో ఆనందపడ్డారు.

ఆ కీర్తన వింటున్న క్రింద వరుసలో ఉన్న ఒక మహర్షి ప్రక్కన ఉన్న ఒక మహర్షితో ఇతడు శివుని అంశతో జన్మించాడు. కేశవుడు అని పేరు పెట్టుకున్న పరమేశ్వరవరప్రసాది ఇతడు. తరువాత ద్వాపర యుగంలో ఇతడు శ్రీకృష్ణుల వారి చిన్న నాటి స్నేహితులలో

ఆప్తమిత్రుడై ఎంతో గొప్పగా వేణువు ఊదుతాడు అని అన్నాడు. ఇది విని ఆ మహర్షి ఎంతో సంతోషించాడు.

కేశవుడు విఘ్నేశ్వర స్తుతి చేసి తరువాత సరస్వతీ దేవిని స్తుతించాడు. ఆ కీర్తన ఎంతో అద్భుతంగా ఉంది అక్కడ ఉన్నవారందరూ ఆ కీర్తన విని ఎంతో తన్మయత్వం చెందారు. కేశవుడు ఆ తరువాత పరమేశ్వరుని కీర్తిస్తూ గొప్ప కీర్తన పాడాడు ఆహా! అతడి గాత్రం ఎంత అద్భుతంగా ఉంది! అతని గొంతులో ఎంత దైవత్వం ఉంది!

కేశవుడు పరమేశ్వరుని స్తుతిస్తూ పాడడం మొదలు పెట్టగానే చుట్టుప్రక్కన ఉన్న అరణ్యాల నుంచి ఏనుగులు కొన్ని వచ్చి ఈ సభామందిరం పక్కగా అటు ఇటు నుంచొని ఎంతో ఆనందంగా వింటున్నాయి. ఆ ఏనుగులన్నీ ఏ మాత్రం శబ్దం చేయకుండా ఎంతో ప్రశాంతంగా కేశవుడు గానం వినసాగాయి. అతడి గానం జంతువులను సైతం ఎంతో మంత్ర ముగ్ధులను చేసింది.

ఇంతలో మరొక ప్రక్కనుంచి నాలుగు పెద్ద పులులు పరిగెడుతూ వచ్చి ఆ ఏనుగుల పక్కన నుంచున్నాయి! ఇంతలో మరొక ప్రక్కనుంచి నాలుగు సింహాలు కూడా అక్కడకు వచ్చి ఆ సభామందిరానికి ప్రక్కగా కూర్చున్నాయి. కేశవుడు గానం ఆలపిస్తూ ఉంటే కొన్ని నెమళ్ళు చుట్టుప్రక్కల ఉన్న చెట్లపైనుంచి వచ్చి ఈ ఏనుగులపై వాలాయి. కొన్ని అక్కడ ఉన్న పులుల పైన సింహాలపైన వాలాయి. మరికొన్ని ప్రక్కనే ఉన్న నేలపై గడ్డిలో వాలాయి.

ఇంతలో చిన్న చిన్న కుందేళ్ళు అటు ఇటు దూకుతూ సభా ప్రాంగణం వద్దకు వచ్చాయి. కేశవుడు పరమేశ్వరుని కీర్తన పూర్తికాగానే శ్రీమన్నారాయణుల వారిని స్తుతిస్తూ కీర్తన పాడ సాగాడు. ఆహా! ఎంత అద్భుతంగా ఉంది కీర్తన! కేశవుడి నోటి నుంచి వచ్చే గాత్ర ప్రభావం

చేత ఎన్నో దివ్య తరంగాలు ఆ ప్రదేశమంతా ప్రసరింపసాగాయి. ఆ దివ్యతరంగాల ప్రభావం చేత అక్కడ చేరిన క్రూర మృగాలన్నీ తమ సహజ జాతి వైరం మరచి ఎంతో సఖ్యంగా ఒకదాని ప్రక్కన మరొకటి కూర్చుని, తాము అసలు కూర్చుని ఉన్నామా, నుంచొని ఉన్నామా అని కూడా ఆలోచించకుండా కేశవుడి గాత్రంతో ఒళ్ళు మరచిపోయాయి.

అక్కడ ఉన్న ఏనుగులలో రెండు ఏనుగులు అంతకుముందు కృతయుగంలో మానవ జన్మలలో జన్మించాయి. అనేక జన్మలలో ఎంతో పుణ్యం చేసుకొని ఒక రాజ్యానికి మహారాజు, రాజకుమారుడిగా ఉండేవారు. ఎప్పుడూ పరమేశ్వరుని సేవిస్తూ జీవితం గడిపారు. ఎంతో ప్రజారంజకంగా పాలించారు. ఇలా ఉండగా ఒకనాడు ఆ రాజు ఆస్థానంలో సభ నిర్వహిస్తున్నాడు. మంత్రులు, రాజ పురోహితులు, ఎంతో గొప్ప పండితులు కొలువై ఉన్నారు. అది కృతయుగం కావడంతో ప్రజలందరూ ధర్మపరంగా జీవిస్తున్నారు.

ఇంతలో ఒక ఆస్థాన నాయకి వచ్చి నాట్యం చేయసాగింది. అద్భుతమైన ఆ నాట్యానికి అందరూ ఎంతో సంతోషించారు. ఏనుగు తలకు రక్తం కారుతూ ఒక్కసారిగా ఆస్థానంలోకి అలా వచ్చేటప్పటికి మహారాజు ఆశ్చర్యపోయారు. కొంచెం కోపం కూడా తెచ్చుకున్నారు. ఎవరో విలుకాడు దూరం నుంచి ఏదో మృగాన్ని కొట్టబోతే అది గురి తప్పి ఈ ఏనుగు తలకు తగిలింది. ఆ ఏనుగు తనకు సహాయం చేయమని సరాసరి మహారాజు సముఖానికే వచ్చింది.

ఆ ఏనుగు వెనుకనే పరుగెత్తుకు వచ్చి మహాప్రభో నేను వేరే మృగానికి గురిపెట్టాను గాని దురదృష్టం కొద్దీ ఈ ఏనుగుకి తగిలింది నన్ను క్షమించండి అని అన్నాడు. అప్పుడు మహారాజు వెంటనే రాజ వైద్యుడిని పిలిపించి ఆ ఏనుగు గాయానికి వైద్యం

చేయించాడు. అక్కడతో ఆ ఏనుగు సంతోషంగా తిరిగి వెళ్ళిపోయింది. అలాగే మహారాజు ఆ విలుకాడుని కూడా క్షమించాడు. ఆ విలుకాడు రాజుకు నమస్కరించి తన గూడానికి తాను వెళ్ళిపోయాడు.

అయితే ఆ ఏనుగు వచ్చిన క్షణంలో రాజు ఒక్క క్షణం పాటు ఏనుగుపై కోపం తెచ్చుకోవడం వలన తరువాత ఎన్నో మానవజన్మలు ఎత్తినప్పటికి ఒక పది జన్మలలో ఏనుగు జాతిలో జన్మించాడు. అలాగే ఆనాటి విలుకాడు కూడా పొరపాటున కొట్టినప్పటికి ఏనుగుకి బాధ కలిగించడం చేత తరువాత జన్మలలో రెండుసార్లు ఏనుగు జన్మ ఎత్తాడు. ఈ రోజు ఇక్కడకి వచ్చిన ఏనుగుల గుంపులో వారిరువురూ కూడా ఉన్నారు.

7

ఇక మనం మళ్ళీ కేశవుడి గానం వద్దకు వద్దాం. కేశవుడు ఎంతో అద్భుతంగా అనేక కీర్తనలు చేసాడు. అక్కడ కూర్చున్న మహర్షులందరికి తన దివ్య దృష్టితో కేశవుడు ముందు ముందు జన్మలలో ఎక్కడెక్కడ జన్మించబోతున్నాడో అర్థమయింది. కలియుగంలో నాలుగు జన్మలలో ఇతడు గొప్ప సంగీత విద్వాంసుడుగా జన్మించి భగవంతుని ఎంతో కీర్తించాడు. భగవంతుడు ఎంతో ఆనందపడ్డాడు. అలాగే ప్రజలందరూ కూడా అతని కీర్తనలకు ఎంతో ప్రభావితులై భక్తి మార్గం వైపు పయనించారు.

కేశవుని తరువాత విశ్వనాథుడు అనే విద్వాంసుడు వచ్చాడు. అతను ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్నాడు. అతడి ఆహార్యం కూడా ఎంతో అద్భుతంగా ఉంది. అతడు పాటను ప్రారంభించగానే ఆ ప్రాంతం అంతా గొప్పగా ఢమరుక ధ్వని వినిపించింది. అది విని అక్కడ ఉన్నవారందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఆ అద్భుత ధ్వని ఎక్కడినుంచి వస్తున్నదో ఎవ్వరికీ తెలియలేదు. అయితే అక్కడ ఉన్న

కొందరు మహర్షులకు అర్థమయింది. పరమేశ్వరుడు అదృశ్యరూపంలో అక్కడే ఆ ప్రాంగణంలోనే ఉండి ఈ సంగీత విద్వాంసుల గాత్ర మాధుర్యానికి ఎంతో ఆనందపడి ఒక్కసారిగా ఢమరుకం వాయించాడు. ఆ అద్భుత ధ్వనితో అందరి శరీరాలు ఉప్పొంగిపోయాయి. ఇది విని శ్రీమన్నారాయణుల వారు కూడా ఎంతో సంతోషించారు. శివకేశవులు ఇద్దరు ఈ విశ్వనాధుడు ద్వాపర, కలియుగాలలలో అనేక జన్మలలో జన్మించి గొప్ప విద్వాంసుడిగా పేరు సంపాదించుకుంటాడని అనుగ్రహించారు.

విశ్వనాధుడు ఎంతో అద్భుతమైన కీర్తనలు పాడి అందరిని అలరించాడు. అతని కీర్తనలు వింటూ నెమళ్ళు నృత్యం చేయసాగాయి. లేళ్ళు పూర్తిగా మైమరచి తలలు పైకెత్తి ఆ గాత్ర మాధుర్యాన్ని వింటున్నాయి.

ఈ సృష్టిలో సర్వజీవులు సంగీతానికి ఎంతో ఆకట్టుకోబడతాయి. ముఖ్యంగా కృత, త్రేతా యుగాలలో సంగీత ధ్వని వినబడినపుడు అలా నిలిచిపోయి ఎంతో ఆనందంగా వినేవి కలియుగంలో ధర్మం పూర్తిగా తగ్గిపోవడంతో మానవులతో పాటు జంతువులకు కూడా అనేక రకాల వినికిడి శక్తులు పూర్తిగా తగ్గిపోయాయి.

అలా ఆరోజు ఎందరో మహానుభావులు ఎంతో గొప్పగా అక్కడ ఉన్న వారందరిని తన గాత్ర మాధుర్యంతో అలరించారు. ఆనాటి ఆ సంగీత విద్వాంసులు తరువాత తరాలలో అనేక సార్లు మహా విద్వాంసులుగా జన్మించారు. వారి అద్భుత గాత్ర, వాయిద్య సంగీతాలతో భగవంతుడిని, ప్రజలని కూడా ఎంతో అలరించారు.

ఇలా అటు తరువాత కాలంలో జన్మించిన వారిలో త్రేతా యుగంలో జన్మించిన విశ్వపాదుడు అనే గొప్ప సంగీతకారుడొకడు

ఉండేవాడు. విశ్వపాదుడు త్రేతాయుగంలో ఈనాటి కాలిఫోర్నియా ప్రాంతంలో ఒక గొప్ప మహర్షి దంపతులకు జన్మించాడు. విశ్వపాదుడు జన్మించగానే 2000 కిలోమీటర్ల వరకు ఉన్న పక్షులు అన్నీ కూడా ఎంతో అద్భుతంగా గొంతెత్తి శ్రావ్యంగా కూసాయి. ఆరోజు ప్రకృతి అంతా ఎంతో వింత శోభను పెంపొందించుకుంది.

అక్కడ దగ్గరలో ఉన్న అడవులలో తపస్సు చేసుకుంటున్న ఎందరో మహా మునులకు, సాధనలో ఉన్న మహా పురుషులకు విశ్వపాదుడు జన్మించే సమయంలో విశ్వం నుంచి బ్రహ్మాండమైన దివ్య తరంగాలు వినబడ్డాయి. ఆ దివ్య శబ్ద తరంగాలు వీళ్ళ జీవకోటి మొత్తానికి మనస్సులు, శరీరాలు ఎంతో హాయిగా ఉన్నాయి.

ఆ మహాపురుషులందరికి అప్పుడు ఒక గొప్ప సంగీత విద్వాంసుడు ఈ భూమిమీద జన్మిస్తున్నాడని అర్థమయింది. అతడు తన అద్భుత సంగీత గానంతో భగవంతుని, ప్రపంచాన్ని ఎంతో ఆనందింపజేస్తాడని వారికి అవగతం అయ్యింది. ఆ చిన్ని శిశువుకు తల్లిదండ్రులు విశ్వపాదుడు అని నామకరణం చేసారు. బాలుడు జన్మించి 21 రోజులు అయింది. ఆరోజు ఆ పసివాడి నోటివెంట అద్భుతమైన రాగం వెలువడింది.

ఆ రాగం విని చుట్టుప్రక్కల ఆశ్రమాలలో గల అనేక నెమళ్ళు వచ్చి వారి ఇంటిబయట పురివిప్పి నాట్యం చేయసాగాయి. చుట్టు ప్రక్కల చెట్లపై పక్షులు ఎంతో చక్కగా గొంతెత్తి పాడాయి. ఆ కాలంలో శృత అనే ఒక గొప్ప పక్షి ఉండేది. ఈ పక్షి త్రేతాయుగంలో మాత్రమే ఉన్నది .త్రేతా యుగంలో కొన్ని లక్షల సంవత్సరాలు ఉన్న ఈ పక్షి జాతి అటు తరువాత పూర్తిగా అంతరించిపోయింది. ఆ శృత అనే పక్షి ఒక దేవగణానికి చెందినది. కేవలం దేవలోకాలలో మాత్రమే ఉండేది. శాపవశాత్తు ఈ పక్షిజాతి ఈ భూమిమీద జన్మించింది.

ఒకనాడు ఒక గంధర్వ దంపతులు ఎంతో అద్భుతంగా గానం చేస్తూ దేవలోకంలో విహరింప సాగారు. ఆనాడు శ్రీమన్నారాయణులవారు అక్కడ ఒక ప్రదేశంలో కూర్చొని ధ్యానం చేసుకుంటున్నాడు. ఈ గంధర్వ దంపతులిద్దరు అలా గానం చేస్తూ, నృత్యం చేస్తూ మైమరచి శ్రీమన్నారాయణులవారు ఉన్న ప్రాంతానికి వచ్చారు.

శ్రీ స్వామి వారు ధ్యానంలో ఉన్న విషయం గ్రహించక వారు తమ నృత్యం అలా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇంకా ఇంకా ఆనందంతో గట్టిగా పాడుతూ ఇటు అటు తిరుగుతూ నృత్యం చేయసాగారు. శ్రీమన్నారాయణులవారి ధ్యానం భంగం కలిగి వీరిని చూసారు. తాను అక్కడ ధ్యానం చేసుకుంటున్నాను అన్న ఆలోచన కూడా లేకుండా ఇలా గానం చేస్తూ, నాట్యం చేస్తున్న ఆ గంధర్వ జంటను భూలోకంలో పక్షులుగా జన్మించమని శపించారు. అప్పుడు ఆ దంపతులిద్దరూ శ్రీమన్నారాయణుల వారి పాదాలపై పడి తమ తప్పు మన్నించి, తమను క్షమించవలసిందిగా ప్రార్థించారు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు ఆ గంధర్వ జంటతో ఇలా అన్నారు. మీరిద్దరూ ఈ క్షణంలోనే భూమిపై పక్షులుగా జన్మిస్తారు. ప్రస్తుతం కృతయుగం నడుస్తున్నది. మీ పక్షిజాతి శృత అనే నామంతో పిలవబడుతూ ఉంటుంది. ఇప్పటి నుంచి త్రేతాయుగం వరకు ఈ పక్షిజాతి భూలోకంలోనే ఉంటారు. అనేక అడవులలో చెట్లపై ఎగురుతూ ఎంతో దివ్య గానం చేస్తారు.

ఎంతో శ్రావ్యమైన మీ గానం విని సామాన్య మానవుడు కూడా సంగీతం నేర్చుకొనడానికి ఎంతో ఇష్టపడతారు. అంత అద్భుతంగా మీరు మీ గొంతులతో ఎన్నో రాగాలను ఎంతో అద్భుతంగా పాడతారు. అలాగే మీ జాతి ఎప్పుడూ సహజంగానే మరణిస్తుంది. ఏ

విలుకాడు మిమ్మల్ని చంపాలని బాణం వేసిన అది మిమ్మల్ని తగలగానే పుష్పంగా మారిపోతుంది. మీరు సమస్త జీవకోటిని మీ అద్భుత గానంతో రంజింపచేస్తారు. నేను త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా అవతరిస్తాను. ఒకసారి నేను కొండలపై వనాలలో విహరిస్తూండగా ఒక గొప్ప దేవతా వనానికి చేరుకుంటాను. ఆనాడు మీ జాతి పక్షి ఒకటి నన్ను చూస్తుంది. నాలోని శ్రీమన్నారాయణుని అంశను గమనించి అప్పుడు ఆపక్షి ఎంతో అద్భుతంగా గానం చేస్తుంది. ఆనాటి నా దర్శనంతో మీ పక్షిజాతికి శాప విముక్తి కలుగుతుంది. తిరిగి మీరు మీ దేవలోకం చేరుకుంటారు అని శ్రీమన్నారాయణుల వారు ఆ గంధర్వ దంపతులకి సెలవిచ్చారు. ఆ గంధర్వ దంపతులిద్దరూ శ్రీమన్నారాయణల వారి వద్ద ఆశీర్వాదం తీసుకొని తక్షణం భూలోకంలో పక్షిరూపంలో జన్మించారు.

8

ఆరోజు విశ్వపాదుడు జన్మించి 21వ రోజు. ఈ శృత పక్షులన్నీ ఎంతో అద్భుతంగా గానం చేసాయి. ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ గానం! అక్కడ చెట్లపై దాదాపు 40 శృత పక్షులు ఉన్నాయి. అవి ఒక ఐదు ఒకసారి, మరొక ఐదు మరోసారి తరువాత మరొక ఐదు అటుతరువాత మరొక ఐదు ఇలా ఐదు ఐదు చొప్పున వివిధ రాగాలను ఆలపిస్తూ ఉంటే ప్రకృతి అంతా ఎంతో పులకించిపోయింది. దగ్గరలో పొదలో ఉన్న నాగులు బయటకు వచ్చి ఎంతో ఆనందంతో నృత్యం చేయసాగాయి. ప్రక్కన ఉన్న కుందేళ్ళు ఆనందంతో అటూ ఇటూ గెంతసాగాయి.

అలా ఈ శృత పక్షుల అద్భుత గానం దాదాపు రెండు గంటలు సాగింది. ఆ రెండు గంటలు అన్ని జంతువులు సహజవైరం మరచి ఆనందంతో ఎగురుతూ కలిసి మెలిసి గడిపాయి. అప్పుడు విశ్వపాదుని తల్లిదండ్రులకు అర్థమయింది. తమకు జన్మించిన బాలుడు భవిష్యత్తులో గొప్ప సంగీత విద్వాంసుడు కాగలడని అప్పుడు

వారికి అర్థమయింది. అవి ఎన్నో జన్మల పుణ్యఫలంగా వారు భావించి తమ భాగ్యానికి ఎంతో సంతోష పడ్డారు.

విశ్వపాదుడు పెద్దవాడవుతూ రోజు ఎంతో గొప్ప సంగీత సాధన చేసేవాడు. అనేక రాజ్యాలకు తన స్నేహితులతో కలిసి వెళ్ళి ఎంతో గొప్పగా పాడేవాడు. అతడి సంగీత జ్ఞానానికి ఆ దేశపు రాజులు ఎంతో ఆనందపడి విశ్వపాదుడికి ఎన్నో గొప్ప ఆభరణాలు, ఎన్నో గొప్ప కానుకలు ఇచ్చేవారు. ఇంత విద్వత్తు ఉన్నప్పటకి విశ్వపాదునిలో ఏ మాత్రం అహంకారం ఉండేది కాదు. అందరితో ఎంతో అణకువతో మాట్లాడేవాడు. అతడు వెళ్ళిన ప్రతి రాజ్యంలోను అక్కడి ప్రజలు అతడికి నీరాజనాలు అందించేవారు. కొందరు గొప్ప సంగీత వేత్తలుకూడా అతడి స్వర మాధుర్యానికి ఎంతో సంతోషపడి విశ్వపాదుడిని ఎంతో అభినందించేవారు.

ఒకనాడు విశ్వపాదుడు తన శిష్యబృందంతో ఒక రాజ్యం నుండి మరొక రాజ్యానికి వెళుతూ సాయంత్రం కావడంతో ఒక పల్లెటూరిలో ఆగాడు. అప్పుడు వారి వద్దకు ఒక రైతు పరిగెత్తుకుంటూ వచ్చి మా భార్య పురుటి నొప్పులతో ఎంతో బాధపడుతున్నది ఉదయం నుంచి ఎంతో ఇబ్బంది పడుతున్నది. మీ బృందంలో వైద్యుడు ఎవరైనా ఉన్నారా అని ఎంతో అమాయకంగా అడిగాడు .

అప్పుడు విశ్వపాదుడు ఆ రైతుతో నువ్వు మీ ఇంటి నుంచి ఇక్కడకి రావడానికి ఎంత సమయం పట్టింది అని అడిగాడు. అతడు దాదాపు ఒక గంటసేపు నడచి వచ్చానని చెప్పాడు. అప్పుడు విశ్వపాదుడు అతనితో నాయనా నువ్వు ఎటువంటి ఆందోళన పడవద్దు. నువ్వు ఇంటికి వెళ్ళేటప్పటకి నీ భార్యకు సుఖ ప్రసవం జరిగి పండంటి మగపిల్లవాడు జన్మిస్తాడు అని అన్నాడు. ఆ మాటలకు ఆ రైతు ఎంతో సంతోషపడి విశ్వపాదుడికి సాష్టాంగ నమస్కారం చేసి తిరిగి ఇంటిదారి పట్టాడు.

ఆరైతు వెళ్లిన మరుక్షణమే విశ్వపాదుడు ఒక్క క్షణం ధ్యానం చేసి ఒక గొప్ప కీర్తన ఆలాపన చేయసాగాడు. అప్పటికి రాత్రి చీకటి పడడం ప్రారంభం అయింది. అయినా విశ్వపాదుడు ఆ కీర్తన పాడడం ఆగకుండా ఎంతో గొప్పగా పాడసాగాడు. అలా పాడుతుండగా అతడి నోటి నుంచి వెలువడిన దివ్య శబ్ద తరంగాలు అద్భుతంగా ఎంతో వేగంగా ప్రయాణం చేసి ఇందాక వచ్చిన ఆ రైతు ఇంటిదాకా ప్రసరించాయి.

అంతే! ఆ దివ్య తరంగాల ప్రభావం చేత ఆ రైతు భార్యకి వెంటనే తేలికగా ప్రసవం జరిగింది. పండంటి మగపిల్లవాడు జన్మించాడు. కాసేపటికి ఇంటికి వచ్చిన రైతు ఎంతో సంతోషపడ్డాడు. తరువాత ఉదయమే పాలు, పండ్లు తీసుకొని పరుగెత్తుకుంటూ విశ్వపాదుడు ఉన్న ప్రదేశానికి వెళ్ళి అతడికి, అతడి శిష్యునికి ఇచ్చి ఆనందంతో కన్నీరు కార్చాడు.

విశ్వపాదుడు అతడిని ఆశీర్వదించి నిన్న జన్మించిన ఆ పిల్లవాడు భవిష్యత్తులో గొప్ప పండితుడు అవుతాడని చెప్పాడు. అది విని ఆ రైతు ఎంతో సంతోష పడ్డాడు. విశ్వపాదుడు తన శిష్యునితో తన ప్రయాణం ముందుకు కొనసాగించాడు.

సంగీతం ఎంతో మహత్తరమైన శక్తి గలది. గొప్ప విద్వాంసులు సంగీత కీర్తనలు పాడేటప్పుడు ప్రకృతి అంతా పులకిస్తుంది. ఆ సమయంలో మనం ప్రకృతిలో ఎన్నో అద్భుతాలు గమనించవచ్చు. సమస్త జీవకోటి సంగీతంతో పరవశిస్తుంది.

మన మనస్సు ప్రశాంతంగా లేనప్పుడు చక్కటి సంగీతం వింటే మన మనస్సు తేలికపడడం మనం గమనిస్తూనే ఉంటాము. సంగీతం ఎన్నో మానసిక, శారీరక ఋగ్మతలను కూడా తగ్గిస్తుంది. సంగీతానికి ఎంతో దైవశక్తి ఉంది.

కృత, త్రేతాయుగాలలో మానవ సంగీతానికి ఎంతో శక్తి ఉండేది. ఆరోజుల్లో ప్రజలందరూ ఎంతో ధర్మపథంలో జీవించేవారు. అందువలన ప్రకృతి ఎంతో నిర్మలంగా, ఎటువంటి కాలుష్యం లేకుండా ఉండేది. అందుచేత ఆ కాలంలో శబ్దతరంగాలకు ఎంతో శక్తి ఉండేది. ఒక్కో సంగీత విద్వాంసుడు గొప్పగా పాడుతుంటే ఆ దివ్య తరంగాల శక్తిచేత ఆ చుట్టుప్రక్కల కొన్ని యోజనాల మేరకు ఎంతో చక్కటి తరంగాలు వ్యాపించేవి.

ఆ శబ్ద తరంగాల ప్రభావం వలన ఆ పరిధిలో ఉండే అందరి ఆరోగ్యం ఎంతో బాగుంటుంది. ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. అందుకే ఆ రోజులలోను సంగీతకారులు ఎన్నో ప్రదేశాలలో తిరుగుతూ ఎంతో గొప్పగా గానం చేసేవారు. ఆ దివ్య శబ్దతరంగాల అద్భుత ప్రభావం వలన ఆనాటి కాలంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించి ఎటువంటి అనారోగ్యాలు లేకుండా కొన్ని వేల సంవత్సరాలు జీవించి కేవలం వార్ధక్యం కారణం గానే మరణించేవారు. వారికి ఇప్పటి మానవులవలే ఎటువంటి అనారోగ్యము కలిగేది కాదు.

9

అది కృతయుగంలోని ఒక మాఘ పౌర్ణమి రోజు. ఆరోజు ఆ ప్రదేశం అంతా దట్టమైన అడవులు, పెద్ద పెద్ద కొండలు, కొండలపై పెద్ద వృక్షాలు, ప్రక్కనే సముద్రపు ఒడ్డుపొడవునా ఎంతో ఎత్తైన చెట్లు, మధ్య మధ్యలో మహర్షుల దివ్య ఆశ్రమాలు ఆ దృశ్యమంతా ఎంత అద్భుతంగా ఉందో చూడండి. ఆ అద్భుత ప్రకృతి సౌందర్యాన్ని గమనించండి. ఆ చెట్లన్నీ ఎంతో ఎత్తుగా ఆకాశాన్ని అంటుకున్నట్లున్నాయి.

కొన్నిచోట్ల ఆ చెట్లు అతి దగ్గరగా దట్టంగా ఉండి సూర్యరశ్మి కూడా భూమిపై పడడం లేదు. ఆ ఆశ్రమాల మధ్య అక్కడక్కడ తపస్సు చేసుకుంటున్న మహర్షులు, చక్కటి పూల చెట్లనుంచి భర్తల పూజకై పూలు కోస్తున్న ముని పత్నులు... అక్కడక్కడ పరిగెడుతూ మధ్య మధ్యలో వేదం వల్లెవేస్తున్న చిన్న చిన్న ముని బాలురు ఆహా ఎంత అద్భుతంగా ఉంది ఈ దృశ్యం! అక్కడ వాతావరణం కూడా చాలా చల్లగా ఉంది. అక్కడ వారందరికి ఈ చల్లటి వాతావరణం ఎప్పుడూ అలవాటే.

ఇప్పుడు అసలు అద్భుతం గమనించండి. అక్కడ ఒక మహర్షి చాలా తీవ్ర ధ్యానంలో నిమగ్నమై ఉన్నాడు. మధ్య మధ్యలో ఆ మహాపురుషుడు ఎందుకో కొంచెం నొసలు చిట్లిస్తున్నాడు. అతడి మనో ఫలకంపై రాబోయే యుగాలు గోచరం అవుతున్నాయి. అది అతడి వ్యాకులతకు కారణం. ముందు ముందు రాబోయే యుగాలలో ఈ పవిత్ర ప్రదేశాలలో ఎన్నో మార్పులు వస్తాయి.

అవన్నీ ఆ మహర్షి మనోనేత్రంతో చూసి ఎంతో బాధపడుతున్నాడు. వచ్చే ద్వాపరయుగంలో ఈ ప్రదేశంలో ఒక రాజ్యం వెలుస్తుంది. పెద్ద పెద్ద భవంతులు వస్తాయి. రాజ ప్రాసాదాలు వస్తాయి అయితే ద్వాపరయుగం చివరికి ఈ భవంతులు అన్నీ మట్టిలో కలిసిపోతాయి. కలియుగం ప్రారంభమైనప్పుడు ఇక్కడ కొన్ని వేల సంవత్సరాల పాటు మానవ సంచారమే ఉండదు. కేవలం జంతువులు మాత్రమే తిరుగుతాయి

ప్రకృతి ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఎన్నో రకాల జంతువులు ఈ అరణ్యాలలో స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి. ఆ మహర్షి మదిలో ఇవన్నీ గోచరిస్తున్నాయి. అంతే కాదు కలియుగం వచ్చిన 2000 సంవత్సరాలకు ఇక్కడ నెమ్మదిగా జనావాసాలు వెలుస్తాయి. ప్రజలు నెమ్మదిగా ఇక్కడకి రావడం ప్రారంభిస్తారు. ఇక్కడ చెట్లన్నీ కొట్టివేయబడతాయి. పెద్ద పెద్ద భవంతులు వెలుస్తాయి. ఆ జంతువులన్నీ స్వేచ్ఛగా తిరగడానికి అవకాశం కూడా ఉండదు.

ఆ మహర్షి తన దివ్య దృష్టితో ముందు ముందు యుగాలలో ఇదే ప్రదేశంలో ఎన్ని మార్పులు రానున్నాయో గమనిస్తున్నాడు. ఈ ప్రశాంత వాతావరణం మొత్తం పూర్తిగా మారిపోతుంది. ఇది యుగ ధర్మం ఇది భగవన్నిర్ణయం. ఇది కాల స్వరూపం. ఇది కాల గమనం. ఇది సృష్టి గమనం. ఒకే ప్రదేశంలో

అనేక కాలాలలో అనేక రకాల జీవన విధానాలు, అనేక రకాల భవంతులు, మానవ వాసాలు ఏర్పడడం... భూమితో కలిసిపోవడం... తిరిగి క్రొత్తరకం సంస్కృతులు కొత్త జీవన విధానాలు... క్రొత్త భవంతులు ఇది సృష్టి గమనం...ఇది కాలగమనం.

ఈ కాలగమనంలో ఏదైనా ఎంతటి గొప్పదైనా కనుమరుగు కావలసిందే ఏదీ శాశ్వతం కాదు. ఇలా కోట్లాది సంవత్సరాలలో ఎన్నో వేల సంస్కృతులు వచ్చి వెళ్ళిపోయాయి. ఆ సంస్కృతులతో పాటు వాటి చరిత్ర కూడా కాలగర్భంలో కలిసిపోయింది.

త్రేతాయుగంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రుల వారు నివసించిన గొప్ప రాజ భవనాలు కూడా శ్రీరామావతారం సమాప్తి అయిన వేల సంవత్సరాలకు పూర్తిగా నేలలో కలిసిపోయాయి. అటుతరువాత దాదాపు లక్ష సంవత్సరాలు ఆ ప్రదేశంలో ఎటువంటి జన సంచారం లేదు.

కొన్ని లక్షల సంవత్సరాల తరువాత ద్వాపరయుగంలో మళ్లీ అదే ప్రదేశంలో కొన్ని మహర్షుల ఆశ్రమాలు ఏర్పడ్డాయి. ఆ ఆశ్రమాలు కూడా 2,00,000 సంవత్సరాలు ఉండి అటు తరువాత మాయమై అక్కడ జనావాసాలు రావడంతో ఆ మహర్షులు వేరే దట్టమైన అడవులలోనికి వెళ్లిపోయారు. ఈ ప్రదేశం అంతా ఒక పెద్ద రాజ్యం ఏర్పడింది ఎన్నో భవంతులు ఏర్పడ్డాయి.

శ్రీరామచంద్రులవారు జన్మించిన భవంతి ఉన్నచోట ఒక పెద్ద భవంతి వచ్చింది. కాలగమనంలో ఎన్ని మార్పులు ఇన్ని కోట్ల సంవత్సరాలలో ఒక్క పవిత్ర ప్రదేశంలో ఎన్నో రకాల భవంతులు... ఎన్నో రకాల సంస్కృతులు. ఇదే భగవత్‌లీల. ఇదే భగవత్ స్వరూపం.

అది త్రేతాయుగంలో ఒక సంవత్సరంలో ఎంతో పవిత్రమైన రోజు ఆ రోజు అక్కడ ఒక గొప్ప యజ్ఞం జరుగుతోంది. ఆ ప్రదేశం కలియుగంలోని ఇప్పటి ఉత్తరప్రదేశ్ ప్రాంతంలో ఉంది. ఈ ప్రదేశం అంతా ఒక 20,000 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రాంతం నిండా పెద్ద పెద్ద కలప దుంగలు, ఎన్నో లోహపు వస్తువులు, లోహపు పనిముట్లు ఇంకా ఎన్నో రకాల ఆయుధాలు కనిపిస్తున్నాయి చూడండి.

ఈ 20,000 వేల ఎకరాల ప్రదేశం ఆకాశం నుంచి చూస్తూ ఉంటే ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. ఈ ప్రాంతం మధ్యలో మహర్షులు కూర్చుని మహా యజ్ఞం నిర్వహిస్తున్నారు. వారికి కొంచెం దూరంలో మహారాజులు, రాజకుమారులు చేతులు కట్టుకొని నిరాడంబరంగా నుంచొని ఉన్నారు.

ఇక్కడ ఏదో అద్భుత కార్యం జరగబోతోంది అనిపిస్తుంది. వీళ్ళందరూ ఏమి చేస్తారో చూద్దాం ఆ మహారాజులకు వెనకాల కొద్ది దూరంలో సేనాపతులు నుంచొని ఉన్నారు. వారి వద్ద ఎంతో కాంతిలో మెరిసిపోతున్న బాణాలు ఉన్నాయి. ఆ ప్రదేశంలో చుట్టూ పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. మధ్యలో అక్కడక్కడ ఒక 10 ఎకరాల ప్రాంతాలు చదునుగా ఉన్నాయి.

ఇటువంటివి ఒక 30, 40 ప్రాంతాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాలు మధ్యలో చదునుగా ఉండి చుట్టూ ఎంతో పెద్ద చెట్లతో ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఇందాక చెప్పినట్లు కొన్నింటిలో పెద్ద కలప దుంగలు, కొన్నింటిలో లోహపు పనిముట్లు, పెద్ద పెద్ద ఇనుప రేకులు వగైరా ఉన్నాయి.

ఆ రోజు అక్కడ మహర్షులు చేస్తున్న యజ్ఞం పూర్తి అయ్యేటప్పటికి మధ్యాహ్నం 4.00 గం॥లు అయ్యింది. వేద పండితుల

వేద ఘోషతో ఆ ప్రాంతమంతా అద్భుత శక్తి తరంగాలతో నిండిపోయింది. ఇప్పుడు నాకు అంతా వివరంగా అర్థమవుతుంది. ఈ ప్రదేశం ఏమిటి ఈ ప్రదేశంలో ఈ రోజు ఈ యజ్ఞం ఎందుకు చేస్తున్నారో తెలిసింది. ఈ ప్రదేశమంతా ఒక పెద్ద కర్మాగారమని అర్థమయింది.

త్రేతాయుగంలో మహారాజులకు కావలసిన యుద్ధ సామాగ్రి మొత్తం ఇక్కడే తయారు చేసేవారు. మహారాజులు వాడే ఆయుధాలే కాకుండా మహారాజులు ఉపయోగించే పెద్ద పెద్ద రథాలు కూడా ఇక్కడే తయారు చేయబడతాయి. ఎన్నో వేల మంది పనివారు ఈ తయారీలో పాల్గొంటారు. అందరూ ఎంతో దీక్షతో, ఎంతో ఏకాగ్రతతో ఈ కర్మాగారంలో పనిచేస్తారు.

ఆ రోజు శ్రీరామచంద్రులవారు యుద్ధంలో ఉపయోగించే రథం తయారుచేయబోతున్నారు. ఇలా ఏదైనా ఒక గొప్ప పని తలపెట్టిననాడు ఇక్కడ ఒక పెద్ద యజ్ఞం చేస్తారు. ఆరోజు సాక్షాత్తూ శ్రీరామచంద్రులవారు ఉపయోగించే రథం చేయడం మొదలుపెట్టడం అంటే ఎంత గొప్ప విషయం, ఎంత అద్భుతం అందుకే అక్కడ గొప్ప ఋత్విక్కులతో ఒక పెద్ద యజ్ఞం నిర్వహిస్తున్నారు.

ఆహా ఆ ప్రదేశం అంతా ఎంత దివ్యంగా ప్రకాశిస్తున్నదో. ఈ యజ్ఞం జరుగుతున్నంత సేపు వేద పండితుల చేత గొప్ప వేద పఠనం జరుగుతోంది. ఈ రథం తయారు చేయబోయే నిపుణులైన వ్యక్తులందరూ ప్రత్యేకమైన వస్త్రధారణ, ప్రత్యేకమైన తలపాగాలు ధరించి ఒక ప్రక్కగా నుంచొని ఉన్నారు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారే శ్రీరామచంద్రులుగా ఈ భూమిపై జన్మించి వారు వాడబోయే ఈ

రథం ఎంత గొప్పదై ఉంటుందా అని సకల దేవతలు ఆకాశం నుండి ఎంతో ఆశ్చర్యంతో, ఎంతో ఆనందంతో చూస్తున్నారు.

శ్రీరామచంద్రుల వారి రథం చేయడానికి ఉపయోగించే సామాగ్రి అంతా అక్కడ ప్రక్కనే ఉన్న ఒక 10 ఎకరాల స్థలంలో ఉంచబడింది. యజ్ఞం పూర్తికాగానే మహర్షులందరూ మంత్రజలం తీసుకొని అక్కడ రథం తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నవారిపై చల్లారు. తరువాత వేద పండితులు వేద మంత్రాలు చదువుతూ వెంటరాగా రథం తయారుచేయబోయే ప్రదేశానికి వెళ్ళి అక్కడ ఉన్న సామాగ్రిపైన, పనిముట్లపైనా కూడా చల్లారు. అప్పుడు అక్కడ పరమేశ్వరుడు అదృశ్యరూపంలో సంచరిస్తున్నట్టు ఆ మహర్షులలో కొందరికి తెలిసింది. వారంతా ఎంతో ఆనందంతో సామగానం చేసారు. ఆ ప్రదేశం అంతా దివ్య తరంగాలతో నిండిపోయింది.

దాదాపు 10,000 వేల ఎకరాల ఆ ప్రదేశం అంతా ఆకాశం నుండి చూస్తుంటే ఎంతో అద్భుతంగా ఉంది. త్రేతాయుగంలోని అనేక రాజ్యాలలోని రాజులకు కావలసిన యుద్ధ సామాగ్రి అంతా అక్కడే తయారుచేయబడుతుండేవి. శ్రీరామచంద్రుల వారు ఉపయోగించే రథం తయారుచేసే ముహూర్తం రాగానే అక్కడ ఉన్న నిపుణులు పని మొదలుపెట్టడం ప్రారంభించారు.

అక్కడ ఉన్న కలప దుంగలు, లోహపు సామాగ్రికి ఇంకా అక్కడ ఉన్న ఎన్నో పనిముట్లకు అన్నిటికి వారు ఒక్కసారి నమస్కరించారు. ఆ శుభముహూర్తంలో లక్ష్మణ, భరత, శతృఘ్నుల రథాలు కూడా తయారుచేయడం మొదలుపెట్టారు. మహర్షులందరూ అప్పుడే పూజ పూర్తిచేసుకొని తిరిగి యాగశాలకు వచ్చారు. ఇంతలో దూరంగా పెద్ద జనప్రవాహం ఇటువస్తూ కనబడుతున్నది. అదిగో అటుచూడండి సాక్షాత్తూ శ్రీరామచంద్రులవారే లక్ష్మణ, భరత,

శత్రుఘ్నులతో కలిసి ఇటువైపుగా వస్తున్నారు. వారందరూ ఇక్కడకి రాగానే అక్కడ ఉన్న వారందరూ శ్రీరామచంద్రులవారికి ఎంతో వినయంగా నమస్కరించారు.

శ్రీరామచంద్రుడు అప్పుడు వారందరిని చిరునవ్వుతో ఆశీర్వదించాడు. మహర్షుల దగ్గరకి వచ్చి కుశల ప్రశ్నలు వేసాడు. అక్కడ ఉన్న అనేక రాజులను పలకరించాడు. అటుతరువాత శ్రీరామచంద్రుడు ఈ రథాన్ని తయారుచేయబోయే వారి వద్దకు వెళ్ళి వారితో కాసేపు మాట్లాడి వారిని ఆశీర్వదించాడు.

శ్రీరామచంద్రుల వారు ఎంత దివ్య తేజస్సుతో మెరిసిపోతున్నాడో చూడండి. ఆస్వామి తేజస్సుతో ఆ పరిసర ప్రాంతాలన్నీ ఎంతో ప్రకాశవంతంగా మెరిసిపోతున్నాయి. ఆ దివ్య తేజస్సుతో ఆ చుట్టు ప్రక్కల కొన్ని కిలోమీటర్ల వరకు ఎంతో గొప్ప దివ్య తరంగాలు వ్యాపించి ఉన్నాయి. శ్రీ స్వామి వారి చిరునవ్వు సమస్త జీవకోటిని సమ్మోహన పరుస్తుంది.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారి స్వరూపమే అయిన శ్రీరామచంద్రుల వారే స్వయంగా అక్కడకి రావడంతో ప్రకృతి అంతా పులకరించింది. ఒక చిన్న పక్షి ఎక్కడినుంచో ఎగురుతూ వచ్చి స్వామి భుజంపై వాలింది. ఆ పక్షిని చూసి శ్రీస్వామి వారు చిరునవ్వు నవ్వారు ఆ పక్షి ఎంతో ఆనందపడి కాసేపు అలాగే ఉండి తిరిగి ఎగిరి వెళ్ళిపోయింది.

ఇంతలో కొన్ని లేడిపిల్లలు స్వామి దగ్గరకు వచ్చి స్వామి వారి ముఖంలోకి ఆనందంగా, తన్మయత్వంగా చూస్తున్నాయి. స్వామి వారి తలలపై నిమిరారు. ఆ లేడి పిల్లలు ఎంతో ఆనందపడి చెంగుచెంగున అటూ ఇటూ పరుగెత్తుతున్నాయి.

శ్రీరామచంద్రుల వారు అలా కాసేపు అటూ ఇటూ తిరిగి రాజప్రసాదానికి వెళ్ళిపోయారు. లక్ష్మణ, భరత, శతృఘ్నులు కూడా వారి అన్నగారితో కలిసి రాజభవనానికి వెళ్ళిపోయారు. ఆనాడు మొదలైన శ్రీరామచంద్రులవారి రథం ఆరు నెలలలో ఎంతో అద్భుతంగా తయారుచేయబడింది. ఆ రథం చూడడానికి ఎంతో అద్భుతంగా ఉండి ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తున్నది.

10

అది 14వ మహాయుగంలో ఒక సంవత్సరంలో కార్తీక పౌర్ణమిరోజు. ఆ రోజు భరత ఖండంలోని మహాపుణ్యక్షేత్రమైన కాశీ మహానగరం ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తోంది. ఆనాటి కాశీనగరానికి ఇప్పటి ఈ మహాయుగంలోని కలియుగంలో మనం చూస్తున్న కాశీనగరానికి చాలా తేడాఉంది. చలికాలంలో కాశీనగరంలో ఉష్ణోగ్రత మైనస్ 45 డిగ్రీల దాకా పడిపోయేవి.

అంతేకాక ఎప్పుడూ అక్కడ వీధులలో పెద్ద పెద్ద నాగుపాములు సంచరిస్తూ ఉండేవి. ఆలయం కూడా ఇప్పటిలాగా లేదు ఆ మహాయుగంలో కాశీవిశ్వనాథుని ఆలయం, ఎంతో అద్భుతంగా, ఎంతో దివ్యంగా ఉన్నది ఆ ఆలయం, పరిసర ప్రాంతాలు ఎంత తేజస్సుతో ప్రకాశిస్తున్నాయో చూడండి.

మన మనోఫలకంపై ఆ దివ్య ధామం, సృష్టిలో అతి పవిత్రమైన దేశం ఎంత తేజస్సుతో ప్రకాశిస్తున్నదో చూసి

ఆనందించండి. ఆరోజుల్లో శ్రీ విశ్వనాథుని ఆలయం నుంచి నాలుగువైపులకు నూరు కిలోమీటర్ల వరకు దివ్యమైన తరంగాలు వ్యాపించి ఉండేవి.

ఆరోజు ఆ కాశీనగరానికి ఎక్కడెక్కడ నుంచో ఎందరో మహర్షులు వస్తున్నారు. కొందరు నడిచి వస్తున్నారు. మరికొందరు ఆకాశమార్గంలో వస్తున్నారు. చేతిలో కమండలాలు, నుదుటున విభూది రేఖలతో ఎంతో తేజస్సుతో ఉన్న ఆ మహర్షులను దర్శించండి. మనం ఎన్నో కోట్ల జన్మలలో చేసిన పాపాలన్నీ ఈ క్షణంలోనే నశిస్తాయి. ఈ మహర్షులందరూ అనేక వేద మంత్రాలు చదువుతూ కాశీపట్టణం వైపు వస్తున్నారు.

ఆరోజుల్లో ఎంతో గొప్ప శక్తులు కలిగిన మహర్షులు ఉండేవారు. వారిలో కొందరు దేవతల అంశతో జన్మించినవారు. ఆ మహర్షుల చుట్టూ ఉన్న ఆ దివ్య కాంతి పుంజాలు గమనించండి ఎంత అద్భుతంగా ఉన్నాయో ఆ మహర్షులు నడుస్తూ ఉంటే భూమాత ఎంతో ఆనందంతో పులకరిస్తుంది. వారిలో కొంతమంది చాలా ఎత్తుగా ఉన్నారు. వీరిలో కొందరు ఈ భూమినించే కాకుండా ఎన్నో గ్రహమండలాల నుంచి కూడా వచ్చారు. వారు ఆకాశంలోని గ్రహమండలాల నుంచి వాయు వేగంతో కాశీపట్టణం సమీపంలో దిగి ఈ విశ్వనాథుని ఆలయం వైపు నడుచుకుంటూ వస్తున్నారు.

వారు ఆకాశం నుండి గ్రహమండలాల నుంచి వస్తున్నప్పుడు వారి చుట్టూ ఉన్న దివ్యకాంతి వలయాల వలన వారు కాంతి పుంజాల మాదిరిగా కనబడుతున్నారు. కానీ వారి రూపం స్పష్టంగా కనిపించడం లేదు. వారు భూమికి దగ్గరగా వచ్చిన తరువాతనే వారి దివ్యరూపాలు మనకి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వారు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ వస్తున్నారు. వారు సంస్కృత భాషలో మాట్లాడుతూ వారు దైవాంశసంభూతులు అవడం చేత వారు మాట్లాడుతున్న మాటలు ఒక అద్భుత శక్తితో మనకి వినిపిస్తున్నాయి. అందుకే వారు ఏమి మాట్లాడుతున్నారో మనకి సరిగ్గా అర్థం కావడంలేదు. అయితే ఈ రోజు కాశీనగరంలో ఏదో అద్భుతం జరగబోతున్నది అన్న విశేషం మనకు అర్థమవుతున్నది.

అలా వచ్చినవారందరూ ఆలయానికి దగ్గరలో ఒక మహా వేదిక పైన కూర్చున్నారు. ఆ మహావేదిక ఎంతో దివ్యమైన తేజస్సుతో వెలిగిపోతున్నది. ఆ వేదికను సాక్షాత్తూ దేవతలే నిర్మించారు. అక్కడ ఏమి విశేషం జరగబోతున్నదో మనందరం దర్శిద్దాము. మరొక విశేషం ఏమిటంటే అక్కడకి మహర్షులే కాక దేవతలు కూడా ఆకాశమార్గాన వస్తున్నారు. దివ్యమైన వస్త్రాలు ధరించి, దివ్యమైన ఆభరణాలు ధరించి ఆ దేవతలందరూ భూమికి దిగి వస్తూంటే ఆ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంది.

ఒక్కసారి తలెత్తి ఆకాశంవంక చూడండి. గ్రహ మండలాల నుంచి వస్తున్న మహర్షులు, దేవలోకాలనుంచి వస్తున్న దేవతలు ఇలా భూమివైపుకు వస్తుంటే ఆ ఆకాశంలోని నక్షత్రాలు క్రిందికి దిగివస్తున్నాయా అన్నట్లుగా మన మనస్సుకు అనిపిస్తోంది. వీరి తేజస్సువలన ఆకాశమంతా ఎంతో దివ్యకాంతితో మెరిసిపోతున్నది.

ఆరోజు అక్కడ ఒక గొప్ప యజ్ఞం జరగబోతున్నది. అది సామాన్యమైన యజ్ఞం కాదు. ఎంతో మహత్తరమైనటువంటిది. అక్కడ ఎన్నో యజ్ఞగుండాలు నిర్మించి ఉన్నాయి. ఆ యజ్ఞగుండాల చుట్టూ ఎందరో ఋత్విక్కులు కూర్చొని ఎంతో గొప్ప తేజస్సుతో వెలిగిపోతూ వేదమంత్రాలు చదువుతున్నారు. అక్కడకు చేరిన మహర్షులు, దేవతలు యజ్ఞగుండాల వద్ద కూర్చొని ఉన్నారు.

ఇంతలో ఆకాశమంతా ఎంతో అద్భుతంగా ప్రకాశింప సాగింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారు శ్రీ మహాలక్ష్మితో కలసి గరుత్మంతుడుపై వాయు వేగంతో ఈ ప్రదేశానికి రాసాగారు. స్వామి రాకను గ్రహించిన మహర్షులు, దేవతలు అందరూ లేచి నుంచొని శ్రీస్వామివారిని స్తుతిస్తూ ఎన్నో స్తోత్రాలు చేశారు. అప్పుడు లక్ష్మీనారాయణులిద్దరూ ఆ మహావేదిక వద్దకు వచ్చి అందరినీ ఆశీర్వదించి అక్కడ కూర్చున్నారు.

ఇంతలో ఆకాశంనుండి బ్రహ్మదేవుడు, సరస్వతి అక్కడకి విచ్చేసారు. అటు తరువాత ఆకాశం నుండి దిక్కులు పిక్కటిల్లే లాగా ఢమరుక ధ్వని వినపడసాగింది. శ్రీమన్నారాయణుల వారు చిరునవ్వుతో ఆకాశం వంక చూసారు. ఆకాశం నుండి త్రిశూలధారియై తన ప్రియ మిత్రుడు శ్రీపరమేశ్వరుడు, శ్రీపార్వతీ దేవితో కలసి ఇటు రాసాగారు. ఆహా! ఎంత రమణీయంగా ఉన్నది ఈ దృశ్యం.

కృతయుగంలో జరిగిన ఈ అద్భుత సంఘటన అక్కడ ఉన్న మహర్షులను, దేవతలను, ఎంతో ఆశ్చర్యంతో, ఎంతో ఆనందంతో ముంచెత్తివేసింది. వారి ఆనందానికి అవధులు లేవు. త్రిమూర్తులను, త్రిశక్తులను, సర్వదేవతలను, సర్వ మహర్షి గణాన్ని ఆ కాశీ మహాక్షేత్రంలో చూసిన ప్రకృతి పులకరించిపోయింది. వీరందరి రాకతో భూమాత ఎంతో సంతోష పడింది. వీరందరూ ఇక్కడ ఉన్న ఈ క్షణాల పవిత్రత వలన, శక్తి వలన అనేక మహాయుగాలు ఈక్షేత్రం అత్యంత శక్తివంతంగా ఉంటుంది. ఆయా యుగాలలో, ఆయా కాలాలలో జరిగే అనేక మార్పులు వలన, అనేక సంస్కృతుల వలన ఇక్కడ కట్టడాలు, పూజా విధానాలు మారుతూ ఉంటాయి. కానీ ఈ కాశీక్షేత్రం ప్రభావం మాత్రం ఎప్పటికీ అత్యంత శక్తివంతమై ఉంటుంది. ఈ రోజు ఇందరి సమక్షంలో బ్రహ్మాండమైన యజ్ఞం

జరగడంతో ఆ ప్రాంతం అంతా దివ్యశక్తి తరంగాలతో నిండిపోయింది. ఆహా ఇదంతా మన మనోనేత్రంతో దర్శిస్తున్నాము. మనం చేసుకున్న ఎన్నో వేల జన్మల పుణ్యఫలం వలన ఇంతటి అద్భుత దృశ్యాన్ని మనం మన హృదయాలలో ఆవిష్కరించుకో గలుగుతున్నాము.

అక్కడ ఉన్న వేదికపై కొందరు సంగీత విద్వాంసులు ఎంతో గొప్ప గాత్ర సంగీతం పాడారు. అక్కడ ఉన్న చెట్లపై ఉన్న పక్షులు గొంతెత్తి అద్భుతంగా పాడసాగాయి. సృష్టిలోని సర్వదేవతలు ఎందరో మహర్షులు అక్కడే ఉండడంతో ఆ ప్రదేశంలోని ఉన్న జీవులన్నీ ఎంతో పుణ్యం చేసుకొని తమ జంతు జన్మల నుండి విముక్తి పొంది అటు తరువాత మానవ జన్మలు పొంది తమ తమ జీవితాలు సార్థకం చేసుకున్నాయి.

ఆ జీవులన్నీ ఇన్ని యుగాలలో ఎన్నో కోట్ల జన్మలలో జన్మించిన వారి ఆత్మ ఆనాటి దివ్య అనుభవాన్ని ఇంకా మర్చిపోలేదు. వాటిలో కొన్ని మానవ జన్మ పొందిన తరువాత కాశీ క్షేత్రాన్ని దర్శించినప్పుడు ఆనాటి దివ్య అనుభూతి వారి ఆత్మకు గుర్తురావడంతో ఈనాడు ఎంతో గొప్ప ఆనందాన్ని పొందుతున్నారు.

ఇది వారి మనస్సుకు తెలియకపోయినా వారి ఆత్మ ఎంతో ఆనందపడి వారికి తెలియకుండానే వారికి ఆనంద బాష్పాలు కారుతున్నాయి. వారికి కాశీ పుణ్యక్షేత్రం వదిలి రాబుద్ధికావడంలేదు. జీవితాంతం అక్కడే ఉండాలనిపిస్తోంది.

ఆరోజు అక్కడ మరొక విశేషం జరిగింది. పరమేశ్వరుడు ఎంతో ఆనందపడుతూ తన ఢమరుకం వాయించాడు. ఆ ఢమరుక నాదానికి ప్రకృతి మొత్తం పరవశించిపోయింది. అప్పుడు అక్కడ ఒక మహా శివలింగం ఆవిర్భవించింది. ఆ శివలింగం ఎంతో ఎత్తుగా ఉన్నది. అక్కడ ఉన్న దేవతలు మహర్షులు ఆ శివలింగానికి

నమస్కరించారు. ఆనాటి ఆ మహా శివలింగం ఎన్ని మహాయుగాలు గడిచినప్పటికి ఇప్పటికి ఆ ప్రాంతంలో అదృశ్యరూపంలో ఉంది. ఆలయం పై భాగం వరకు విస్తరించి ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తూ ఉంది.

ఆనాడు సాక్షాత్తూ పరమేశ్వరుడే అనుగ్రహించిన అంత మహాశివలింగం అక్కడ అదృశ్యరూపంలో ఉండడం చేత కాశీక్షేత్రం మొత్తం ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ మహాలింగం సామాన్య మానవులకు కనిపించదు. కానీ యోగులకు, సాధకులకు ఆ మహాలింగం ఇప్పటికి లీలామాత్రంగా దర్శనమిస్తూ ఉంటుంది. అంతటి మహాలింగ ప్రభావ వలన కాశీక్షేత్రంలో అడుగుపెట్టిన వెంటనే ఏ జీవికి అయినా కొన్ని లక్షల జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయి.

కాశీమహాక్షేత్రంలోని ఈ మహాలింగ దర్శనం కోసం ఇప్పటికీ అనేక మంది దేవతలు, అనేక మంది మహర్షులు నిత్యం ఈ కాశీక్షేత్రానికి అదృశ్యరూపాలలో వస్తూంటారు. పర్వదినాలలో అనేక మంది దేవతలు సంచరిస్తుంటారు. ఇంతే కాక సాక్షాత్తూ పరమేశ్వరుడే నిత్యం ఈ కాశీ మహాక్షేత్రంలో సంచరిస్తుంటారు. ఇన్ని మహాయుగాలుగా కాశీక్షేత్రం మహా పుణ్యక్షేత్రమై విరాజిల్లుతోంది.

ఎందరో పుణ్యపురుషులు నిత్యం సంచరించే ఈ కాశీక్షేత్రం ఎంతో పవిత్రమైనది, ఇక్కడ చేసే ఏ దానమైనా కోటిరెట్లు ఫలం ఇస్తుంది. ఈక్షేత్రంలో ఇంతకుముందు యుగాలలో గొప్ప యజ్ఞాలు, యాగాలు జరిగాయి. ఎన్నో గొప్ప వేద సభలు జరిగాయి. ఎన్నో శాస్త్ర సభలు జరిగి ఎందరో మహాపండితులు వాటిలో పాల్గొని ఎన్నో గొప్ప శాస్త్ర చర్చలు చేశారు.

అంతటి మహా పుణ్యక్షేత్రం ఈ కాశీక్షేత్రం. ఇంతటి పవిత్ర కాశీక్షేత్రాన్ని ఈ జన్మలో దర్శింపలేకున్నా మీరు ఎటువంటి బాధ పడవద్దు. మీరు మీ పూర్వజన్మలలో తప్పక కాశీక్షేత్రాన్ని దర్శించి ఉంటారు. ఆ పుణ్యఫలం చేతనే ఆ మహాక్షేత్రం యొక్క విశేషాలను ఈనాడు తెలుసుకొని అప్పటి కాశీక్షేత్రాన్ని మీ మనస్సులో దర్శించగలుగుతున్నారు.

మీరు ఉన్నచోట నుండే ఈ క్షణంలోనే కాశీక్షేత్రంలోని ఆ మహాశివలింగానికి నమస్కరించండి. మీకు కాశీక్షేత్ర దర్శన ఫలం, పరమేశ్వర అనుగ్రహం లభిస్తుంది. మీరు ఎన్నో జన్మలలో చేసిన పాపాలన్నీ నశిస్తాయి. ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. కాశీ అనే నామాన్ని రోజుకు ఒక్కసారి ఉచ్ఛరించిన అనేక జన్మల పాపాలు నశిస్తాయి. కాశీ అనే పవిత్ర నామాన్ని రోజుకు 11 సార్లు ఉచ్ఛరించిన వారికి అనేక కోట్ల జన్మల పాపాలు నశించి ఉత్తమ గతులు కల్గుతాయి.

11

ప్రస్తుతం మనం ఇంగ్లీషు కాలమానం ప్రకారం 2022 వ సంవత్సరంలో ఉన్నాము. అయితే ఇది ఈ మధ్యనే వచ్చిన కాలమానం. మన పురాణాలలో కాల పరిమాణాన్ని గురించి ఎప్పుడో ఎంతో అద్భుతంగా వివరించారు. మనకు ముఖ్యంగా 9 కాలమానాలు ఉన్నాయి. అవి బ్రహ్మమానం, ప్రాజాపత్యమానం, దివ్యమానం, పిత్ర్యమానం, బార్హస్పతిమానం, సౌరమానం, నక్షత్రమానం, చాంద్రమానం, శ్రావణమానం వేయి మహాయుగాలతో ఏర్పడిన ఒక కల్పం సృష్టికర్త అయిన బ్రహ్మకు ఒక పగలు, మరొక కల్పం ఒక రాత్రి ఇలా రెండు కల్పాలు కలిసి బ్రహ్మదేవునికి అహోరాత్రం ఏర్పడుతుంది.

ఇటువంటి అహోరాత్రాలలో బ్రహ్మకు నూరు సంవత్సరాలు ఆయుర్దాయంగా పరిగణిస్తారు. బ్రహ్మ ఆయుర్దాయంలో మొదటి 50 సంవత్సరాలు గడిచింది. అంటే ప్రథమ పరార్థం గడిచింది. మనం ద్వితీయ పరార్థంలో ఉన్నాము. ప్రస్తుతం మనం ఆరు మన్వంతరాలు గడిచి ఏడవదయిన వైవశ్వత మన్వంతరంలో ఉన్నాము.

ఈ వైవశ్వత మన్వంతరంలో ఇప్పటికి 27 మహాయుగాలు గడిచాయి. ఇప్పుడు 28వ మహాయుగంలో కృత, త్రేతా, ద్వాపరయుగాలు గడిచి కలియుగంలో ప్రథమ పాదంలో ఉన్నాము.

కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు, వాటి సంధ్యా కాలం, వాటి సంధ్యాంశ కాలాలు కలిపితే ఒక మహాయుగం అవుతుంది. ఒక మహాయుగానికి 43,20,000 వేల సౌర సంవత్సరాలు. కృత యుగ ప్రమాణం 17,28,000 వేల సంవత్సరాలు తరువాత జరిగిన త్రేతాయుగ ప్రమాణం 12,96,000 వేల సంవత్సరాలు. అటు తరువాత వచ్చిన ద్వాపర యుగ ప్రమాణం 8,64,000 వేల సంవత్సరాలు. ఇక ప్రస్తుతం మనం ఉన్న ఈ కలియుగ ప్రమాణం 4,32,000 వేల సంవత్సరాలు. ఇందులో ఇప్పటికి 5121 సంవత్సరాలు గడిచి ప్రస్తుతం మనం 5122 వ సంవత్సరంలో ఉన్నాము.

మనందరం ప్రస్తుతం జరుగుతున్న ప్రగతి చూసి ఇదే చాలా గొప్పదని ఎంతో ఆనంద పడుతుంటాము. అంతే కాదు ఇంకా రాబోయే సంవత్సరాలలో ఈ ప్రపంచం ఇంకా ఎంతో గొప్ప ప్రగతి సాధిస్తుందని అనుకుంటాము. కాని ఇది ఏమాత్రం సత్యం కాదు. ఇప్పుడు మనం చూస్తున్న ఈ అద్భుత ప్రపంచం కంటే ఎన్నో వేల రెట్లు ఎక్కువ ప్రగతి పథంలో నడచిన ఎన్నో సంస్కృతులు ఇంతకుముందు మహాయుగాలలో ఎన్నో ఉండేవి.

అప్పటి కాలంలో అభివృద్ధి, విజ్ఞానం ముందు ఇప్పటిది అతి స్వల్పం. అయితే సృష్టికి ఉన్న సహజ లక్షణం చేత ప్రతీ గొప్ప సంస్కృతి కొంతకాలం ఈ భూమిపై కొన్ని వందల, వేల సంవత్సరాలు వర్థిల్లిన తరువాత లయం కాబడుతుంది. తరువాత కొన్ని వందల సంవత్సరాలకు మళ్ళీ మరొక సంస్కృతి ఆవిర్భవిస్తుంది. ఇలా ఇన్ని

మహా యుగాలలో ఇన్ని కోట్ల సంవత్సరాలుగా ఎన్నో సంస్కృతులు ఈ భూమిపై ఆవిర్భవించి కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ సంస్కృతులలో జీవించిన అనేక జీవులు ఇప్పటికి మన మధ్యనే తిరుగుతున్నారు. వీరందరూ కోట్లాది జన్మలలో చేసుకున్న ప్రారబ్ధ కర్మలను బట్టి అనేక రూపాలలో మన మధ్యనే జన్మించి అనేక విధాలుగా జీవనం సాగిస్తున్నారు.

చాలామంది భావించేటట్టు ఒక యుగాంతంలో గాని ఒక మహాయుగాంతంలో గాని ప్రళయం సంభవించదు. ఎన్నో మహాయుగాలు తరువాత వచ్చే ప్రళయ కాలంలో అప్పుడు ఉన్న జీవులన్నీ పరమేశ్వరునిలో ఐక్యమై తిరిగి మరల భూమిపైకి వారి వారి ప్రారబ్ధ కర్మల ప్రకారం అనేక జీవజాతులలో జన్మిస్తారు. అంతేగాని ప్రళయ కాలంలో సమస్త మానవ, జంతువులు పరమేశ్వరునిలో లయమైనప్పుడు కోట్లాది జన్మలలో వారు మూటకట్టుకున్న ప్రారబ్ధ కర్మ క్షయం కాదు. తిరిగి సృష్టి ప్రారంభం కాగానే ఆ కర్మల ప్రభావం చేత తిరిగి అనేక రూపాలలో అనేక ప్రదేశాలలో మానవులగాను, జంతు జాతిలోనే జన్మించి తమ ప్రయాణం కొనసాగిస్తారు.

మానవులు నాగరికతలో ప్రతీ సంస్కృతిలోను ఎంతో అభివృద్ధి సాధించి తరువాత ప్రకృతిని పూర్తిగా నాశనం చేసి ధర్మ బుద్ధిని కోల్పోయి అన్ని విషయాలలోను విచక్షణా శక్తిని పూర్తిగా కోల్పోయి తమ నాశనం తామే కోరి తెచ్చుకుంటారు. ఇలా కొన్ని వేల నాగరికతలు ఈ కాల ప్రవాహంలో ఎంతో అద్భుతంగా వెల్లివిరిసి తరువాత పూర్తిగా నశించాయి.

ప్రస్తుత కలియుగంలో ముమ్ముందు నాగరికత ఇంకా అభివృద్ధి చెందుతుంది. కానీ ధర్మం విపరీతంగా క్షీణిస్తూంటుంది. ఇది అనేక వినాశాలకు దారితీస్తుంది. ఒక నూరు సంవత్సరాలు

వచ్చేటప్పటికి మానవుడు తన శక్తిని ఎంతో కోల్పోతారు. అలాగే మానవులలో పునరుత్పత్తి శక్తి కూడా బాగా దెబ్బ తింటుంది. ఇప్పుడు మనం నూటికి ఒకరిలో సంతానం లేకపోవడం చూస్తూంటే రాను రాను ఇది నూటికి 20, 30, 40, 50 గా పెరుగుతూ వస్తుంది.

ఇలా రాను రాను జనం తగ్గిపోవడం ప్రారంభం అవుతుంది. కలియుగంలో 10,000 సంవత్సరాలు వచ్చేటప్పటికి మానవుల శరీర ప్రమాణంతో పాటు ఆయు ప్రమాణం కూడా బాగా తగ్గుతుంది. మానవుల ఆలోచనా శక్తి దెబ్బతింటుంది. మానవ శరీరంలోని ముఖ్యమైన కంటి యొక్క సామర్థ్యం చాలా తగ్గుతుంది. మెదడు ఇప్పటి ఆలోచనా శక్తిని కలిగి ఉండదు.

12

ఒక్కసారి మనం వెనకటి 22వ మహాయుగంలోని వెళదాం. ఆ మహాయుగంలో కలియుగం ప్రారంభం అయ్యి అది 220వ సంవత్సరం అంటే అప్పటికి ఆ మహాయుగంలో కలియుగం ప్రారంభం అయ్యి 220 వ సంవత్సరాలు మాత్రమే అయ్యిందన్నమాట. మనం ప్రస్తుతం ఆనాటి ఇప్పటి ఢిల్లీ నగరం ఉన్న ప్రాంతాన్ని దర్శిస్తున్నాము. అప్పుడు ఈ ప్రపంచంలో ఇన్ని దేశాలు లేవు. ఎటువంటి మతాలు లేవు. కేవలం వివిధరకాల జాతులు మాత్రమే ఉండేవారు. ప్రజలందరూ సనాతన ధర్మం పాటిస్తూ సుఖసంతోషాలతో జీవించేవారు. ప్రకృతి ఎంతో అద్భుతంగా ఉండేది.

అదిగో అటు చూడండి! ఆ మహారాజుయొక్క భవనం ఎంత గొప్పగా ఉందో! ఆ భవంతి చుట్టూ ఎంత గొప్ప ఉద్యానవనం! ఆ భవంతికి ఉన్న తలుపులు, కిటికీలు అన్నిటికి ఎన్నో అద్భుతమైన మణులు పొదగబడి ఉన్నాయి. ఆ భవంతి గోడలపై అద్భుతమైన రంగు రంగుల చిత్రాలు చిత్రింపబడి ఉన్నాయి. అక్కడ నడుస్తున్న రాకుమార్తె

కొందరు చెలికత్తెలను చూడండి మనం ఈ కలియుగంలో చూడని ఎన్నో అద్భుతమైన ఆభరణాలు ధరించి ఉన్నారు. అటు పక్కగా ఉన్న ఒక వీధిలోనికి చూడండి! అక్కడ దుకాణాలలో పెద్ద పెద్ద గంగాళాలలో ముత్యాలు, రత్నాలు, పగడాలు, మణులు ఇలా ఎంతో గొప్ప విలువైనవి ఉన్నాయి. వీధిలో ముత్యాలు కుప్పలు కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. అదిగో చూడండి! ఒక వ్యక్తి ఒక రెండు నాణాలు తీసి ఇచ్చాడు. దానికి అతనికి ఆ వర్తకుడు రెండు గుప్పిళ్లనిండా ముత్యాలు ఇచ్చాడు. అది ఆనాటి దేశ వైభవం.

మనం మరొక వీధిలోకి వెళదాం ఇక్కడ ఎన్నో గొప్ప వస్త్రదుకాణాలు ఇంతలో అటుగా ఒక రాజాధికారి గుఱ్ఱంపై వచ్చాడు. అధికారి ఆ వీధిలో వెళ్తుండగా అక్కడ దుకాణాల వారందరూ బయటకి వచ్చి అతనికి నమస్కరించారు. ఇంతలో అటు పక్కగా ఒక బైరాగి రాసాగాడు. అతడు సామాన్య బైరాగి కాదు. అతడు ఒక గొప్ప అవధూత.

అతడు అటునుంచి ఇటు రాగానే రాజాధికారి గుఱ్ఱం దిగి అతడికి సాష్టాంగ నమస్కారం చేశాడు. దుకాణాలలో ఉన్న వారందరూ కూడా ఆ సాధువుని తాకకుండా దూరం నుంచే నమస్కారం చేశాడు. ఆ సాధువు ఎంతో గొప్ప శక్తులు గలవాడు. ఆరోజుల్లో ఇటువంటి అవధూతలు ప్రజల మధ్యనే జీవించేవారు. ప్రజలను ఆశీర్వదిస్తూ రాజ్యం సుభిక్షంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తూ ఉండేవారు.

ఇలా 200 ల సంవత్సరాలు గడిచింది. నెమ్మదిగా సమాజంలో అనేక మార్పులు రాసాగాయి. ప్రజలలో నెమ్మదిగా అధర్మం ప్రబల సాగింది. ఇలా మరొక 200 ల సంవత్సరాలు అయ్యేటప్పటికి ప్రజలలో అధర్మం పూర్తిగా పెరిగి నెమ్మదిగా సర్వనాశనానికి దారి తీసింది. అలా ఒక 1000 సంవత్సరాలు

గడిచేటప్పటికి ఆ నాగరికత పూర్తిగా అంతరించిపోయింది. ఆ సంస్కృతి పూర్తిగా కాలగర్భంలో కలిసిపోయింది. ఇన్ని కోట్ల సంవత్సరాలలో ఇలా గొప్ప నాగరికతలు ఎన్నో వచ్చి ఒక వెలుగు వెలిగి తరువాత పూర్తిగా అంతరించి కాలగర్భంలో కలిసిపోయాయి. ఇది కాల మహిమ. ఇది కాల స్వరూపుడైన భగవంతుని విభూతి, ఇది భగవంతుని చిద్విలాశం, ఇది భగవంతుడి జగన్నాటకం.

13

ఆరోజు ద్వాపరయుగంలో ఎంతో పవిత్రమైన ఒక రోజు. ఆనాడు చిన్ని కృష్ణుడు తన స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి ఊరి బయటకి వచ్చాడు. ఎంతో చక్కటి సరస్సులు, పూలతోటలతో అక్కడ ప్రకృతి అంతా ఎంతో అద్భుతంగా ఉంది. చిన్ని కృష్ణుడు తన స్నేహితులతో అటూ ఇటూ ఎంతో హుషారుగా పరుగెడుతూ ఆడుతున్నాడు. ఆ క్రిష్ణయ్యను చూడండి. ఎంత ముచ్చటగా ఉన్నాడో! ఆ కళ్ళు చూడండి ఎంత చురుగ్గా ఉన్నాయో! ఎంత చిలిపిగా ఉన్నాయో! స్నేహితులతో నవ్వుతూ మాట్లాడుతున్నప్పుడు ఆ చిరునవ్వు చూడండి. ఎంత అద్భుతంగా ఉందో! ఆ చిరునవ్వుతో ఈ లోకాలన్నీ ఊయలలూగుతున్నాయి.

చిన్ని కృష్ణుడి స్నేహితులు పది మంది దాకా ఉన్నారు. కృష్ణయ్యతో సహా కొందరి చేతులలో వేణువులున్నాయి. కృష్ణయ్య తలలో నెమలిపింఛం పెట్టుకున్నాడు. విచిత్రం ఏమిటంటే చిన్ని కృష్ణుడి స్నేహితులలో కొందరు కూడా తలలపై నెమలిపింఛాలు

పెట్టుకున్నారు. ఈ పిల్లలందరూ అటూ ఇటూ హుషారుగా ఎగురుతూ ఆడుతూ ఉంటే మధ్య మధ్యలో వాళ్ళ తలపైగల పింఛాలు నేలమీద ఎగిరిపడుతున్నాయి. వాటిని తీసి మళ్ళీ తలలో పెట్టుకుంటున్నారు.

అలా కృష్ణయ్య పింఛం కూడా ఒకసారి జారిపడింది. అదే సమయంలో మరొక నలుగురి గోప బాలుర పింఛాలు కూడా పెద్ద గాలి వీచి క్రింద పడడంతో ఎవరిది ఏదో తెలీక చేతికి దొరికింది తీసి తలలో పెట్టుకున్నారు. కృష్ణయ్య పింఛం అలా మరొక బాలుని తలపైకి వెళ్ళింది. అలా ఆ రోజంతా ఆ పిల్లలందరూ ఆడుతూ పాడుతూ ఉన్నారు.

అక్కడ చెట్లకు ఉన్న రకరకాల పండ్లుకోసుకొని తిన్నారు. చిన్ని కృష్ణునికి జామపళ్ళు ఎంతో ఇష్టం, సగం కొరికి స్నేహితునికి ఇచ్చేవాడు. చిన్ని కృష్ణయ్య స్నేహితులు ఆ మిగిలిన పళ్ళను ఎంత సంతోషంగా తింటున్నారో చూడండి.

వారందరిని చూస్తుంటే మనకి ఎంత ముచ్చటగానో ఉంది కదా! ఎంత కమనీయంగా ఉంది ఆ దృశ్యం! ఆహా! మనజీవితాలు ధన్యమయ్యాయి కదా! అదిగో ఆ చిన్ని కృష్ణుడిని చూడండి. ప్రక్కనే గల ఒక మొక్కపైనున్న పువ్వులను చేతిలోకి తీసుకొని నోటితో స్నేహితులపై ఊదుతున్నాడు. ఆ పువ్వులన్నీ గాలిలో అద్భుతంగా ఎగురుతూ ఆ పిల్లల తలలపై పడుతున్నాయి.

కృష్ణయ్య అలా ఊగుతున్నప్పుడు ఒక్కోసారి గాలి ఇటుపక్కకి వీచి ఆ పువ్వులు కృష్ణయ్య మొహం మీదనే పడుతున్నాయి. అలా పడుతున్న ఆ దృశ్యం ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది. ఆ పువ్వులు కొన్ని కృష్ణయ్య తలపై ఉన్న నెమలి పింఛానికి అంటుకున్నాయి. ఎంతో ముచ్చటగా ఆ పువ్వులన్నింటిని

దులుపుకుంటున్న చిన్ని కృష్ణుడిని చూడండి. పిల్లలందరూ కూడా తమ తలలపై పడివున్న పువ్వులు విదిలించుకోడానికి తలలను అటు ఇటు ఆడిస్తుంటే వారి తలలపై గల పింఛాలు తిరిగి నేలపై పడ్డాయి. మళ్లీ వారందరూ అవి తీసుకొని తలపై పెట్టుకున్నారు. అలా పెట్టుకుంటున్నప్పుడు కృష్ణయ్య పింఛం తిరిగి కృష్ణయ్య వద్దకే వచ్చింది.

ఇలా చిన్నికృష్ణయ్య ప్రతిరోజు గోపబాలురుతో కలిసి ఆడుతూ పాడుతూ కాలం గడిపేవాడు. అలా కృష్ణయ్య చిన్నతనంలో ఎందరో వందల గోపబాలురతో ఆడుకున్నారు. వీరిలో కొందరు కృష్ణయ్యకు ఎంతో ప్రీతిపాత్రులయ్యారు.

చిన్నికృష్ణుడు అలా రోజూ వచ్చి సరస్సులలో, కొలనులో ఆడుతూ ఉండడం చూసి దేవతలు ఎంతో ముచ్చట పడేవారు. వారిలో కొందరు ఈ భూమిపైకి గోప బాలురు రూపంలో వచ్చి కృష్ణయ్యతో ఆడేవారు. ఆ పురుషోత్తమునికి ఇవన్నీ తెలిసినవే కదా! ఆ చిన్నికృష్ణుడు దేవతల ముచ్చట తీర్చడానికి వారితో రకరకాల ఆటలు ఆడేవారు.

ఇదంతా నేను ప్రస్తుత కలియుగం ముందు గడిచిన ద్వాపరయుగ విశేషాలు చెప్తున్నాను. ఇదేవిధంగా ఇప్పటివరకు గడిచిన 27 మహాయుగాలలోను శ్రీమన్నారాయణుల వారు శ్రీకృష్ణునిగా అవతరించారు. అలా అవతరించిన ప్రతీసారి చిన్నతనంలో ఎందరో గోపబాలురతో ఆడుకునేవారు.

ఇలా ఇన్ని మహాయుగాలలో శ్రీమన్నారాయణులవారు శ్రీకృష్ణునిగా అవతరించినప్పుడు అనేక వేల మంది గోపబాలురు కృష్ణయ్యతో చిన్నతనంలో ఆడుకున్నారు. వీరందరూ అంతకుముందు జన్మలలో ఎంతో పుణ్యం చేసుకున్నారు. ద్వాపరయుగ పరిమాణం 8,64,000 వేల సంవత్సరాలు. శ్రీమన్నారాయణుల వారు శ్రీకృష్ణునిగా

ఈ భూమిపై అవతరించింది ఈ ద్వాపరయుగంలోని చివరి 125 సంవత్సరాల సమయంలో. అంటే చిన్నికృష్ణునితో ఆడుకున్న గోపబాలురు అంతకుముందు కేవలం ద్వాపరయుగంలోనే కొన్ని వేల జన్మలు ఎత్తారు. ఇంకా అంతకుముందు అనేక మహాయుగాలు కూడా కలిపితే వీరందరూ ఎన్నో లక్షల జన్మలలో జన్మించారు.

వీరు అనేక జన్మలలో ఎంతో ధర్మపరంగా జీవించడం వలన, ఎంతో పుణ్యం చేసుకొనడం వలన ఈ జన్మలో శ్రీకృష్ణులవారు ఉన్న ప్రదేశంలో జన్మించి చిన్ని కృష్ణయ్యకు బాల్యస్నేహితులయ్యారు. వీరు ఇలా సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారితోనే ఆడుకోవడం చేత, ఎంతో సఖ్యంగా మెలగడం చేత తరువాత జన్మలలో ఎంతో పుణ్యాన్ని సంపాదించుకున్నారు. వీరిలో కొందరు ఎంతో గొప్ప మహనీయులుగా జన్మించారు.

అలా కృష్ణయ్యతో ఆనాడు ఆడుకున్న గోపబాలురు కొందరు తరువాత జన్మలలో కొందరు గొప్ప పండితులుగాను, కొందరు మహా సంగీత విద్వాంసులు గాను, కొందరు గొప్ప సాధువులు గాను, కొందరు గొప్ప యోగులు గాను, కొందరు గొప్ప అవధూతలుగా జన్మించారు. వీరందరూ ఇప్పుడు కలియుగంలో మహాపురుషులుగా, గొప్ప వ్యక్తులుగా పరిగణింపబడుతున్నారు.

మనందరికి సుపరిచితులైన అనేక గొప్ప సంగీత విద్వాంసులు ఆనాడు ద్వాపరయుగంలో శ్రీకృష్ణులవారితో ఆడుకున్నవారే! వీరందరి పేర్లు రాయడం ధర్మసమ్మతం కాదని, అవి దేవరహస్యాలు కాబట్టి నేను ఇక్కడ వారి కలియుగపు పేర్లు ప్రస్తావించడం లేదు. కాని వారందరూ ఈ కలియుగం మొదటినుంచి ఏ ఏ కాలాలలో జన్మించారో, ఏ ఏ ప్రాంతాలలో జన్మించారు వారు ఎలా జీవించారో, వారు ఎలా గొప్ప మహాపురుషులుగా స్తుతించబడ్డారో నాకు స్పష్టంగా కనిపిస్తున్నది.

కేవలం ద్వాపరయుగంలోని శ్రీకృష్ణులతోనే కాదు, త్రేతాయుగంలో శ్రీమన్నారాయణులవారు శ్రీరామచంద్రునిగా జన్మించినప్పుడు వారితో సఖ్యంగా మెలిగిన వారితో కొందరు తరువాత యుగాలలో ఎంతో మహాపురుషులుగా జన్మించారు.

ఇందాక మనం చూసిన గోపబాలురే కాకుండా చిన్నికృష్ణయ్యకు అనేకమంది స్నేహితులుడేవారు. వారిలో పౌరోహిత్యం చేసుకొని జీవిస్తున్న ఒక బ్రాహ్మణుని పిల్లవాడు కూడా ఉన్నాడు. ఇలా అనేక వృత్తులలో ఉన్నవారి పిల్లలతో చిన్నికృష్ణుడు ఎంతో చలాకీగా ఆడుకునేవాడు. ఇంతకు ముందు చెప్పినట్లుగా వీరందరూ తరువాత జన్మలలో ఎంతో గొప్ప మహాత్ములుగా ఈ నేలపై అవతరించారు. ధర్మప్రచారానికై విశేష కృషి చేసారు.

కొందరు తమ సంకీర్తనల ద్వారాను, కొందరు తమ ప్రవచనాల ద్వారాను ఇలా ఎన్నో విధాల వారు ధర్మప్రచారం గావించారు. ఈ కలియుగంలో ఈ భూమిపై వారు అనేక కాలాలలో జన్మించారు. ఆనాడు శ్రీకృష్ణుడితో ఆడుకున్న వారు ఈనాడు మన మధ్య ఎన్నో ప్రదేశాలలో జన్మించి ఎంతో ధర్మపథ జీవితం గడుపుతున్నారు.

వీరిలో కొంతమందిని నేను కలవడం కూడా జరిగింది. వీరిలో కొందరు సాక్షాత్తూ శ్రీకృష్ణుల వారి వేణువు ఊదిన వారు అవ్వడం చేత ఈ జన్మలో కూడా వారికి వేణుగానంలో ఎంతో గొప్ప ప్రావీణ్యం లభించింది. కొందరు గొప్ప వేణుగాన విద్వాంసులు కూడా అయ్యారు. వారి వేణుగానం మనందరిని ఒళ్ళు మైమరపించేలా చేస్తుంది.

14

ఇప్పుడు మనం ద్వాపరయుగంలోని మరొక రోజుకు వెళదాము. ఆరోజు వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. అది శ్రావణమాసం. ఆరోజు ఉదయం నుంచి చిరుజల్లు పడుతుంది. గోప కాంతలు గోశాలలకు వెళ్ళి పాలు తీసుకొని కడవలతో ఆ పాలపై వర్షపు నీరు పడకుండా తమ చీరకొంగుని చుట్టి వడివడిగా వయ్యారంగా ఇళ్ళకు వస్తున్నారు. గోపాలకులు గోవులను నెమ్మదిగా మేతకు తీసుకువెళ్ళడానికి సిద్ధమవుతున్నారు.

ఇంతలో మన చిన్నికృష్ణయ్య స్నేహితులతో కలిసి ఆటలకు బయల్దేరారు. ఇలా ఇంట్లోంచి బయటకు వచ్చాడో లేదో మళ్ళీ తిరిగి ఒక్కసారిగా పరుగెత్తి ఇంట్లోకి వెళ్ళాడు. ఎందుకంటే అంతకు ముందు రోజే ఎవరో శ్రీకృష్ణుని కాళ్ళకు గజ్జలు బహుమతిగా ఇచ్చారు అవి పెట్టుకోవడం మర్చిపోయాడు. ఇంట్లోకి వెళ్ళి కాళ్ళకు గజ్జలు కట్టుకొని పరుగెత్తి మళ్ళీ స్నేహితులతో కలిసి ఆటలకు బయల్దేరాడు. ఆ రోజు మన క్రిష్ణయ్య ఎంత హుషారుగా ఉన్నాడో చూడండి. అలా

కృష్ణయ్య స్నేహితులందరితో కలిసి అటూ ఇటూ ఎగురుతూ ఊరి బయటకు వచ్చాడు.

ఆరోజు మన చిన్నికృష్ణయ్య మరింత సంతోషంగా ఉన్నాడు. అటు ఇటు తిరుగుతూ ఆ స్నేహితులతో కులాసాగా ఎన్నో కబుర్లు చెప్తూ ఎంతో హుషారుగా అటూ ఇటూ పరుగెడుతున్నాడు. ఆరోజు ఈ కృష్ణయ్యతో పాటు 14 మంది పిల్లలు ఆడుకుంటున్నారు. వారందరూ చిన్నికృష్ణయ్యతో ఏవో కబుర్లు చెప్తూ అటూ ఇటూ పరుగెడుతున్నారు.

ఇంతలో అటు ఒక పెద్ద నాగుపాము వచ్చింది. పిల్లలందరూ దానిని చూసి ఎంతో భయపడ్డారు చిన్నికృష్ణుడు మాత్రం ఏమాత్రం భయపడలేదు. కృష్ణుడు వద్దకు రాగానే కృష్ణయ్య పక్కనే ఉన్న గడ్డిలోనుంచి ఒక గడ్డిపరకను తీసి ఆ పాము పక్కన వేసాడు. అంతే అది ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా తిరిగి వెళ్ళిపోయింది. పిల్లలందరూ ఊపిరి పీల్చుకొని తిరిగి తమ ఆటల్లోకి వెళ్ళారు.

అటు తరువాత మరొక గంటసేపటికి అందరూ పక్కన ఉన్న చిన్న నీటి కొలనులో ఆడసాగారు ఒకరిపై ఒకరు నీళ్ళు చల్లుకుంటూ చిన్నికృష్ణయ్యతో స్నేహితులందరూ అలా ఆడుతున్న ఆ దృశ్యం ఎంత ముచ్చటగా ఉందో చూడండి.

ఇంతలో ఒక పిల్లవాడు గట్టిగా అరిచాడు దూరం నుంచి నీటిలో ఒక పెద్ద పాము పిల్లలవైపు రాసాగింది అది చూసి పిల్లలు వెంటనే ఒడ్డుకు పరుగెత్తారు. చిన్ని కృష్ణయ్య మాత్రం నీటిలోనే ఉండిపోయాడు. ఒక స్నేహితుడు మాత్రం కృష్ణయ్య వెనుక పక్కనే ఉన్నాడు.

ఇంతలో ఆ నాగుపాము వచ్చి చిన్ని కృష్ణయ్య చేతిని చుట్టుకుంది. ఒడ్డు నుంచి ఇది చూసిన స్నేహితులందరూ ఎంతో భయపడ్డారు. కాని చిన్ని కృష్ణయ్య ఏ మాత్రం భయపడక దాని వంక చిరునవ్వుతో చూసాడు. అది కాసేపు అలా ఉండి తిరిగి నీటిలోకి వెళ్ళిపోయింది. కృష్ణుని స్నేహితులందరూ హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

ఆ వచ్చిన నాగుపాము మరెవరో కాదు! సాక్షాత్తూ వైకుంఠంలోని ఆదిశేషుడే! ఆదిశేషుడు శ్రీమన్నారాయణులవారిని విడిచి ఉండలేక ద్వాపరయుగంలో బలరామునిగా జన్మించాడు. అయినా తన సర్పరూపంలోనే చిన్నికృష్ణుని వారి వద్దకు వద్దామనే కోరిక కలిగింది. అందుకే ఆనాడు తన ముచ్చట తీర్చుకోడానికి అలా సర్పరూపంలోని కృష్ణయ్య దగ్గరకు వచ్చాడు.

ఆరోజు చిన్ని కృష్ణుడి వెనక ఆడుకున్న పిల్లలో రాముడు అనే పిల్లవాడు ఉన్నాడు. ఆ పిల్లవాడు ఎప్పుడూ ఎంతో ధర్మపథంగా జీవిస్తూ ఉండేవాడు. ఆ జన్మలో శ్రీకృష్ణులవారికి ఇంకా కొన్ని సంవత్సరాలు గడిపిన పుణ్యఫలం చేత అటు తరువాత 400 ల ఉత్తమ జన్మలు పొందాడు. ఆ జన్మలలో ఒకసారి కాశీలో మహా పండితుడిగాను, మరొక జన్మలో కాశీ విశ్వనాథుడి దేవాలయంలో అర్చకునిగాను, మరొక జన్మలో పవిత్ర మధుర మీనాక్షి దేవి ఆలయంలో అర్చకుని గాను, మరొక జన్మలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకునిగాను, మరొక జన్మలో నేటి మహారాష్ట్ర ప్రాంతంలో గొప్ప విష్ణుభక్తుడిగాను జన్మించాడు.

ఈ జన్మలన్నింటిలోను అతడు ఎంతో ధర్మపథంగా జీవించాడు. ఇలా ధర్మపథంగా జీవిస్తున్నందువల్ల అతడు పుట్టిన ప్రతీ జన్మలోను ఎంతో ధర్మ ప్రచారం చేస్తూ కాలం గడిపాడు. ఇక్కడ మరొక

విషయం చెప్పుకోవాలి ఇటువంటి మహానుభావులు జన్మ జన్మకి మధ్య కొన్ని వందలు లేదా కొన్ని వేల సంవత్సరాలు ఏ జన్మ పొందరు. ఆ కాలంలో వారు పరమాత్మ హృదయంలోనే ఉంటారు. భగవంతుడు సంకల్పించినప్పుడు వారు తిరిగి మళ్ళీ ఈ భూమిపై జన్మించి మంచి ధర్మపరులై ఎన్నో ధర్మకార్యాలు చేస్తూ జీవిస్తారు.

అయితే ఎవరెవరు ఎంత కాలంపాటు అలా పరమాత్మ వద్దే ఉంటారు అన్నది ఆ జీవి చేసుకున్న పుణ్యఫలం బట్టి ఉంటుంది. కొందరు మహాపురుషులు, ఎంతో ఉన్నత ఆత్మలు దాదాపు 20,000 వేల సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే ఈ భూమిపై జన్మిస్తారు. ఆ మధ్య కాలం అంతా వారు పరమాత్మ చెంతనే ఉంటారు. ఇలా భూమిపై జన్మించినప్పుడు వారిలో కొందరు 400 ల సంవత్సరాలు, మరికొందరు 1000 సంవత్సరాలకు పైగా కూడా జీవిస్తారు. ఈ భూమిపై వారు చేయవలసిన కార్యాలన్నీ పూర్తి అయిన తరువాత వారు తిరిగి ఆ పరంధాముని వద్దకు వెళ్తారు.

అయితే వీరిలో కొందరు తరువాత జన్మలలో సాధారణ మానవులవలె ప్రవర్తించి ఆవేశకావేశాలకు పోయి తిరిగి ఈ జనన మరణ చక్రంలో పడిపోతారు. అయినప్పటికీ వీరు కొంతకాలం శ్రీమన్నారాయణుల వద్దనే ఉండడం చేత కొన్ని జన్మల వరకు ఆ స్వామిచే కాపాడబడుతుంటారు. అప్పటికి వీరు ఎన్నో అధర్మ కార్యాలు చేస్తూంటే ఆ భగవంతుడు ఇంక వీరిని వదిలేస్తాడు. వారు అప్పటినుంచి వారి వారి ప్రారబ్ద కర్మలను బట్టి అనేక జన్మలు పొందుతూ అనేక రీతులలో జీవిస్తూ తిరిగి ఈ జనన మరణ చక్రంలో పడిపోతారు.

15

అది 4వ మహాయుగంలోని కలియుగంలో 22,422 వ సంవత్సరం అప్పటికి ఆ కలియుగంలో నాలుగు గొప్ప నాగరికతలు వచ్చి ఒక్కొక్కటి 5000 వేల సంవత్సరాల పాటు వికసించి తిరిగి పూర్తిగా అంతరించిపోయాయి. ప్రస్తుతం 5వ నాగరికత నడుస్తుంది. ప్రజలు చాలామంది అధర్మంగా జీవిస్తున్నారు. ఎక్కడ ఎటువంటి విలువలు పాటింపబడడం లేదు. ప్రజలను పాలిస్తున్న పాలకులు ఎంతో అధర్మంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. వారు చేసే అరాచకాలకు అంతే లేదు. ప్రజలలో దైవభక్తి, పాపభీతి చాలామట్టుకు తగ్గిపోయాయి.

ఇలా ఉండగా ఒకనాడు బంగాళాఖాతంలో తీవ్ర తుఫాను ఏర్పడింది. అది ఎంత తీవ్రమైనది అంటే ఆ ధాటికి అలలు ఎంతో ఎత్తుకు రాసాగాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో సముద్రగర్భంలో తీవ్రమైన భూకంపం వచ్చింది. అంతే అటు తుఫాను ఇటు భూకంపం రెండు కలిసి సముద్రం అల్లకల్లోలంగా తయారయింది.

ఈ భూకంప ప్రభావానికి అత్యంత తీవ్రమైన సునామీ ఏర్పడింది. ఆ తీవ్రత ఎలా ఉన్నదంటే ఆ అలలు అవి తీరాన్ని తాకిన 5 నిమషాలలో కొన్ని వందల కిలోమీటర్లు భూభాగంలోకి చొచ్చుపడేలా ఉన్నాయి. అంటే ఇంక కొద్ది గంటల్లో కొన్ని కోట్లమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతారు. సరిగ్గా ఆ క్షణంలోనే ఈ విషయం హిమాలయంలో తపస్సు చేసుకుంటున్న ఒక మహాపురుషుడికి తెలిసింది.

వెంటనే ఆ మహర్షి తన కమండంలోనుంచి కొంత నీరుని తన కుడిచేతిలో పోసుకొని ఏదో ఉచ్ఛరిస్తూ తన ప్రక్కన ఒక రేఖలాగా పోసాడు. అంతే! ఆక్షణంలోనే సునామి తీవ్రత ఒక్కసారిగా తగ్గిపోయి ఆ తరంగాలు ఒడ్డును తాకి భూభాగంలోకి ఒక 20 కిలోమిటర్లు మాత్రమే ప్రవేశించాయి. చాలా తక్కువ జన నష్టం జరిగింది. చూసారా ఆ మహర్షి ఈ భూమిని ఎంత విపత్తు నుంచి కాపాడాడో!.

ఇటువంటి మహానుభావులు అన్ని యుగాలలోను, అన్ని కాలాలలోను, అన్ని ప్రదేశాలలోను ఉన్నారు. వారు తమ అనన్య శక్తితో ఈ సృష్టి సర్వనాశనం కాకుండా కాపాడుతూ ఉంటారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యం జరిగి కొన్ని కోట్ల ప్రజల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కనబడుతూ ఉంటే వీరు తమ శక్తితో దాని తీవ్రత తగ్గించి, ప్రాణ నష్టం చాలా తక్కువ జరిగేలా, ఆ వైపరీత్యం తీవ్రత తగ్గిపోయేలా చేస్తారు.

మనం ఎప్పుడైనా ఒకసారి తలెత్తి ఆకాశంవైపు చూస్తే కోట్లాది నక్షత్రాలు మన కంటికి కనబడతాయి. ఈ నక్షత్రాలు కొన్ని మన భూమికంటే ఎన్నో రెట్లు పెద్దవి. మనం ఆకాశంలో ఎన్నో గ్రహమండలాలను కూడా చూడవచ్చు. ఆకాశంలో నక్షత్రాలే కాక, తెల్లని పాలు పోసినట్లుగా, ఒక పాలచారిక లాగా విశాలంగా నక్షత్ర

రాశుల మధ్య ఒక సముద్రంగాలా ప్రవహిస్తున్నట్లు అనిపిస్తుంది. దీనినే పాలపుంతగా పిలుస్తారు.

దేవతలు ఈ మార్గంలో పయనిస్తారు. కొన్ని ఋతువులలో ఈ పాలపుంత తూర్పు పడమర దిశలలో వ్యాపించి ఉంటుంది. మరొక సమయంలో ఉత్తర దక్షిణ దిశలలో వ్యాపించి ఉంటుంది. ఈ పాలపుంత వెడల్పు, ప్రకాశము కూడా వివిధ ప్రదేశాలలో వేరు వేరుగా ఉంటుంది. కొన్ని ప్రదేశాలలో ఎక్కువ ప్రకాశవంతంగాను, మరికొన్ని చోట్ల తక్కువ ప్రకాశవంతంగాను కనిపిస్తుంది.

అసలు పాలపుంత అనేది ఎన్నో కోట్ల నక్షత్రాల సముదాయమే ఈ కోటానుకోట్ల నక్షత్రాలు మనకి చాలా దూరంగా ఉండడం వలన, ఎంతో ప్రకాశిస్తూ ఉండడం చేత అవన్నీ కలిసిపోయి ఒక పాలచారికలాగా కనిపిస్తుంది. మనకి కనిపించే సూర్యుడు కూడా పాలపుంతలోని ఒక నక్షత్రమే ఈ పాలపుంతలో మనకు కనబడే సూర్యుని కంటే ఎన్నో వేల రెట్లు ప్రకాశవంతమైన నక్షత్రాలు అనేకం ఉన్నాయి. ఈ పాలపుంత దాదాపు 20,000 వేల కోట్ల నక్షత్రాలు కలిగి కేంద్రం దగ్గర ఉబ్బెత్తుగాను, అంచుల వద్ద పలచగానూ ఉండి పళ్ళెం ఆకారంలో ఉంటుంది.

ఈ పళ్ళెపు అంచులే మనకు రెండు పాలచారికలాగా కనిస్తున్నాయి. ఎన్నో కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉండడం చేత ఆ నక్షత్రాలన్నీ విడివిడిగా కనిపించక వాటి ప్రకాశంతో కలిసిపోయి ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ పాలపుంతను దర్శించండి ఎంత అద్భుతంగా ఉందో ఆ పాలపుంతలో ఉన్న నక్షత్ర మండలాలలో పయనిస్తున్న ఆ దేవతలను దర్శించండి. వారందరూ ఎంత తేజస్సుతో మెరిసిపోతున్నారో చూడండి! ఆహా! ఎంత అద్భుతంగా ఉంది ఆ

దృశ్యం! సాధనలో ఉన్నత స్థాయికి వెళ్ళినప్పుడు ఈ పాలపుంతను స్పష్టంగా దర్శించవచ్చును.

ప్రతీజీవి ఈ సృష్టిలో కోట్లాది జన్మలలో జన్మిస్తూ పూర్వజన్మల ప్రారబ్ధకర్మలను అనుభవిస్తూ మళ్ళీ కొత్త కర్మలు చేస్తూ, ఇవి అనుభవించడానికి మరల మరల జన్మిస్తూ ఇలా కోట్లాది జన్మలలో జన్మిస్తూ, మరణిస్తూ ఈ జనన మరణ చక్రంలో పడి కొట్టుకుంటున్నారు.

ఒక్కో జీవి ఇన్ని కోట్ల సంవత్సరాలలో అనేక యుగాలలో ఎన్నెన్నో జాతులలో ఎక్కడో పర్వతాలలోను, నదీ గర్భాలలోను, దట్టమైన అడవులలోను, జనావాసాలలోను ఇలా ఎక్కడెక్కడో వారి వారి కర్మలను బట్టి తిరిగి తిరిగి జన్మిస్తూ అనేక బాధలు అనుభవిస్తూ ఎన్నో కష్టాల పాలవుతున్నారు. ఈ సృష్టిమొత్తం ఆవరించి ఉన్న, ఈ సృష్టిమొత్తాన్ని శాసిస్తున్న, ఈ సృష్టిమొత్తాన్ని సృజిస్తున్న, ఈ సృష్టిమొత్తాన్ని లయం చేస్తున్న మహామాయనుండి బయట పడలేకపోతున్నారు.

ఆ మహామాయను తప్పించుకోవడం ఎవరితరం కాదు. ఎన్నోసార్లు దేవతలు సైతం ఈ మహామాయలో పడి ఎన్నో దుష్కార్యాలకు ఒడిగడుతున్నారు. ఎక్కడో కోటి మందిలో ఒకరు ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాలకు కొన్ని జీవులు ఈ మహామాయనుండి బయటపడగలుగుతాయి. సామాన్య మానవులు మాత్రం ఈ మహామాయ ప్రభావంలో పడి సత్యం తెలుసుకోలేక తాము చూస్తున్నది, అనుభవిస్తున్నది సత్యం అని, శాశ్వతం అని భ్రమపడుతున్నారు.

ఇప్పుడు మన మధ్య ఈ భూమిపై ఉన్న ప్రతిజీవి కోట్లాది జన్మలనుంచి ఇక్కడ ఉన్నదే అని గ్రహించండి. ఇలా ఈ సృష్టి

ప్రారంభంలో పరమేశ్వరుడు సృజించిన అనంతమైన జీవులు అలా అప్పటినుండి అనేక మహాయుగాలలో జన్మిస్తూనే ఉన్నారు. ఇటువంటి జీవులలో ఒక జీవి ఆత్మపయనం గురించి తెలుసుకుందాము. ఒక జీవి ఆత్మప్రయాణం ఎలా సాగుతుందో మనకి తెలుస్తుంది.

పరమేశ్వరుడు సృష్టి ప్రారంభంలో సృష్టించిన జీవులలో సుధాముడు అనే వ్యక్తి ఒకడు. ఇతడు కృతయుగంలో 400 ల జన్మలు మానవ జన్మలో జన్మించి ఎన్నో మంచిపనులు చేసాడు. కొన్ని జన్మలలో ఎందరో శిష్యులను తీర్చిదిద్దాడు. ఒక జన్మలో గొప్ప సంగీతకారుడిగా జన్మించి ఆ పరమేశ్వరుని గురించి ఎన్నో కీర్తనలు రచించాడు. ఆ కృతయుగంలోనే ఒక 4 జన్మలలో చిన్న చిన్న అపరాధాలు చేస్తూ ఆ ప్రభావం చేత తరువాత జన్మలలో కష్టాలు అనుభవించాడు. అయినా భగవంతుని తలవడం, కీర్తించడం ఎప్పుడూ మానలేదు

అలా కృతయుగం మొత్తం ఈ సుధాముడు కొన్ని లక్షల జన్మలలో జన్మించాడు. ఒక జన్మలో ఇతనికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, బంధువులు, స్నేహితులుగా జన్మించిన వారందరూ ఆయా బంధాల చేత తిరిగి తిరిగి ప్రతీ జన్మలోను సుధాముడికి ఏదో విధంగా ఆత్మీయ బంధువులై జన్మిస్తూ, మరల మరల అనేక బంధాలు పొందుతూ, అనేక ఋణాలు పోగుచేసుకొని అనేక జన్మలలో వేరు వేరు ప్రాంతాలలో జన్మిస్తూ మధ్య మధ్యలో సుధాముడికి ఏదో ఒక బంధంతో దగ్గరవుతున్నారు.

జన్మ జన్మల బంధాలు మానవులని ఇలాగే కలుపుతూ ఉంటాయి. తిరిగి తిరిగి వారిని ఏదో విధంగా ప్రతీ జన్మలో ఏదో రీతిలో కలుస్తూనే ఉంటాము. ఈ జన్మలో మీకు తారసపడిన ప్రతీ జీవి ఇంతకుముందు కోట్లాది జన్మలలో ఎప్పుడో ఎక్కడో ఏదో ఋణపడి ఉన్నవారేనని గ్రహించండి.

ఆయా జన్మలలో ఆయా జీవులతో మీకున్న అనుబంధం బట్టి, మీరు వారితో ప్రవర్తించిన తీరునుబట్టి మీరు వారిపై పెంచుకున్న బంధ తీవ్రతను బట్టి, మీరు వారి ప్రవర్తన వల్ల ఎలా ప్రభావితం అయ్యారు అన్నదాన్నిబట్టి, దానికి మీరు ఎలా ప్రతిస్పందించారు అన్న దాన్ని బట్టి ఆ జీవులన్నీ తరువాతి జన్మలలో మిమ్మల్ని ఏదో విధంగా కలవడం జరుగుతుంది.

వారిలో మీకు కొందరు అత్యంత ఆప్తులు అవుతారు. వీరిలో కొందరు మీరు అనుభవిస్తున్న కష్టాలకు, సుఖాలకు కారణభూతులవుతారు. ఇదంతా పూర్వజన్మల బంధాల వలన జరుగుతున్నదే అని గ్రహించండి. ఈ జన్మలో మీకు జరుగుతున్న ప్రతీ సంఘటన కోట్లాది పూర్వజన్మలలో మీరు చేసుకున్న ప్రారబ్ధకర్మల ఫలితమే అని గ్రహించండి.

నిన్న నేను ఒకరి ఇంటికి వెళ్ళడం జరిగింది. వారు నేను వెళ్ళగానే బయటకు వచ్చి వారి ఇంటి గేటు తీస్తుండగా ఒక కాకి ఎక్కడినుంచో వచ్చి వీరి తలపైకి తగులుతూ రివ్వున వెళ్ళిపోయింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి వారు ఎంతో ఆశ్చర్యపోయారు. అసలు విషయం ఏమిటంటే ఈ కాకి ఒక 2000 వేల జన్మల క్రితం మా స్నేహితుడు ఒక వర్తకునిగా జన్మించినపుడు అతని పక్క ఇంట్లో ఒక రెండు నెలలు ఉన్న ఒక స్నేహితుడే!

ఆ స్నేహితుడు తరువాత జన్మలలో అనేక పాపకార్యాలు చేసి జంతు ప్రపంచంలో వేలాది జన్మలలో జన్మిస్తూ ఈ జన్మలో ఈ ప్రాంతంలో ఇతడు కాకి రూపంలో జన్మించాడు. అతడి ఆత్మ అప్పటి జన్మలో తన పక్కన ఉన్న ఈ వర్తకుడిని గుర్తుపట్టి ఒక్కసారిగా రివ్వున వచ్చి ఇతనిని గట్టిగా తాకుతూ వెళ్ళిపోయింది. ఆ కాకి ఆత్మకు అప్పటి అనుబంధం ఇంకా గుర్తు ఉంది. అందుకే అప్పటి వర్తకుడి ఆత్మ

ఈరోజు నా స్నేహితుని రూపంలో ఉన్నప్పటికి ఆ కాకి ఆత్మ అది గ్రహించి ఒక్కసారిగా చెట్టుమీద నుంచి ఎగిరి నా స్నేహితుడి తలపై గట్టిగా రాసుకుంటూ వెళ్ళిపోయింది. చూసారా పూర్వజన్మల బంధాలు ఇలా ఉంటాయి. ఇది అతి చిన్న బంధం అదే ఇంకా గట్టి బంధం అయితే ఇంక ఎలా ఉంటుంటో ఊహించుకోండి.

ఈరోజు మిమ్మల్ని తిట్టిన మీ స్నేహితుడు, మిమ్మల్ని విసుకున్న మీ భర్తగాని, మీ భార్యగాని మీతో పెద్ద గొడవ పెట్టుకున్న పక్కింటి వారు గాని, మీకు ఎంతో దగ్గరైన మీ స్నేహితుడుగాని వీరందరూ ఇలా మీకు దగ్గర అవ్వడానికి, మీతో ఇలా ప్రవర్తించడానికి పూర్వజన్మల బంధాలే కారణం అని తెలుసుకోండి. అదికూడా క్రిందటి జన్మలో బంధాలే కాకపోవచ్చు. ఒక పది మహాయుగాలు వెనక త్రేతాయుగంలో మనం ఏ చాకలివాడిగానో జన్మించినప్పటి బంధాలు 17 మహాయుగాలు తరువాత తిరిగి నీకు అనుబంధంగా ఏర్పడవచ్చు.

కొన్ని కొన్ని బంధాలు కొన్ని లక్షల సంవత్సరాల జన్మల దాకా తిరిగి మనల్ని కలవదు. కొన్ని ప్రత్యేక కారణాల వల్ల కొన్ని బంధాలు మనల్ని తిరిగి తరువాతి జన్మలోనే అనుబంధంగా ఏర్పడతాయి. ఇలా బంధాలుగా మనకు దగ్గరైన వారు మనతో ఉండే కాలం, మనతో ప్రవర్తించే తీరు మనకు పూర్వజన్మలలో వారితో గల బంధం వలన, మన ప్రారబ్ధ కర్మ వలన జరుగుతుంది.

16

మళ్ళీ మనం సుధాముడు దగ్గరకి వద్దాం. సుధాముడు అనేక జన్మలలో మంచి పనులు చేస్తూ ఎంతో ధర్మపరంగా జీవించాడు. ఇలా ఒక త్రేతాయుగంలో 2000 వేల జన్మలు ఎంతో ధర్మాత్ముడిగా జీవించాడు. అంత పుణ్యఫలం చేసుకొనుటవలన అతడు కొంతకాలం ఏజన్మలు లేకుండా ఆ పరమాత్మ వద్దనే ఉన్నాడు. కొన్ని వేల సంవత్సరాలు అలా ఇతడి పుణ్యఫలం పూర్తి అయిన తరువాత తిరిగి భూమి మీదకి మానవ జన్మలో జన్మించాడు.

కొంతమంది మహానుభావులు ఇలా కొన్ని లక్షల సంవత్సరాలు భూమిమీద జన్మించకుండా గోలోకం వంటి గొప్ప లోకాలలో ఉంటారు. అటు తరువాత తిరిగి ఈ భూమిపై జన్మిస్తారు. త్రేతాయుగంలో శ్రీమన్నారాయణుల వారు శ్రీరామచంద్రుడిగా జన్మించినప్పుడు సుధాముడు ఒక మహాపండితుడిగా జన్మించాడు. ఆజన్మలో సుధాముడు అనేకమార్లు శ్రీరామచంద్రుల వారిని దర్శించి, ఆ స్వామివారితో అనేక శాస్త్ర చర్చలు కూడా చేసాడు.

అంతేకాదు! కొన్నిసార్లు అంత:పురానికి వెళ్ళి శ్రీరామచంద్రులవారిని కలిసి అద్భుతమైన పద్యాలు పాడి వినిపించాడు. అతని కంఠం ఎంతో శ్రావ్యంగా ఉండేది. సుధాముడు పద్యాలు పాడుతుంటే పామరులకు కూడా వినడానికి ఎంతో ఆనందం కలిగేది. ఆ పద్యాలు విన్న శ్రీరామచంద్రులవారు ఎంతో సంతోషపడి సుధాముడికి ఒక ముత్యాల మూటను బహూకరించాడు.

సుధాముడు ఎంతో ఆనందపడి, ఆ ముత్యాల మూటను కన్నులకు అద్దుకొని దానిని మహాప్రసాదంగా భావించి తన ఇంటికి తీసుకొని వెళ్ళి భార్య పిల్లలకు చూపించాడు. భార్యా పిల్లలు అందరూ ఎంతో సంతోషించారు. ఇలా సుధాముడు శ్రీరామచంద్రులవారి కోరిక మేరకు భాగవత పద్యాలను ఆ స్వామికి వినిపించేవాడు. శ్రీకృష్ణ లీలలు పద్యాలుగా విని స్వామివారు ఎంతో ఆనందించారు. సుధాముడు కూడా ఎంతో సంతోషపడి భారత భాగవత పద్యాలను అప్పుడప్పుడు అంత:పురానికి వచ్చి శ్రీరామచంద్రులవారికి వినిపించేవాడు.

అదిగో చూడండి! ఈరోజు సుధాముడు ఆ భాగవత పద్యాన్ని ఎంత చక్కగా ఆలపిస్తున్నాడో! అది వింటున్న శ్రీరామచంద్రులవారు ఎంత సంతోషపడుతున్నారో చూడండి. ఇక్కడ మీకు ఒక అనుమానం రావొచ్చు శ్రీరామచంద్రులవారేమిటి భాగవతం వినడం ఏమిటి అని త్రేతాయుగం తరువాత కథ ద్వాపరయుగం అని మీకు అనుమానం రావచ్చు. ఇక్కడే గొప్ప విశేషం ఉంది ఇప్పటివరకు 27 మహాయుగాలు జరిగాయి. ప్రతీ మహాయుగంలోని త్రేతాయుగంలో స్వామివారు ఉన్నారు. అలాగే ప్రతీ మహాయుగంలోని ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానుల వారు అవతరించారు.

అంటే క్రిందటి మహాయుగంలో త్రేతాయుగం నాటికి అంతకుముందు మహాయుగంలోని ద్వాపరయుగంలో జరిగిన శ్రీకృష్ణ లీలలు కొందరు మహానుభావులకు తెలుసును. ఇలా ఎన్నో మహాయుగాలలో వచ్చిన శ్రీరామ, శ్రీకృష్ణ ఇంకా అనేక దేవతల అవతారాలు చేసిన లీలా విశేషాలు మహర్షులకు మాత్రమే తెలుసును. ప్రతీ మహాయుగంలో జన్మించిన వ్యాసుల వారికి మాత్రమే తెలుసును.

ఇలా ఇప్పటిదాకా గడిచిన 27 మహాయుగాలలో ఎన్నోసార్లు ఈ అవతార మూర్తులు భూమిపై అవతరించి ఏ విధంగా ధర్మరక్షణ చేశారు అనేది వివరంగా సామాన్య మానవులైన మనకు తెలియదు. కేవలం మహాపురుషులు కొందరికి మాత్రమే ఈ విషయాలు తెలుసు. మనకి తెలిసిన రామాయణం, మహాభారతాలు ఈ కలియుగం వెనుక వచ్చిన త్రేతాయుగం, ద్వాపరయుగాలలో జరిగినవే. కాని అంతకుముందు మహాయుగాలలో శ్రీరామ, శ్రీకృష్ణ ఇలా ఎందరో దేవతలు జన్మించినప్పటి వివరాలు, విశేషాలు మనకు తెలియదు. ఇవన్నీ దేవరహస్యాలుగా భావించిన మహాపురుషులు వాటిని బయటకి చెప్పలేదు.

అంతేకాదు ఇవన్నీ విని అర్థం చేసుకునే శక్తి కలియుగంలో సామాన్య మానవులకు ఉండదు అని వారికి తెలుసును. అందుకే ఆ విశేషాలు వారు ఎప్పుడూ బాహ్యంగా చెప్పలేదు. కానీ ఈ మహాపురుషులు అన్ని యుగాలను, అన్ని అవతారాలను, అన్ని విశేషాలను దర్శించారు. అన్ని మహాయుగాలలో జరిగిన ప్రతీ సంఘటనలను వారు దర్శించగలరు. అటువంటి మహాపురుషులు ఎంతో గుప్తంగా ఇప్పటికి మన మధ్య ఉన్నారు. వారిని గుర్తించడానికి మనకు ఎన్నో వేల జన్మల పుణ్యఫలం కావాలి. అన్ని వేల జన్మల పుణ్యఫలం ఉంటే కూడా వారిని గుర్తించగలుగుతాము కాని, వారి అపారశక్తిలో సహస్రవంతు కూడా మనం అంచనా వేయలేము.

వారు కనులు మూసుకొని అంతర్ముఖంగా చూసినపుడు గడిచిన అన్ని మహాయుగాలలోను, రాబోయే అన్ని మహాయుగాలలోను జరగబోయే అన్ని విశేషాలు, అన్ని సంఘటనలు ప్రతీ ఒక్కటి స్పష్టంగా గోచరిస్తాయి.

మనం మళ్ళీ సుధాముడి విషయం దగ్గరకు వద్దాం. సుధాముడు ఎన్నో వేల ఉత్తమ జన్మలలో జన్మించి ఉండడం చేత ద్వాపరయుగంలో కూడా జన్మించాడు. ఇప్పటి ద్వారక ఉన్న ప్రదేశంలో శ్రీకృష్ణ భగవానుడు జన్మించడానికి కొన్ని లక్షల సంవత్సరాల పూర్వం ఒక గొప్ప ఆశ్రమం ఉండేది. అక్కడ ఒక సరస్వతీ పీఠం ఉండేది ఆ పీఠాధిపతి ఎంతో గొప్ప శాస్త్రజ్ఞానం కలవాడై వేదవ్యాసుల వారితో సమానమైన మేధస్సు కలిగినవాడు.

సుధాముడు ఒకసారి ద్వాపరయుగంలో ఆ సరస్వతీ పీఠానికి ఆధిపత్యం వహించాడు. భారతదేశం నలుమూలలా తిరిగి ఎన్నో ధార్మిక ప్రసంగాలు చేసాడు. ఇప్పటి కాబూల్, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాలకి కూడా వెళ్ళి అక్కడ ఎన్నో వేద పాఠశాలలు కూడా నెలకొల్పాడు. ఆ కాలంలో ఇప్పటి ఈ దేశాలు ఏమి లేవు. అక్కడక్కడ రాజ్యాలు ఉండేవి. నేడు వినడానికి నమ్మశక్యం కాకపోయినా అటువంటి అనేక ప్రదేశాలలో సనాతన ధర్మం మునుపటి యుగాలలో ఎంతో గొప్పగా విరాజిల్లింది.

17

ఆ పుణ్యకాలం ఎంత గొప్పది, ఎంత మహత్తరమైనది అంటే అప్పటి త్రేతాయుగంలో కొన్ని పక్షులు సామవేదగానం చేసేవి. అవి బ్రతికినంతకాలం కేవలం పళ్ళు మాత్రమే తినేవి. ఆ కాలంలో ఆనందపక్షి అని ఒక పక్షి 2000 వేల సంవత్సరాలు జీవించేది. కేవలం పళ్ళుమాత్రమే తినేది అదికూడా నాలుగురోజులకు రెండుపళ్ళు మాత్రమే తినేది. ఈ పక్షి ఒక దేవతాంశగల పక్షిగా పరిగణింపబడేది. ఈ పక్షి ఒకసారి శ్రీకృష్ణుల వారి ఉద్యానవనానికి వచ్చి సామవేదగానం చేసింది. ఇది విన్న శ్రీకృష్ణులవారు రుక్మిణిదేవితో కలిసి ఈ ఉద్యానవనంలోకి వచ్చారు. అప్పుడు రుక్మిణీదేవి ఈపక్షి సామవేద గానం విని ఎంతో ఆశ్చర్యపడుతుంటే శ్రీకృష్ణులవారు రుక్మిణీదేవికి ఈపక్షి విశిష్టతను చెప్పారు.

ఇది కృత, త్రేతాయుగాలలో ఎక్కువగా కనిపిస్తూ ఉండేది అని, ఇప్పటి ద్వాపరయుగంలో ఇలా రెండు మూడు సార్లు మాత్రమే కొందరికి మాత్రమే దర్శనమిస్తుంది అని చెప్పేవారు. కలియుగంలో

ధర్మం ఏమాత్రం ఆచరింపబడదు కాబట్టి ఈపక్షి కలియుగంలో ఈ భూమిపై ఉండదని, కలియుగం ఉన్నంతకాలం ఒక గ్రహమండలంపై ఉండి తిరిగి కృతయుగం రాగానే ఈ భూమిపైకి వస్తుందని చెప్పారు. శ్రీకృష్ణులవారి ద్వారా ఈపక్షి గురించిన విశేషాలన్నీ తెలుసుకున్న రుక్మిణిదేవి ఎంతో సంతోషపడింది.

ఈ ఆనందపక్షి శివ, విష్ణు అంశలను కలిగిఉంటుంది. ఇద్దరి తేజస్సుతో ఈపక్షి ప్రకాశిస్తూ చూసినవారిని ఎంతో ఆకట్టుకుంటుంది. విశేషం ఏమిటంటే ఈపక్షి మానవులను మాత్రమే కాదు, తోటి పక్షిజాతిని, సమస్త జీవకోటిని ఆకర్షిస్తుంది.

ఈపక్షి చెట్లపై కూర్చొని సామవేదం గానం చేస్తున్నప్పుడు అక్కడ ఉన్న సమస్త జీవకోటి పరవశించిపోతుంది. ఈపక్షి గానం విని ఎంతో దూరం నుంచి కూడా అనేక పక్షులు, అనేక జంతువులు వచ్చి ఈ ప్రదేశంలో ఉండి ఈ పక్షి సామవేదగానం చేస్తున్నంతసేపు వింటూ నిశ్చలంగా ఉంటాయి.

ఈ ఆనంద పక్షి సామవేదగానం చెయ్యడం వెనుక ఒక దేవరహస్యం ఉన్నది. శ్రీవ్యాసభగవానులవారు మొదటి మహాయుగంలో ఒక గొప్ప దేవవనంలో కూర్చొని ధ్యానం చేస్తూ వేద రాశిని విభజింప సాగారు. ఆ వేద విభజన కొంతకాలం సాగింది. ఆ విధంగా శ్రీవేదవ్యాసుల వారు ఆ దేవవనంలో కూర్చొని వేదవాంగ్మయం విభజిస్తున్నప్పుడు ప్రకృతి అంతా పరవశించి పోయింది.

ఆ సమయంలో సర్వ దేవతలు ఆ పవిత్ర ప్రదేశంలోనే దివ్య రూపాలలో సంచరిస్తూ ఉండేవారు. వ్యాసభగవానుడు దగ్గరలో ఉన్న నదీ తీరానికి వెళ్ళి అక్కడ స్నానమాచరించి సూర్యభగవానునికి అర్ఘ్యం ఇచ్చి తిరిగి ఆశ్రమానికి వచ్చి వేద విభజన మొదలు పెట్టేవారు.

ఈ విధంగా వ్యాసుల వారు వేదరాశిని విభజిస్తున్నప్పుడు బ్రహ్మ, శ్రీమన్నారాయణుడు, శ్రీపరమేశ్వరుడు వచ్చి కాసేపు ముచ్చటించి వెళుతూ ఉండేవారు. ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ వేదవ్యాసులవారిని దర్శించండి.

వేదవ్యాసుల వారు ఆ విధంగా వేద విభజన చేస్తున్నప్పుడు అక్కడ పరిసరాలలో ఉన్న చెట్లపై ఉన్న కొన్ని పక్షులు ఈ వేద విశేషాలు వింటున్నాయి. ఈపక్షులన్నీ ఈ విధంగా శ్రీమన్నారాయణులవారి అంశతో జన్మించిన వేదవ్యాసుల ద్వారా వేద శాస్త్రాల విశేషాలు కొన్ని తెలుసుకొనడంతో ఎంతో పుణ్యం ఫలం సంపాదించుకొని తరువాత అనేక మానవ జన్మలు ఎత్తి వారిలో కొందరు మహాపండితులుగా జన్మించారు. వారి ఆత్మలకు ఆనాటి వాసనలు గట్టిగా అతుక్కొని వారికి అనేక శాస్త్ర విషయాలు అలవోకగా తెలియసాగాయి.

వీరే అటు తరువాత యుగాలలో గొప్ప పండితులుగాను, గొప్ప ప్రవచనకారులుగాను జన్మించారు. వీరికి ఉన్న జ్ఞానం ఒక్క జన్మలో సంపాదించినవి కాదు ఆనాడు అలా సాక్షాత్తూ శ్రీవేదవ్యాసుల ద్వారా అనేక వేద విశేషాలు విని ఉండడం చేత ఈనాడు వారికి అనేక పురాణాలలోని విశేషాలు ఒక ప్రవాహంలా వారి నోటి వెంబడి వస్తాయి. అటువంటి మహాపురుషుల ద్వారా పురాణ విశేషాలు విన్న ప్రజలు ఎంతో తరిస్తారు. వారిని కేవలం దర్శించి నమస్కరించిన ఎన్నో వేల జన్మల పాపఫలం నశిస్తుంది.

18

ఈ పుస్తకం రాస్తున్నప్పుడు నేను నా హృదయంలో ఎన్నో యుగాలను దర్శించాను. ఎంతో గొప్ప దివ్య అనుభూతులను పొందాను. ఇప్పటి దాకా ఎన్నెన్నో మహాయుగాలలో జరిగిన అనేక సంఘటనలు మా కంటి నుండి గోచరించాయి. ఇవన్నీ అక్షరరూపంలో పెడితే అది కొన్ని వేల పేజీల పుస్తకం కాగలదు అందుకని ఈ పుస్తకంలో కొన్ని విషయాలను మాత్రమే వివరించాను. ఎన్నెన్ని సంఘటనలు? ఎన్నెన్ని దేవతల అవతారాలు? ఎన్నెన్ని యజ్ఞాలు, యాగాలు? ఇలా ఈ భూమిపై ఎన్నో వైవిధ్యమైన నాగరికతలు పుట్టి, వర్థిల్లి తరువాత కాల గర్భంలో కలిసిపోయాయి. ఆ నాగరికతలలో జన్మించిన అనేక వ్యక్తులు ఇప్పటికి మనమధ్యనే ఉన్నారు.

ఈరోజు మనం సంచరిస్తున్న ఈ ప్రాంతాలలో ఇంతకుముందు మహాయుగాలలో ఎన్నోరకాల భవంతులు ఉండేవి. ఇలాగే ఇప్పటి ఈ భవంతులన్నీ కూడా రేపు కాలగర్భంలో కలిసిపోతాయి. ఈ ప్రపంచమంతా బ్రహ్మాండమైన కాస్మిక్ ఎనర్జీ

వ్యాపించి ఉంది. మనం ధ్యానంలో ఉన్నప్పుడు ఆ శక్తిని గ్రహించగలుగుతాము. కృతయుగంలోను, త్రేతాయుగంలోను, ద్వాపరయుగంలోను ఈ దివ్యశక్తి దివ్యతరంగాల రూపంలో ఎంతో ఎక్కువ పరిమాణంలో విశ్వమంతా వ్యాపించి ఉన్నది.

ఈ శక్తి మొత్తం ఈ సృష్టి మొత్తానికే మూలమైన దివ్యశక్తినుంచే వస్తున్నదని గ్రహించాలి. ఆ దివ్యశక్తినుండి వెలువడే దివ్యతరంగాలు కోటానుకోట్ల సూర్యుల కంటే శక్తిగలవి. ఆ దివ్యశక్తినుంచే మనం నిత్యం కొలిచే ఎందరో దేవతలు ఆవిర్భవించారు. అందుకే ఆ దేవతలు అందరి చుట్టూ ఎంతో దివ్య తరంగాల వలయాలు ఆవరించి ఉంటాయి. వీరందరూ ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తూంటారు.

త్రేతాయుగంలో శ్రీమన్నారాయణుల వారు శ్రీరామచంద్రునిగా అవతరించినప్పుడు మహర్షులు ఈ అద్భుతశక్తిని ఆ రామచంద్రునిలో దర్శించారు. అయితే సామాన్య మానవులు అంతటి తేజస్సును భరించలేరు కాబట్టి భగవంతుడు ఈ భూమిపై అనేక అవతారాలలో వెలసినప్పుడు వారికి సామాన్యమైన, తక్కువ స్థాయిలో ఉన్న శక్తిని దర్శింపచేస్తారు. కేవలం మహర్షులు, గొప్ప యోగులు, సిద్ధులు మాత్రమే ఈ అవతార మూర్తులలో దివ్యతేజస్సును పూర్తిగా దర్శించగలుగుతారు. సామాన్యులకు మాత్రం వారు సామాన్య మానవుల లాగానే కనిపిస్తారు.

అందుకే త్రేతాయుగంలో శ్రీరామచంద్రులవారిని, ద్వాపరయుగంలో శ్రీకృష్ణులవారిని వారి చుట్టూ ఉన్న అనేకమంది వారిని సామాన్య మానవులలాగానే తలచారు. వారిని భగవంతునిగా గుర్తించలేకపోయారు. భగవంతుని రూపం, ఉనికి గుర్తించడం సామాన్యులకు సాధ్యం కాదు దీనికి ఎన్నో కోట్ల జన్మల పుణ్యఫలం

కావాలి. అంతటి పుణ్యఫలం లేకపోతే సాక్షాత్తూ భగవంతుడే మన పక్కన నుంచున్నా మనం వారిని చూసి సామాన్య మానవులలాగానే భ్రమపడతాము.

ఈ విశ్వంలో వ్యాపించిన దివ్యతరంగాలు పుణ్యక్షేత్రాలలో ఎక్కువగా వ్యాపించి ఉంటాయి. తిరుమలలో సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారే శ్రీనివాసునిగా వెలసి ఉండడం చేత అక్కడ ఈ దివ్యతరంగాలు అనేక శక్తిలో వ్యాపించి ఉంటాయి. అందుకే మనం పుణ్యక్షేత్రాలలో కొద్దిరోజులు గడిపితే మన ఆరోగ్యం బాగుపడి మనలో ఎంతో గొప్ప శక్తి వస్తుంది.

ఇక్కడ మరొక విశేషం చెప్పాలి. ప్రస్తుతం ఈ భూమండలంపై అనేక చోట్ల ఎన్నో దేవాలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని స్వయం వ్యక్తాలు, కొన్ని మహర్షులచే ప్రతిష్ఠింపబడ్డవి, కొన్ని యోగులచే ప్రతిష్ఠింపబడ్డవి. మిగిలినవి మానవ నిర్మితాలు. త్రేతాయుగంలోను, ద్వాపరయుగంలోను ఉన్న ఎన్నో గొప్ప ఆలయాలు ఈ కలియుగంలో పూర్తిగా మాయమయ్యాయి.

అయితే అప్పుడు ఏదైనా ఆలయం ఉన్న ప్రదేశంలో ఈరోజు ఏదైనా కొత్త ఆలయం నిర్మింపబడితే అది ఎంతో శక్తివంతంగా ప్రసిద్ధి చెందుతోంది. దానికి కారణం ఇంతకుముందు యుగాలలో అక్కడ ఎంతో గొప్ప ఆలయం ఉండడమే. అది ఈనాడు కలియుగంలో పూర్తిగా కనుమరుగు అయినప్పటికీ, ఆ ప్రదేశంలో ఎంతోగొప్ప దివ్యతరంగాలు నిక్షిప్తమై ఉండడం చేత ఇప్పుడు ఆ ప్రదేశంలో నిర్మింపబడ్డ ఆలయం ఎంతో శక్తివంతంగా రూపుదిద్దుకుంటుంది.

ఇటువంటి ఆలయాలు ఎన్నింటినో నేను నా మనోనేత్రంతో దర్శించాను. అక్కడ ఆలయం నిర్మించిన దాతలు అవి

మామూలు ప్రదేశంగా భావించినప్పటికి ఆ ప్రదేశంలో త్రేతాయుగంలో గొప్ప ఆలయం ఉండడం నేను గమనించాను. ఒక్కోసారి త్రేతాయుగంలోను, ద్వాపరయుగంలోను మహర్షులు తపస్సు చేసుకున్న ప్రదేశాలు ఈరోజు ఎంతో శక్తివంతమైనవిగా వర్ధిల్లుతున్నాయి. దురదృష్టం ఏమిటంటే ఇటువంటి వాటి గురించి, ఈ కాల పరంపర, ఈ యుగ పరంపర గురించి, పూర్వయుగాలలో ఎక్కడ ఏమున్నది అని చెప్పేవారు ఈ కలియుగంలో ప్రత్యక్షంగా ప్రజల మధ్యకు రాకపోవడం వలన ఈ విశేషాలు మానవులు ఎవరికీ తెలియడంలేదు. కానీ అన్ని యుగాలను క్షణకాలంలో దర్శిస్తున్న మహాపురుషులు ఎందరో మనమధ్యనే ఉన్నారు. ఎన్నో జన్మల పుణ్యఫలం చేతనే మనం వారిని గుర్తించగలుగుతాము. వారు సర్వము దర్శించగల ద్రష్టలు.

19

అది ద్వాపరయుగంలో ఒక రోజు. ఆనాడు శ్రీకృష్ణుడు ద్వారకానగరం వీధులలో విహరిస్తున్నాడు. ద్వారక ఎంతో అద్భుతమైన నగరం. ఇన్ని యుగాలలోను ఉన్న అనేక నగరాలలో ద్వారక ఎంతో అద్భుతమైనటువంటిదిగా ప్రసిద్ధి పొందింది. ద్వారక తరువాత త్రేతాయుగంలోని మిథిలా నగరాన్ని చాలా గొప్పగా చెప్పుకుంటారు. ద్వారకానగరంలో కొన్ని లక్షల రాజ భవనాలు ఉన్నాయి. అన్నీ ఎంతో అద్భుతమైన ఆకృతులతో నిర్మించబడి గోడలపై వజ్రాలు పొదగబడి ఉన్నాయి.

ద్వారకానగరంలో ఎన్నో వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కర్మాగారాలు, పెద్ద పెద్ద వ్యాపారాలు చేసుకునే భవంతులు ఉండేవి. అదిగో ఆ రాజ ప్రాసాదాన్ని చూడండి. ఎంత అందంగా ఉందో. ఆ గోడలపై ఎన్ని రత్నాలు, ఎన్ని వజ్రాలు ఉన్నాయో చూడండి. ఇప్పటి నాగరికతకు వేయిరెట్లు గొప్ప నాగరికత ఆ రోజుల్లో ద్వారకానగరంలో ఉండేది. అనేక వృత్తుల వారు వారి వారి

పనులు చేసుకుంటూ జీవించేవారు. అదిగో ఎంతో వేగంగా వెళ్తున్న ఆ గుర్రపు బండిని చూడండి ఎంత అద్భుతంగా ఉందో!

ఆనాడు శ్రీకృష్ణుడు ద్వారకానగరంలో తిరుగుతూ అందరినీ పలకరిస్తున్నాడు. వారెవరికి శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుల వారి అవతారం అని తెలియదు. శ్రీకృష్ణుల వారిని వారందరూ వారిలో ఒకడిగానే భావించేవారు. శ్రీకృష్ణుల వారు ఆరోజు తనతో ఇద్దరు స్నేహితులను వెంటపెట్టుకొని నగర వీధుల్లో విహరించసాగారు. ఆ వీధులన్నీ ఎంత శుభ్రంగా ఉన్నాయో చూడండి. నేలపై ఏ మాత్రం దుమ్ములేదు. వీధుల్లో ఇళ్ళ ముందు, అంగళ్ళ ముందు ఎంతో చక్కటి రంగవల్లులు దిద్దబడి ఉన్నాయి.

ఆ రంగవల్లులను చూడండి. ఎన్నో అద్భుతమైన రంగులతో అద్దబడి చూడడానికి ఎంత అద్భుతంగా ఉన్నాయో. శ్రీకృష్ణుడు ప్రతీ వీధిలో నడుస్తూ, ఎదురుపడినవారిని పలకరిస్తూ వారి యోగ క్షేమాలు కనుక్కొంటూ ముందుకు వెళ్తున్నాడు. ఇంతలో ఒక గోప స్త్రీ వచ్చి ఇంత వెన్న ఇచ్చింది చూడండి. మన కృష్ణయ్య ఆ వెన్నను ఎంత ఆనందంగా ఆరగిస్తున్నాడో. ఆ గోపకాంత నుంచి వెన్నను తీసుకొని ఆమె పూర్వం కొన్ని వేల జన్మలలో చేసిన పాపాలన్నీ ఆక్షణంలో హరింపచేసాడు. ఆమె ఇచ్చిన వెన్నను శ్రీకృష్ణుడు ఎంతో సంతోషంగా ఆరగించడం చూసిన ఆ గోపకాంత ఎంతో ఆనందపడి స్వామికి నమస్కరించి ముందుకు వెళ్ళింది.

ఇంతలో రెండు నెమళ్ళు వచ్చి కృష్ణయ్య పాదాల వద్ద వచ్చి వాలాయి. కృష్ణుడు ఒక్కసారి ఆగి వాటిని నిమరగానే అవి ఎంతో ఆనందపడి వెళ్ళిపోయాయి. ఇది చూసి స్నేహితులిద్దరూ ఎంతో సంతోషపడ్డారు. అప్పుడు అక్కడ రాలిన ఒక పింఛం తీసుకొని

కృష్ణయ్య తన తలపై ధరించాడు. ఆహా ఆ నెమళ్ళ జన్మ ధన్యమయ్యింది కదా! ఆ నెమళ్ళు ఎంత అదృష్టానికి నోచుకున్నాయి!.

అలా నడుస్తూ ముందకు వెళుతుండగా అక్కడ ఒక అంగడి కనబడింది. ఆ అంగడి మీద ఎన్నో అద్భుతమైన వేణువులు కనబడుతున్నాయి. ఆ వేణువులు చూడండి. ఎన్ని అద్భుతమైన రంగుల్లో ఉన్నాయో! కృష్ణయ్య అవి చూసి ఎంతో ముచ్చటపడి అక్కడే ఆగిపోయాడు.

కృష్ణయ్యను చూసిన అంగడి యజమాని బయటకు వచ్చి స్వామీ! యదునందనా! మీరాకతో మా అంగడి పావనం అయింది. నీకు ఇష్టమైన ఏదైనా ఒక మురళిని తీసుకొని మమ్మల్ని అనుగ్రహించు అని అన్నాడు. ఆ యజమాని ఇలా అంటుండగా అక్కడ అంగడిలో ఉన్న ఇద్దరు కుర్రవాళ్ళలో ఒక కుర్రవాడు అక్కడ ప్రక్కనే ఉన్న ఒక మురళిని తీసుకొని ఎంతో అద్భుతంగా గానం చేస్తున్నాడు.

శ్రీకృష్ణుడు ఆ అంగడి యజమానిని ఆ కుర్రవాడు ఎవరు అని అడిగాడు. దానికి యజమాని అతను తన కుమారుడే అని తనకు వ్యాపారంలో సహాయంగా ఉంటున్నాడని అన్నాడు. అంతే కాక మురళి ఎంతో చక్కగా వాయిస్తాడు అని చెప్పాడు. అప్పుడు కృష్ణుడు ఆ పిల్లవాడి వద్దకు వెళ్ళి అతని చేతిలోని మురళిని తీసుకొని నేను ఊదనా అని అన్నాడు. ఆ పిల్లవాడు చిరునవ్వు నవ్వుతూ ఆ మురళిని శ్రీకృష్ణుడికి ఎంతో సంతోషంగా ఇచ్చాడు.

అప్పుడు కృష్ణుడు ఆ మురళిని చేతిలోకి తీసుకొని అంతకుముందు ఎవరికీ తెలియని ఒకరాగం ఆలపించాడు. ఆ వేణువును ఆ పిల్లవాడికి తిరిగి ఇచ్చి ఏదీ నువ్వు ఈ రాగం ఆలపించు చూద్దాము అని అన్నాడు. అప్పుడు ఆ పిల్లవాడు ఒక్కక్షణం కన్నులు

మూసుకొని భగవంతుని ప్రార్థించి శ్రీకృష్ణులవారికి నమస్కరించి చిరునవ్వు నవ్వుతూ ఆ వేణువు ఊదసాగాడు. శ్రీకృష్ణులవారు ఇప్పుడే గానం చేసిన అదే రాగాన్ని ఎంతో శ్రావ్యంగా ఊదాడు. అది విన్న శ్రీకృష్ణుడు ఎంతో ముచ్చటపడి ఆ పిల్లవాడి తండ్రితో మీ పిల్లవాడు రాబోయే జన్మలో గొప్ప వేణు విద్వాంసుడు అవుతాడని ఆశీర్వదించాడు.

ఆ మాటలు విని ఆ అంగడి యజమాని శ్రీకృష్ణులవారికి సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆనాటి ఆ పిల్లవాడే కలియుగంలో తరువాతి జన్మలలో భారతదేశంలో గొప్ప పేరుగల వేణు విద్వాంసులలో ఒకరిగా జన్మించాడు. ప్రస్తుత జన్మలో కూడా అతడు భారతదేశంలోని గొప్ప వేణువు విద్వాంసుడుగా జన్మించాడు.

ఆ తరువాత శ్రీకృష్ణుడు ఆ అంగడిలో రెండు వేణువులు తీసుకొని యజమాని వద్దన్నా అతడికి తగిన పైకం ఇచ్చి ముందుకు సాగాడు. ఆ అంగడి యజమాని శ్రీకృష్ణులవారు తమ అంగడికి వచ్చినందుకు, రెండు వేణువులు తీసుకున్నందుకు, తమ కుమారుడిని ఆశీర్వదించినందుకు ఎంతో సంతోష పడ్డాడు.

ఆ యజమాని ఆరోజు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుల వారి అవతారం అయిన శ్రీకృష్ణుల వారికి రెండు వేణువులు ఇచ్చిన మహా పుణ్యఫలం చేత శ్రీకృష్ణుల వారి అపార అనుగ్రహానికి పాత్రుడు అయ్యి కలియుగంలో ఒక జన్మలో గొప్ప కృష్ణ భక్తునిగా జన్మించి ఒక గొప్ప శ్రీకృష్ణ ఆలయం నిర్మించాడు. ఆ ఆలయం కలియుగంలో నేటికి శ్రీకృష్ణుల వారి గొప్ప ఆలయంగా ప్రసిద్ధి పొందుతోంది.

శ్రీకృష్ణుడు అలా ముందుకు నడుస్తుండగా ఒక వ్యక్తి నడుస్తూ వచ్చాడు. అతడు శ్రీకృష్ణులవారికి నమస్కరించి తాను

ద్వారకలో ఉన్న శ్రీమన్నారాయణుల వారి ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్నానని చెప్పాడు. శ్రీకృష్ణుల వారు ఎంతో సంతోషించారు. అప్పుడు శ్రీకృష్ణుల వారికి అతని పూర్వజన్మ వృతాంతం అంతా తెలిసింది. ఈ వ్యక్తి త్రేతాయుగంలో తాను శ్రీరామచంద్రులుగా వెలసినప్పుడు ఇతడు ధర్మనిరతుడు అనే పేరుతో మహారాజ మందిరంలో చిన్న చిన్న పనులు చేస్తూ గడిపేవాడని గ్రహించాడు.

శ్రీరామచంద్రులవారు చిన్నతనంలో ఈ ధర్మనిరతుడితో ఆడుకునేవారు. వీరిద్దరి మధ్య ఎంతో స్నేహం కూడా కలిగింది. శ్రీరామచంద్రుడు రాజకుమారుడైన ధర్మనిరతుని ఎంతో ఆప్యాయంగా చూసేవాడు. అప్పుడు ఒకనాడు ధర్మనిరతుడు శ్రీరామచంద్రునితో మాట్లాడుతూ నీతో అనేక జన్మలలో ఈ సాన్నిహిత్యం ఇలాగే కొనసాగాలని తన కోరిక అని అన్నాడు. అందుకు శ్రీరామచంద్రుడు అతడితో ప్రియ మిత్రుడా! మనం తప్పకుండా మరోజన్మలో కలుస్తాం అంటాడు.

ధర్మనిరతుడికి శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణావతారం అని తెలియదు. అప్పుడు రాములవారి వయస్సు కేవలం పదకొండు సంవత్సరాలే. రాములవారు కూడా సామాన్య మానవుల లాగా అనేక జన్మలు తీసుకుంటారని అందులో తాము స్నేహితులుగా ఉండాలని కోరుకున్నాడు.

శ్రీరామచంద్రుడు ఆనాడు ధర్మనిరతునికి ఇచ్చిన మాట ప్రకారం ఈనాడు తిరిగి ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడిగా అవతరించిన తరువాత ఈరోజు అతడిని తిరిగి కలిసాడు. అతడి త్రేతాయుగపు ముచ్చట తీర్చడం కోసం శ్రీకృష్ణులవారు అప్పుడప్పుడు ద్వారకలోని శ్రీమన్నారాయణుల వారి ఆలయానికి వెళ్ళి ఇతడిని కలుస్తూ ఇతడిని ఎంతో సంతోష పెట్టేవారు. శ్రీకృష్ణులవారు ఆ ఆలయంలో ఉన్నంతసేపు ఆ అర్చకుడు ఎంతో సంతోషపడేవాడు.

ఆరోజు అలా శ్రీకృష్ణులవారు ఒక నాలుగు గంటలు అక్కడ ద్వారక పురవీధుల్లో గడిపి కొన్ని అంగడులకు వెళ్ళి, కొన్ని పూల దుకాణాల వద్ద ఆగి వారి వద్ద తనకు కావలసినవి తగిన పైకం ఇచ్చి తీసుకొని వారిని అనుగ్రహించారు. అలా శ్రీకృష్ణులవారు అంగడిలోకి రావడం చాలా అరుదుగా జరిగేది. ఆరోజు శ్రీకృష్ణులవారిని కలిసినవారు స్వామి అనుగ్రహంచేత తరువాత ఎన్నో ఉత్తమ జన్మలు పొంది ప్రస్తుత కలియుగంలో ఎన్నో గొప్ప కార్యాలు చేస్తున్నారు. అటువంటి వారిని నేనిప్పుడు అక్కడక్కడ చూస్తున్నాను.

ఇలా ద్వాపరయుగంలో శ్రీకృష్ణులవారితో సన్నిహితంగా గడిపిన అనేకమంది తరువాత ఎన్నో ఉత్తమ జన్మలు పొంది నేటికాలంలో కొందరు గొప్ప సంగీతకారులుగాను, గొప్ప సాహిత్యవేత్తలుగాను, కొందరు గొప్ప వేదపండితులుగాను, కొందరు గొప్ప ప్రవచనకారులుగాను, కొందరు ప్రముఖ ఆలయాలలో అర్చకులుగాను మరికొందరు ఎంతో గొప్ప ధర్మప్రచారం చేస్తున్న వారిగాను గ్రహించాను.

వీరందరూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణులతో ఎంతోకొంత బంధం ఉన్నవారే. సాక్షాత్తు శ్రీమన్నారాయణులవారి అవతారమైన శ్రీకృష్ణులవారితో బంధం ఉండడంతో వారికి తరువాత అనేక ఉత్తమ జన్మలు లభించి నేడు కలియుగంలో గొప్ప వ్యక్తులయ్యారు. వారు ధర్మపరమైన జీవితం గడుపుతూ ఎంతో ఉన్నత మార్గంలో పయనిస్తున్నారు. ఎంతో మందికి మార్గదర్శకులు అవుతున్నారు. వారి వలన ఎందరో సామాన్య మానవులు ధర్మపథంవైపు నడుస్తున్నారు.

20

అది 12వ మహాయుగంలోని కలియుగంలో 2,500 వ సంవత్సరం అప్పటికి మానవులలో ధర్మం పూర్తిగా నశించింది. మానవులలో హింసాప్రవృత్తి పెరిగింది. ప్రజలందరూ ఎన్నో అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఇలా ఒక 500 ల సంవత్సరాలు గడిచి 3000 సంవత్సరానికి వచ్చారు. అప్పటి పరిస్థితి నోటితో చెప్పనలవి కానిది. చేతితో రాయనలవి కానిది. ప్రపంచం అంతా అటువంటి ఘోర పరిస్థితులు పూర్తిగా వ్యాపించాయి. అదిగో చూడండి ఎక్కడ పడితే అక్కడ ప్రజలు విపరీతంగా మద్యం సేవించి నేలపై పడి ఉన్నారు చూడండి. వాహనాల్లో తిరుగుతున్నవారు వాహనం ఆపి క్రిందకి దిగి వీరిని పక్కకి లాగి తిరిగి వాహనం నడుపుకుంటూ వెళ్తున్నారు.

ఆశ్చర్యం ఏమిటంటే ఇలా విపరీతంగా మద్యం సేవించి నేలమీదపడి ఉన్నవారిలో స్త్రీలు కూడా విపరీతంగా ఉన్నారు. పాలకులు కూడా అత్యంత దుర్మార్గంగా తయారయ్యారు. ఒక దేశపు పాలకుడు 5000 వేల మందిని స్త్రీలను తన భవంతిలో ఉంచుకున్నాడు. వారందరూ కూడా పగలు రాత్రి తేడా లేకుండా

మద్యం సేవిస్తున్నారు చూడండి. అదిగో ఆ పాలకుడిని చూడండి అతను ప్రతీరోజు బయటకు వచ్చేటప్పుడు తన చుట్టూ 20 మంది యువతులను ఉంచుకునేవాడు. ప్రజలను ఉద్దేశించి ఏదైనా బహిరంగ సభలో మాట్లాడడానికి వచ్చేటప్పుడు ఇలాగే 20 మంది యువతులతో వచ్చేవాడు.

అతడే కాదు అతడితో పాటు ఉన్న మంత్రులు కూడా తమతో నలుగురైదుగురు యువతులను వెంటపెట్టుకుని వచ్చేవారు. అదిగో చూడండి. ఒకచోట ఒక గ్రామంలో ఒక పెద్ద బహిరంగ సభ జరగబోతోంది. దానికి వస్తున్న వారి పాలకుడు తనతో ఒక 40 మంది యువతులను వెంట తీసుకొని వస్తున్నాడు. ఇలా వేదిక వద్దకు వస్తూ వారితో సరస సల్లాపాలు ఆడుతున్నాడు. అయితే ఆశ్చర్యంగా ఇదంతా చూస్తున్న ప్రజలు ఏమీ మాట్లాడడం లేదు. ఇదేదో పెద్ద వింతలా చూడడం లేదు. ఆనాటి పరిస్థితి వారందరికి అలవాటే అతనితోపాటు వచ్చిన అనుచరులు కూడా అలాగే ఉన్నారు.

దేశంలో ధర్మం పూర్తిగా నాశనం అయింది. పూర్తిగా అరాచకం పెరుగుపోతోంది. ఎక్కడ చూసినా మానభంగాలు, దోపిడీలు ఎటువంటి దుర్మార్గం చూసినా ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. ఆలయ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టింది. అనేక వేల ఆలయాలు ఏమాత్రం పోషణ లేక మూతబడ్డాయి. ఆలయ అదికారులు విపరీత వ్యసనాలకు లోనయ్యారు. ఆలయాలకు భక్తులు ఎప్పుడో నెలకు ఒకరోజు వచ్చేవారు. ప్రజలలో భక్తి పూర్తిగా సన్నగిల్లింది.

ఇదంతా 12వ మహాయుగంలోని కలియుగంలో 2,500 లోని నాటి పరిస్థితి. ఆ సంవత్సరం ఒకనాడు ప్రపంచం మొత్తానికి ఒక వింత వ్యాధి పట్టుకుంది. అదేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. అప్పటికే ప్రజలలో 90 శాతం మంది మద్యపానానికి అలవాటు

పడినవారు అవ్వడం చేత ఆ వ్యాధి ప్రతీ ఒక్కరికీ తీవ్రంగా దెబ్బతీయసాగింది. కేవలం 10 రోజులలోనే ప్రపంచంలోని సగం జనాభా మరణించారు. ఎక్కడ చూసిన శవాల కుప్పలే. నాయకులు అత్యంత దుర్మార్గులు కావడం చేత వారికి ఏమీ పట్టడం లేదు. నాయకులలో కూడా చాలామంది ఈ వింత వ్యాధితో మరణించారు. విచిత్రం ఏమిటంటే ఈ వ్యాధి ఎలా వచ్చిందో అలానే మాయమయ్యింది. అయితే ఈ వ్యాధి ప్రవాహం చేత ప్రపంచంలోని సగం జనాభా మరణించింది. కొంతకాలానికి ప్రజలు మళ్ళీ కాస్త నిలదొక్కుకొని మెల్లగా సామాన్య జీవితంలో పడ్డారు.

అయితే ప్రజలలో అధర్మం మాత్రం రోజురోజుకి పెరగసాగింది. 3,200 వ సంవత్సరంలో ఒక పెద్ద భూకంపం వచ్చి నాలుగు దేశాలలోని ప్రజలు మరణించారు. అటు తరువాత వాతావరణంలో విపరీతంగా వేడి ఎక్కువై ఉష్ణోగ్రతలు చాలా అధికమై ప్రజలు ఒక నెలరోజులపాటు ఇళ్ళల్లోనుంచి బయటకి రాలేకపోయారు.

ఇటువంటి పరిస్థితుల్లో ఒక మహాసముద్రంలో ఒక పెద్ద భూకంపం వచ్చి కొన్ని లక్షల మంది మరణించారు. ఇన్ని వినాశాలు జరుగుతున్న అటు పాలకులలోగాని, ఇటు ప్రజలలోగాని ఏమాత్రం మార్పురాలేదు. ఇలా సాగుతూ ఉండగా 4,500 వ సంవత్సరం వచ్చింది. అటుతరువాత 4,555 వ సంవత్సరంలో ఒకనాడు ఒక్కసారిగా ప్రపంచంలోని సముద్రాలన్నిటి నీటిమట్టం విపరీతంగా పెరిగింది. అలలు ఎంతో ఎత్తుకు ఎగసి భూభాగం మీదకు రాసాగాయి.

ప్రకృతిలో అనేక మార్పులు రావడంతో ఆనాడు పెద్ద మంచుకొండలు విరిగి సముద్రాలలో పడ్డాయి. అలా పడిన కొండల

భాగాలు కొన్ని వేల కిలో మీటర్ల వెడల్పు ఉన్నాయి. అలా అవి సముద్రంలో పడగానే ఒక్కసారిగా సముద్ర మట్టాలు పెరిగి ఈ ప్రపంచం మొత్తాన్ని ముంచెత్తివేసాయి. అదికూడా నీరు ఎంత ఎత్తుకు వచ్చిందంటే ఈ భూమిపై ఉన్న ఎన్నో కొండలు సైతం నీటిలో మునిగిపోయాయి. ఆనాడు వచ్చిన సముద్రపు నీరు నేడు తిరుమల కొండల్ని తాకి పూర్తి పైదాకా వచ్చి శ్రీనివాసుని పాదాలదాకా వచ్చింది. తిరుమలపై శ్రీవేంకటేశ్వర స్వామివారు ఆ మహాయుగం నాటికే ఉన్నారు. కానీ ఆ మహాయుగంలో స్వామివారు అక్కడ ఉన్న సంగతి సామాన్య ప్రజలకు తెలియదు. అక్కడ కొండల్లో ఉండే కొందరు ఆటవిక జాతుల ప్రజలు మాత్రం స్వామిని తమలో ఒకడిగా భావించి కొలుస్తూ ఉండేవారు.

సముద్రపు అలలు తిరుమల కొండల్ని కూడా పూర్తిగా ముంచి వేయడంతో ఆ ఆటవికులు కూడా మరణించారు. భూమిపై ఉన్న సామాన్య ప్రజలు అందరూ మరణించారు. ఎంతో జీవకోటి సర్వనాశనం అయింది. ఆ నీరు అంతా తగ్గడానికి నెలరోజులు పట్టింది. ఇదంతా అధర్మం విపరీతంగా పెరిగిపోవడం వలన జరిగిన ప్రకృతి వైపరిత్యం. అక్కడితో ఒక నాగరికత పూర్తిగా నాశనం అయింది. ఆనాటి ఆ నాగరికత పూర్తిగా కాలగర్భంలో కలిసిపోయింది. ఇది జరిగిన 2000 ల సంవత్సరాల వరకు తిరిగి నాగరికత అభివృద్ధి చెందలేదు. ఇలా ఇన్నికోట్ల సంవత్సరాలుగా ఎన్నోసార్లు జరిగింది. మనం ఈరోజు చూస్తున్న అనేక పర్వతాలు ఆనాడు ఆ సముద్రనీటిలో మునిగిపోయినవే. ఇది తలచుకుంటేనే ఎంతో బాధాకరంగా ఉంటుంది. కానీ ఇది ఇంతకుముందు మహాయుగాలలో జరిగిన సత్యం. నా దృష్టికి స్పష్టంగా కనబడిన ఒక అత్యంత భయానక దృశ్యం.

21

అది త్రేతాయుగంలోని ఒక రోజు. అప్పుడు శ్రీరామచంద్రులవారు సుమారు 6 సంవత్సరాల వయస్సు. ఆ చిన్ని రాముడు ఎంత ముచ్చటగా ఉన్నాడో చూడండి. ఆ చిరునవ్వుతో మన బాధలన్నీ మర్చిపోతాం. ఆ బాల రాముడు ఎంత ముద్దుగా ఉన్నాడో చూడండి. అంత చిన్న వయస్సులోనే మన బాలరాముడు చూపులలో ఎంతో కరుణరసం వెల్లివిరుస్తూ ఉండేది.

శ్రీరామచంద్రులవారు చిన్నప్పటినుంచే ఎంతో ముద్దుగా ఉండేవారు. అదిగో రాజప్రాసాదంలో ఆడుకుంటున్న ఆ బాలరాముని చూడండి. ఇటు అటు పరుగెడుతూ ఎంత ముద్దుగా ఆడుకుంటున్నాడో! ఇలా ఆడుకుంటూ రాముడు వెనుక వైపున ఉన్న పెద్ద ద్వారం ద్వారా బయటకు వచ్చాడు. ఆ భవనం వెనక వైపు చిన్న ఉద్యానవనం ఉంది. ఎన్నో పూలమొక్కలతో ఆ ఉద్యానవనం ఎంతోఅద్భుతంగా ఉంది.

రామయ్య ఆ ద్వారం గుండా మెట్లు దిగి బయటకు వచ్చి ఆ చిన్న కోటలోకి వచ్చాడు. రాజప్రాసాదంలో పనిచేసే వ్యక్తులు అటూ

ఇటూ తిరుగుతున్నారు. మహారాణి వారి చెలికత్తెలు కూడా ఆ కోటలోకి వచ్చి అక్కడున్న పూలమొక్కల నుంచి పువ్వులు కోసుకుంటున్నారు.

బాలరాముడు ఈ తోటలోకి రోజూ ఉదయాన్నే రావడం వీరందరికీ అలవాటే. అప్పుడు సమయం ఎనిమిది గంటలు కావస్తుంది. చిన్ని రాముడు అక్కడి గడ్డిపై అటూ ఇటూ పరుగెడుతూ మొక్కలపై వాలుతున్న పక్షులను చూస్తున్నాడు. వాటిని చూసి ఎంతో ముచ్చటపడుతున్నాడు.

అలా అటూ ఇటూ పరుగెడుతుండగా అక్కడ పక్కనే ఉన్న ఒక పూలమొక్కపై ఒక చిన్న పిట్ట వచ్చి వాలింది. ఆ పిట్ట ఎంత ముచ్చటగా ఉందో చూడండి. రామయ్య దాన్ని చూసి ఎంతో ముచ్చటపడి అటుగా వెళ్ళాడు. ఆ పిట్ట ఏమాత్రం తొణకక తల అటూ ఇటూ ఆడిస్తూ ఎగురుతూ వచ్చి మన చిన్ని రాముని భుజంపై వాలింది.

రామయ్యకు ఎంతో సంతోషం కలిగింది. అది అలా ఉండి తిరిగి ఎగిరి మరో భుజం మీద వాలింది. చిన్ని రాముడు ముఖంలో ఆనందం చూడండి. ఆ చిన్న పిట్టను చూసి ఎంత ముచ్చట పడుతున్నాడో! ఎంతో ఆనందపడుతున్న రాముడు ఇంకా మనోహరంగా కనిపిస్తున్నాడు.

ఆ పక్షి మళ్ళీ ఎగిరి ఆ పూలచెట్టుపై వాలింది. ఆ చిన్న పక్షి ఎంతో ముచ్చటగా ఉంది. దాని మెడ నీలి రంగులో ఉంది. రామయ్య ఆ పక్షివైపే చూస్తున్నాడు. అది రెండు మూడు సార్లు కూసి ఎగిరి వెళ్ళిపోయింది. అటు తరువాత రామయ్య తిరిగి రాజప్రాసాదంలోకి వచ్చాడు. ఆ చిన్న పిట్ట తన భుజంపై వాలిన సంఘటనను గుర్తు తెచ్చుకుంటూ లోపలికి వచ్చాడు.

మన చిన్ని రాముడు మరునాడు ఉదయం మళ్ళీ తిరిగి తోటలోకి వచ్చాడు. అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటున్నాడు. ప్రక్కన ఉన్న పూలమొక్కలపై ఎన్నో పక్షులు కూతలు పెడుతూ ఎగురుతున్నాయి. అంతఃపుర స్త్రీలు పూల మొక్కల నుంచి పువ్వులు కోసుకుంటున్నారు. ఇంతలో నిన్నటి చిన్న పక్షి మళ్ళీ వచ్చింది.

దానిని దూరం నుంచి చూసిన మన చిన్ని రాముడు ఎంతో సంతోషపడ్డాడు. అటూ ఇటూ దూకుతూ ఆ పక్షి దగ్గరకి వెళ్ళాడు. ఆ పక్షి తల అటూ ఇటూ ఆడిస్తూ చిన్న చిన్నగా కూతలు కూస్తోంది చూడండి ఇంతలో ఒక్కసారిగా వచ్చి రామయ్య భుజంపై వాలింది. ఎంత ముచ్చటగా ఉంది ఆ దృశ్యం!

కాసేపు కూతలు కూసి రామయ్య మరో భుజంమీద వాలింది. రామయ్య ఎంతో ముచ్చటపడ్డాడు. అది కాసేపు అలా అటూ ఎగిరి రెండు భుజాలమీద కూర్చొంటూ తిరిగి ఎగిరి వెళ్ళిపోయింది. మన రామయ్య దాని వంకే చూస్తూ ఎంతో ముచ్చట పడ్డాడు. ఇలా రోజు రామయ్య తోటకు రావడం ఆ చిన్న పక్షితో ఆడుకోవడం ఎంతో అలవాటయ్యింది.

ఒక నాడు ఆ పక్షి వచ్చి భుజం మీద వాలినప్పుడు చిన్న చిన్న తుంపర్లు పడసాగాయి. వెనుక ఆకాశంలో చూడండి. ఎంత అద్భుతంగా హరివిల్లు రూపుదిద్దుకుందో. అత్యంత మనోహరుడైన మన చిన్ని రాముడు, రామయ్య భుజాలపై అటూ ఇటూ దూకుతున్న ఆ చిన్న పక్షి, వెనక ఆ హరివిల్లు ఆహా ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం! ఇలా కాసేపు ఆ పక్షితో ఆడుకుని రామయ్య రాజప్రాసాదంలోనికి వెళ్ళాడు.

ఒక నాడు ఉదయం చాలా పెద్ద వర్షం పడింది. రాజప్రాసాదంలోని వారు రామయ్యను వర్షంలో బయటకు వెళ్ళొద్దు అన్నారు. కానీ మన రామయ్యకు ఆ పక్షి మీదే దృష్టి. ఎవరు చెప్పినా వినకుండా చిన్ని రాముడు వడివడిగా పరుగెడుతూ అంత వర్షంలోను తోటలోకి వెళ్ళాడు. అంత వర్షంలోను ఆ చిన్న పిట్ట ఎక్కడినుంచో ఎగురుతూ వచ్చి రామయ్య భుజంపై వాలింది. ఆ వర్షంలో చిన్ని రాముడి భుజాలపై అటూ ఇటూ ఎగురుతోంది. ఆ దృశ్యం ఎంత ముచ్చటగా ఉందో చూడండి.

ఇంతలో వర్షం ఆగిపోయింది. అప్పుడు రామయ్య ఆ పక్షితో ఇలా అన్నాడు. ఓ ముద్దులు మూటకడుతున్న చిన్న పక్షి నువ్వంటే నాకెంతో ఇష్టం నేను నీకు ఒక వరం ఇస్తున్నాను. మనిద్దరం ఒకరినొకరు విడిచి ఉండలేకపోతున్నాం. కానీ నా అవతార సమాప్తి తరువాత నేను ఇంక నీకు కనబడను. ఇది మనిద్దరికీ బాధే కదా!

అందుకు ఈ జాతి పక్షులకు నేనొక వరం ఇస్తున్నాను. దేనికంటే నా రామావతారం ముగిసిన తరువాత మీ జాతి పక్షులు ద్వాపరయుగంలోను, కలియుగంలోను నా ఆలయాల వద్ద ఎగురుతూ ఉంటాయి. నా ఆలయాలు ఎక్కడ నిర్మింపబడుతున్నాయో మీ జాతి పక్షులకు ముందే తెలుస్తుంది. మీకు 'రామమనోహరి' అనే పేరు పెడుతున్నాను. రామమనోహరి అనే పేరుతో ఎంతో ప్రసిద్ధమయ్యే మీ జాతి పక్షులు ఎంతో శ్రావ్యంగా కూస్తాయి అని అన్నాడు.

మన చిన్ని రాముడు ఆ పక్షితో ఇంకా ఇలా అన్నాడు. ద్వాపరయుగంలో మిమ్మల్ని ఏ విలుకాడు బాధించడు. కానీ కలియుగంలో ధర్మం పూర్తిగా సన్నగిల్లడంతో పక్షులను వేటగాళ్ళు, సామాన్య మానవులు విపరీతంగా చంపుతారు. అందుకని మీకు ఒక వరం ఇస్తున్నాను. మీరు కలియుగంలో సామాన్య మానవులకు

కనిపించరు. కేవలం మీ పక్షిజాతికి మాత్రమే కనిపిస్తారు. సామాన్య మానవులకు, ఇక ఏ జంతువులకు మీరు కనపడరు. అయితే ఎంతో గొప్ప రామభక్తులకు, యోగులకు మీరు అప్పుడప్పుడు శ్రీరామాలయాల వద్ద కనిపిస్తారు. మీరు కలియుగంలో రామాలయాల వద్ద ఉన్న చెట్లపై విహరిస్తూ ఆ ఆలయం ఉత్సవాలు జరుగుతున్నప్పుడు నా ఉత్సవమూర్తిని దర్శిస్తూ ఎంతో ఆనంద పడతారు. తిరిగి కృతయుగం వచ్చినప్పుడు మీరు అందరికీ కనిపిస్తారు.

కృత, త్రేతా, ద్వాపరయుగాలలో మిమిల్ని ఏ విలుకాడు వేట ఆడరు. మిమ్మల్ని రామమనోహరిగా గుర్తించి అందరూ మిమ్మల్ని చూసి ఎంతో ఆనందపడతారు అని ఆ పక్షితో అన్నాడు. ఆ పక్షి ఎంతో సంతోషపడింది. ఆ పక్షితో రామయ్య అలా ఎన్నో సంవత్సరాలు ఆడుకున్నాడు. రామావతారం ఉన్నంత కాలం ఆ రామమనోహరి శ్రీరామచంద్రుని దర్శిస్తూనే ఉన్నది.

ఈ పక్షి విశేషమంతా రామయ్య లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు, వివాహం అయిన తరువాత సీతాదేవికి వివరంగా చెప్పాడు. వారంతా ఈ రామమనోహరి గురించి తెలుసుకొని ఎంతో సంతోషించారు. సీతారాములు వనవాసంలో ఉన్నప్పుడు ఈ రామమనోహరి పక్షులు వారి ఆశ్రమం దగ్గరలో చెట్లపై ఉండి రోజూ ఎంతో చక్కగా కూస్తూ శ్రీసీతారాములకు ఎంతో ఆనందం కలిగించేవి.

ఈ రామమనోహరి పక్షులు నేటికి శ్రీరామచంద్రుల వారి ఆలయాలు ఉన్నచోట చెట్లపై ఉంటాయి. కానీ శ్రీరామచంద్రుడు ఇచ్చిన వరంచేత అవి మనకి కనపడవు. గొప్ప రామభక్తులకు అవి కనిపిస్తాయి. తులసీదాసు, రామదాసు, త్యాగరాజు వంటి రామభక్తులకు ఈ రామమనోహరి పక్షులు కలియుగంలో ఎన్నోసార్లు దర్శనమిచ్చాయి. వారు ఈ పక్షులను చూసి ఎంతో ఆనందపడ్డారు.

22

అది కృతయుగం. శ్రీరామచంద్రులవారు వానరసేనతో కలిసి లంకపై యుద్ధం చేయడానికి గ్రామాలు, అడవులు దాటుతూ వెళుతున్నారు. కొన్ని లక్షలమంది వానరులు అటూ ఇటూ దూకుతూ వెళుతూ ఉన్న ఆ అద్భుత దృశ్యం చూడండి! ముందు శ్రీరామచంద్రులవారు శ్రీలక్ష్మణ సమేతుడై కొందరు ముఖ్య వానర వీరులతో కలిసి నడుస్తుంటే వెనుక ఈ లక్షలాది మంది వానరులు వారిని అనుసరిస్తున్నారు. వీరందరూ పగలంతా నడిచి రాత్రి వేళ అనువైన చోట్ల విశ్రమించేవారు. వానరులందరూ దారి పొడవునా ఉన్న పళ్ళ చెట్లనుంచి ఫలాలను తిని ఆకలి తీర్చుకొనేవారు. అడవిలో ఉండే సెలయేళ్ళలో ఉండే మంచినీరు తాగి తమ దాహం తీర్చుకునేవారు.

రాత్రి చెట్ల క్రిందనే విశ్రమించేవారు. శ్రీరామచంద్రుల వారు రావణుడిని సంహరించి సీతాదేవిని ఎప్పుడెప్పుడు రక్షించాలా అని ఆలోచిస్తూ ఉండేవారు. వీరందరూ అలా నడుస్తూ కొన్ని రోజులకు ఒక పెద్ద అడవిలోనికి ప్రవేశించారు. వీరందరిని ఉత్సాహపరచడానికి

వృద్ధ వానర వీరులు వీరికి అనేక భాగవత కథలు చెప్పేవారు. ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకొని నడక మొదలుపెట్టేవారు. అటూ ఇటూ దూకుతూ మధ్యాహ్నం అయ్యేటప్పటికి అక్కడ ఉన్న అనేక ఫలాలను తినేవారు.

అదిగో ఆ పెద్ద అరటితోటలను చూడండి. వానరులందరూ అరటిపళ్ళను తీసుకొని ఎలా భుజిస్తున్నారో! వారిలో కొందరు 20 పళ్ళు తింటుంటే మరికొందరు యువ వానరులు 40 పళ్ళదాకా తింటున్నారు. తిని ఒక అరగంట అక్కడే ఆగారు. శ్రీరామచంద్రులవారు అక్కడ దగ్గరే ఉన్న ఒక చెట్టు క్రింద ఒక రాతిబండపై కూర్చున్నారు. శ్రీలక్ష్మణ స్వామి శ్రీరామచంద్రులవారితో ఏదో మాట్లాడుతున్నారు. లక్ష్మణుడు అన్నగారికి మనస్సుకు ఆహ్లాదం కలిగించే మంచి మాటలు చెప్తున్నాడు.

ఇంతలో ఒక పెద్ద సర్పం అటు పక్కగా వెళ్ళింది. ఆ సర్పాన్ని చూసి శ్రీరామచంద్రుడు చిరునవ్వు నవ్వాడు. ఆ సర్పం మరెవరో కాదు! వైకుంఠంలోని ఆదిశేషుడే! శ్రీరామచంద్రులవారు వనవాసంలో ఉన్నప్పుడు ఆదిశేషుడు అప్పుడప్పుడు వచ్చి శ్రీస్వామివారు ఉన్న పరిసర ప్రాంతాలలోనే ఉండేవారు. శ్రీలక్ష్మణ స్వామివారు ఆదిశేషుని అంశతో జన్మించిన విషయం మనందరికి తెలిసిందే కదా! కాని వైకుంఠంలోని ఆదిశేషుడు తానే స్వయంగా వైకుంఠంలోని శ్రీమన్నారాయణులవారిని విడిచి ఉండలేక ఇలా అప్పుడప్పుడు స్వామి ఉన్న పరిసర ప్రాంతాలలోనే ఉండేవారు. అలాగే ఇంద్రాది దేవతలు అందరూ కూడా పక్షుల రూపాలలో జన్మించి అక్కడ ఉన్న చెట్లపై ఎగురుతూ ఉండేవారు. శ్రీరామచంద్రులవారికి ఇవన్నీ తెలిసినప్పటికి ఎవరికి చెప్పేవారు కాదు.

ఇందాక చెప్పినట్లు కొందరు వృద్ధ వానరులు మధ్యాహ్నం భోజనం తరువాత, రాత్రి పడుకునేముందు వానరులందరికి శ్రీమన్నారాయణులవారి లీలలను, నృసింహ అవతార విశేషాలను, ఇంకా అనేక దేవతలకు సంబంధించిన కథలు, మహాభక్తుల కథలు చెప్పేవారు. ఇవన్నీ విన్న వానరులందరూ ఎంతో ఉత్తేజం పొందేవారు. మరింత ఉత్సాహంతో ముందుకు కదిలేవారు. శ్రీరామచంద్రులవారి అనుగ్రహం వలన ఈ వానరులను ఏ క్రూరమృగాలు ఏమీ చేసేవి కావు.

ఎంతో దట్టమైన అడవులు కూడా శ్రీరాముడు ఇలా వానరవీరులతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు వారికి ఎన్నో పులులు, సింహాలు, ఏనుగులు, చిరుతపులులు వంటి ఎన్నో మృగాలు ఎదురువచ్చేవి. కాని భగవదాజ్ఞవలన ఇవి ఎవరికి హానిచేసేవి కావు. అడవులోనించి ప్రక్కకి తప్పుకొని వెళ్ళిపోయేవి. ఈ వానరులందరూ ఇలా లక్షల సంఖ్యలో వెళ్తుంటే వాటికి కూడా ఎంతో ఆశ్చర్యం కలిగింది. అదిగో ఆ ప్రక్కన ఉన్న లేడిపిల్లల్ని చూడండి. ఈ వానర సమూహం వంక ఎంత ఆశ్చర్యంగా చూస్తున్నాయో! అలాగే ఆ ప్రక్కనే పొదలో ఉన్న ఆ కుందేళ్ళ జంటలు చూడండి! ఎగురుతూ గెంతుతూ వెళుతున్న ఈ వానర సైన్యాన్ని కళ్ళు పెద్దవి చేసుకొని ఎలాచూస్తున్నాయో! ఈ వానరులందరూ కూడా వీటన్నింటిని చూసి ఎంత ముచ్చటపడుతున్నారో!.

ఇలా వీరందరూ ముందుకు సాగుతూ ఒక అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. వారికి రెండు రోజులనుండి ఆహారం సరిగ్గా దొరకడంలేదు. మంచి మంచి ఫల వృక్షాలు అంతగా కనబడుటలేదు వానరులందరూ కొంచెం నిరుత్సాహపడ్డారు. వీరిలో కొందరు నీరసపడ్డారు కూడా. శ్రీరామచంద్రులవారు ఈ విషయం

గమనించారు. శ్రీరామచంద్రులవారు వానర వీరుని ఒకరిని పిలిచి ఇలా అన్నారు. నాయనలారా! మీకు సరిపడా ఆహారం దొరకడం లేదని బాధపడవద్దు. మనం రేపు శేషాచల పర్వతశ్రేణిని చేరుకుంటాము. ఆ పర్వతాలలో అనేక అడవులు ఉన్నాయి. వాటిలో అనేకరకాలైన ఫలవృక్షాలు, సెలయేళ్ళు ఉన్నాయి. వీరందరూ ఎన్నోరకాల ఫలాలను ఎంతో ఆనందంగా తినవచ్చు. చక్కటి సెలయేళ్ళలో నీరు త్రాగవచ్చు. అని అన్నారు అది విన్న వానర వీరుడు ఎంతో సంతోషపడి మిగిలిన వానరులందరికి ఈ విషయం చెప్పాడు. వారు ఒకరిద్వారా మరొకరు ఈ విషయం చెప్పుకున్నారు. వారికి ఎంతో ఉత్సాహం కలిగింది. ఆ రాత్రి అక్కడే అడవిలో నిద్రపోయి ఉదయాన్నే లేచి తిరిగి నడక ప్రారంభించారు.

ఇంతలో శ్రీరామచంద్రులవారు ఒకసారి ఆగారు. అక్కడితో లక్ష్మణ స్వామివారు, మిగిలిన వానరులందరూ కూడా ఆగారు. అప్పుడు రామచంద్రుడు వారితో ఇలా అన్నాడు. నాయనలారా! ఇప్పుడు మనం ఎక్కబోయే ఈ పర్వతశ్రేణి శేషాచలం, వేంకటాచలం, వేంకటాద్రి, కనకాద్రి ఇలా ఎన్నో పేర్లతో పిలవబడుతున్న అతి పవిత్ర పర్వతశ్రేణి. ఇది ఎక్కేముందు మనమందరం ఒక్కసారి ఈ పర్వతానికి నమస్కరించుదాము. ఈ కొండను మనందరం ఎక్కి ఒక రెండు రోజులు ఈ కొండపై గడిపి ముందుకు సాగుదాము. ఈ కొండపై ఎన్నో అద్భుతమైన ఫల వృక్షాలు ఉన్నాయి. చక్కగా ఈ ఫలాలన్నింటిని ఆరగించండి. మీకు ఎంతో ఉత్తేజం, శక్తి వస్తుంది. అంతేకాదు ఇక్కడ ఎన్నో దేవలోకపు వృక్షాలు ఉన్నాయి. వీటినుంచి వచ్చే గాలివలన మీకు ఎంతో గొప్ప శక్తి కలుగుతుంది. మనముందున్న గొప్పకార్యం ఎంతో విజయవంతంగా చేయగలుగుతాం. అని రామచంద్రుడు వారందరికీ చెప్పాడు. అందరూ ఆ కొండకి నమస్కరించి ముందుకు సాగుతూ కొండను ఎక్కడం ప్రారంభించారు.

అలా వానర వీరులందరూ తిరుమల కొండ ఎక్కి ఆ కొండపైగల ప్రకృతి సౌందర్యానికి ఎంతో ఆశ్చర్యపోయారు. ఆ పర్వతశ్రేణి ఎంత అద్భుతంగా ఉందో చూడండి. ఎన్నో ఫలవృక్షాలు, చక్కటి సెలయేళ్ళు, ఎన్నో పుణ్యతీర్థాలు, ఎన్నో పూలమొక్కలు...ఒకటా రెండా మనం వర్ణించలేనంత అందంగా ఉంది ఇక్కడ ప్రకృతి. అది చూసి వానరులందరూ ఎంతో సంతోషపడ్డారు. ఎన్నో రకాల ఫలాలు తిన్నారు. అటూ ఇటూ ఎగురుతూ తిరిగారు. ఇంకా వారిలో కొందరు ఇంకా ఇంకా కొత్తరకాల పళ్ళు కనబడతాయేమోనని అడవిలోనికి చాలా దూరం వెళ్ళారు. వీరు అలా వెళుతూ మిగిలిన సమూహంనుంచి విడిపోయారు. అలా కొంతదూరం వెళ్ళేటప్పటికి వారికి దారి తప్పినట్టు అర్థమయ్యింది. మిగిలినవారిని ఎలా కలుస్తామో అని గుబులు పట్టుకుంది.

ఇంతలో వారికి ఎదురుగా ఒక గుహ కనబడింది. వీరందరూ ఆ గుహలో ఏముందో చూద్దాం అని ఎంతో ఆత్రంగా లోపలికి వెళ్ళారు. లోపల వారికి ఎంతో దివ్యమైన కాంతి కనబడింది. లోపల ఎందరో వ్యక్తులు ఎన్నో గొప్ప ఆభరణాలు ధరించి దివ్య వస్త్రాలతో ఎంతో తేజస్సుతో మెరిసిపోతు వీరికి కనబడ్డారు. వారు ఈ వానరుల రాకను గమనించలేదు. వారందరూ ఎన్నో దివ్యమైన ఆయుధాలను కూడా ధరించి ఉన్నారు. వారందరూ శంఖచక్రధారులై ఉన్నారు. వానరులకు ఇవేమి అర్థం కాలేదు. వారి తేజస్సును భరించడం వీరికి చాలా కష్టం అనిపించింది. అంతేకాదు ఇక ముందుకు వెళ్ళలేకపోయారు. చాలా భయం కూడా వేసింది.

వానరులందరూ ఎంతో భయపడుతూ ఒక్కసారిగా వెనక్కి పరుగెత్తారు అలా పరుగెత్తి పరుగెత్తి ఆ గుహ బయటకు వచ్చారు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొని మళ్ళీ దారి వెతకడం

మొదలు పెట్టారు. వారికి చాలా నీరసం వచ్చేసింది. అప్పుడు వారికి ఎదురుగా వస్తున్న వానరగుంపు కనిపించింది. వారిని చూసి వీరి ప్రాణం కాస్త కుదుటపడింది. వీరిని వెతుక్కుంటూ వస్తున్న వారు తమ సమూహంలోనివారే అని తెలిసింది. వారిని కలవగానే వీరు వారితో తాము ఇంతకుముందు చూసిన గుహ గురించి, అందులో కనబడిన దివ్య పురుషుల గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పారు.

ఇదంతా విన్న వారికి తాముకూడా ఆ గుహలోకి వెళ్ళాలని ఎంతో ఉత్సాహం కలిగింది. అప్పుడు అందరూ కలిసి ఆ గుహ వెతుక్కుంటూ బయలుదేరారు. అయితే ఆశ్చర్యంగా ఎంత వెతికిన వారికి ఆ గుహ కనబడలేదు. వారు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఎంతో లోపలికి వెళ్ళి వెతికినా ఆ గుహ కనబడలేదు. అక్కడితో వారందరికి ఎంతో నిరుత్సాహం కలిగింది. ఇంక ఏమీ చేసేదిలేక ఎంతో నిరుత్సాహపడుతూ వారందరూ వెనక్కి తిరిగి మిగిలిన వానర సమూహం ఉన్న ప్రాంతానికి వచ్చారు.

అయితే ఆ గుహ చూసిన వారికి ఆ గుహ గురించి కుతూహలం తగ్గలేదు. అప్పుడు వారు శ్రీరామచంద్రులవారి వద్దకు వచ్చి తాము చూసిన గుహ గురించి, అక్కడ లోపల చూసిన దివ్య పురుషుల గురించి చెప్పారు. అప్పుడు శ్రీరామచంద్రుల వారు వారితో ఇలా అన్నారు. నాయనలారా! మీరు చూసింది వైకుంఠ గుహ. అక్కడనుంచి ముందుకు వెళితే వైకుంఠానికి దారి వస్తుంది. సామాన్యులకు ఇది సాధ్యం కాదు.

ఈ పవిత్ర తిరుమల కొండపై వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడు శ్రీవేంకటేశ్వరునిగా కొలువై ఉన్నాడు. అయితే ఆ స్వామి శిలారూపంలో ఉండి కేవలం కలియుగంలోనే సామాన్యులందరికి దర్శనమిస్తాడు. ఈ కొండ సాక్షాత్తు వైకుంఠమే!

శ్రీమన్నారాయణులవారి క్రీడాప్రదేశమే ఈ పవిత్ర తిరుమల కొండ మీరు ఆ గుహలోనికి ఆ మాత్రం వెళ్ళారంటే మీరు ఎన్నో జన్మలలో చేసుకున్న పుణ్యఫలం తప్ప మరొకటి కాదు. మనం వెళ్ళబోయే కార్యక్రమం విజయవంతం అవుతుందనడానికి ఇది ఒక శుభ సూచన అని శ్రీరామచంద్రులవారు వారితో చెప్పారు. ఇది విని వారందరూ ఎంతో సంతోషించారు. తమ భాగ్యానికి ఎంతో సంతోషపడ్డారు.

ఇంతలో రాత్రి వేళ అయ్యింది. వానరులందరూ నిద్రలోకి జారుకున్నారు. తిరుమల కొండలు రాత్రి వేళ వైభవం మాటలలో వర్ణించలేనంతగా ఉంది. వానరులందరూ అలసిపోయి ఒళ్ళు మరచి నిద్రపోయారు. శ్రీరామచంద్రులవారు, లక్ష్మణులవారు మరికొందరు వానర వీరులతో ఏదో విశేషాలు ముచ్చటిస్తూ కూర్చున్నారు. దూరంగా అడవిలోనించి పులులు, సింహాల అరుపులు వినిపిస్తున్నాయి వింటున్నారా? మధ్య మధ్యలో ఏనుగుల ఘీంకారాలు వినిపిస్తున్నాయి చూసారా? అంతా పూర్తి నిశ్శబ్దం. మధ్య మధ్యలో కీచురాళ్ళ శబ్దం వస్తున్నది. దగ్గరలో ఏదో జలపాతం ఉన్నట్లుంది. రాత్రి అవటంచేత కొండలపైనుంచి అడవిలోకి ప్రవహిస్తున్న ఆ నీటిహోరు ఎలా వినిపిస్తోందో వినండి.

కాసేపు అయిన తరువాత అందరూ నిద్రలోనికి ఉపక్రమించారు. లక్ష్మణ స్వామి తనకు నిద్ర వస్తున్నదని తాను కూడా పడుకున్నాడు. శ్రీరామచంద్రులవారు అక్కడే ఉన్న ఒక రాతిపై పడుకున్నారు. అలా పడుకొని పైన ఆకాశం వంక చూస్తున్నారు చూడండి. ఆరోజు పౌర్ణమి కావడంతో పైన ఆకాశంలో చంద్రుడు ఎంతో అద్భుతంగా ప్రకాశిస్తున్నాడు. వెన్నెల రాత్రి ఎంతో అద్భుతంగా ఉంది. అలా ఆకాశం వంక చూస్తున్న శ్రీరామచంద్రుల వారికి ముందు ముందు జరగబోయే సంఘటనలన్నీ కనబడుతున్నాయి. ఇంతలో

స్వామి వారికి మనస్సులో ఏదో స్ఫురించింది. వెంటనే లేచి అడవిలోకి నడవసాగారు.

అలా అర్ధరాత్రి వేళ అడవిలోకి నడుస్తున్న ఆ శ్రీరామచంద్రమూర్తిని చూడండి! పైన వెన్నెలలో ఇంకా అద్భుతంగా ప్రకాశిస్తున్న ఆ మనోహరమూర్తిని దర్శించండి. కింద నీళ్ళు దాటుకుంటూ రామయ్య అలా ఆ అర్ధరాత్రివేళ ఇంకా ఇంకా అడవిలోకి నడవసాగాడు. మిగిలిన వారందరూ పూర్తి నిద్రలో ఉన్నారు.

రామయ్య ఒక్కడు అలా నడుస్తూ ఉంటే దారిలో మొక్కలు ప్రక్కకి వంగి స్వామివారికి ముందుకు వెళ్ళడానికి దారి ఇస్తున్నాయి చూడండి. అలా స్వామి నడుస్తూ ఒక కొండ ఎక్కి దిగారు. ఆ ప్రాంతం అంతా ఎంతో దివ్య తేజస్సుతో నిండి ఉంది. రామయ్య పెద్ద పెద్ద వృక్షాల మధ్యనుంచి మెల్లగా ఇంకా ఇంకా ముందకు సాగుతున్నాడు. అలా చిరునవ్వుతో నడుస్తూ ఒకచోటకి వచ్చి ఆగాడు. ఎదురుగా ఒక అద్భుత విగ్రహం! ఆ విగ్రహం నుంచే ఇంత దివ్యతేజస్సు ఈ ప్రాంతం అంతా వస్తున్నట్లు రామయ్యకు అర్థమయింది.

ఆ విగ్రహం ఎవరిదో కూడా రామయ్యకు అర్థమయింది. అది నేటి శ్రీవేంకటేశ్వరస్వామి వారిదే! అప్పటి తిరుమల కొండపై స్వామి వారి విగ్రహం ఒక్కటే ఉంది. స్వామి విగ్రహ రూపంలో నుంచొని ఉన్న ప్రదేశం పైన వేయి కోట్ల సూర్యుల తేజస్సుతో ప్రకాశిస్తున్న బ్రహ్మాండమైన దివ్య విమానం ఉంది. విమానం అంటే బ్రహ్మాండమైన గోపురం. శ్రీమన్నారాయణుల వారు వైకుంఠం నుంచి భూలోకానికి వచ్చినప్పటినుంచి ఆ దివ్య విమానం అక్కడే ఉంది. అయితే ఇది సామాన్య మానవులకు కనిపించదు. కేవలం దేవతలకు, సిద్ధులకు, యోగులకు మాత్రమే ఆ దివ్య విమానం దర్శనమిస్తూ ఉంటుంది. మనకు మాత్రం మానవ నిర్మితమైన గోపురం మాత్రమే కనబడుతుంది.

ఇక్కడ మీకు ఒక అనుమానం రావచ్చును. శ్రీవేంకటేశ్వరస్వామి వారు త్రేతాయుగంలో ఉండడం ఏమిటి? అనే అనుమానం మీకు కలుగవచ్చు. కలియుగ ఆరంభంలో కదా శ్రీమన్నారాయణులవారు ఇక్కడ శ్రీనివాసునిగా వెలసింది. మరి త్రేతాయుగంలో స్వామివారి విగ్రహం అక్కడ ఎలా ఉంది అనే సందేహం మీకు రావడం సహజం. ఇక్కడ ఒక గొప్ప దేవ రహస్యం ఉంది.

శ్రీమన్నారాయణులవారు కలియుగంలో శ్రీనివాసునిగా ఈ కొండపై వెలసినది నిజమే! కానీ అది ఈ ప్రస్తుత కలియుగం కాదు. ఎన్నో మహాయుగాల వెనుకటి కలియుగం. సృష్టి ప్రారంభంలోని మొట్టమొదటి మహాయుగం యొక్క కలియుగ ప్రారంభంలోనే ఈ స్వామి వారు ఈ తిరుమల కొండపై శ్రీనివాసునికిగా వెలిసారు. కలియుగం అంతా మానవులకు శిలారూపంలోనే దర్శనమిస్తూ తనని నమ్మిన భక్తులను రక్షిస్తుంటారు. కలియుగంలో కొంతకాలం అయ్యేటప్పటికి స్వామి వారికి మహారాజులచేత, అటు తరువాత సామాన్య మానవులచేత గొప్ప ఆలయం నిర్మింపబడుతుంది. ఈ ఆలయం కలియుగ ప్రారంభంలో కొన్ని వేల సంవత్సరాలు ఎంతో వైభవంగా ఉంటుంది.

కలియుగంలో ఒక లక్ష సంవత్సరాలు అయ్యేటప్పటికి ఈ ఆలయ వైభవం తగ్గనారంభిస్తుంది. ఇలా తగ్గుతూ కలియుగాంతం వచ్చేటప్పటికి ఇక్కడ తిరుమల కొండపై కేవలం శ్రీస్వామివారి విగ్రహం తప్ప ఏ ఆలయం ఉండదు. శ్రీస్వామివారు ఒక్కరే పైన దివ్య విమానంతో ఉంటారు. మానవనిర్మిత ఆలయం మొత్తం కాలగర్భంలో కలిసిపోతుంది. శ్రీస్వామివారు ఒక్కరే ఏకశిలామూర్తియై అలా ఆ కొండపై నిశ్చలంగా చిరునవ్వుతో నిలిచి ఉంటారు.

అప్పుడు ఆ స్వామిని నిత్యం కొలిచేది ప్రకృతి మాత్రమే. అలాగే అక్కడ తిరుగుతున్న అడవి జంతువులు, పక్షులు నిత్యం దర్శిస్తూ ఉంటాయి. ఇలా కలియుగం పూర్తికాగానే కృతయుగం వస్తుంది. కృత, త్రేతా, ద్వాపరయుగాలలో ఇక్కడ తిరుమల స్వామివారిని కేవలం దేవతలు మాత్రమే దర్శించుకుంటూ ఉంటారు. ఈ యుగాలలో మానవనిర్మిత దేవాలయం ఉండదు. కేవలం వైకుంఠం నుంచి వచ్చిన ఆ దివ్య విమానం మాత్రమే ఉంటుంది.

ఇలా శ్రీస్వామివారు గత 27 మహాయుగాలుగా ఇక్కడే ఈ తిరుమలకొండపైననే ఉన్నారు. ప్రతీ కలియుగం ప్రారంభంలోను శ్రీస్వామివారికి మానవులచేత ఆలయం నిర్మించబడి కాలం గడుస్తున్నకొద్దీ ఈ ఆలయం ఇంకా ఇంకా అభివృద్ధి చెందుతూ చుట్టూ మరిన్ని కట్టడాలు వెలుస్తాయి. ఇలా కొన్ని వేల సంవత్సరాలు ఎంతో వైభవంగా ఉండి తరువాత ధర్మం నశించి, కొన్ని లక్షల సంవత్సరాలకు ఈ ఆలయం పూర్తిగా కనుమరుగు అవుతుంది. చివరికి స్వామివారు ఒక్కరే ఇక్కడ నిలిచి ఉంటారు. ఇలా ప్రతీ మహాయుగంలోని, కలియుగంలోను జరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు శ్రీరామచంద్రులవారు త్రేతాయుగంలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ మరో విశేషం చెప్పాలి. కృత, త్రేతా, ద్వాపరయుగాలలో స్వామి వారు ప్రత్యక్షంగా మాట్లాడేవారు. శిలారూపంలో ఉన్నప్పటికి దేవతలందరితో ప్రత్యక్షంగా మాట్లాడేవారు. అంతేకాదు! కలియుగ ప్రారంభంలో కూడా కొంతకాలం అప్పుడప్పుడు పరమభక్తులతో మాట్లాడుతుండేవారు.

ఆరోజు శ్రీరామచంద్రులవారు, శ్రీవేంకటేశ్వరస్వామి వారు ఇద్దరూ ఏకాంశరూపులై ఎన్నో దేవరహస్యాలు మాట్లాడుకున్నారు. రాబోయే కాలంలో ఈ సృష్టిలో జరుగబోయే ఎన్నో

విశేషాలను ముచ్చటించుకున్నారు. ఇంతలో మూడు ఝాములు గడిచి నాలుగోఝాము ప్రవేశించింది. శ్రీరామచంద్రులవారు శ్రీవేంకటేశ్వర స్వామి వద్ద సెలవు తీసుకొని తిరిగి తాము అంతకుముందు ఉన్న ప్రాంతానికి వచ్చి అక్కడే రాతిపై పడుకున్నారు.

ఇంతలో తెల్లవారింది. అందరూ తిరిగి ప్రయాణిం సాగించేముందు శ్రీరామచంద్రులవారు ఒక్క క్షణం ఆగి శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనస్సులో తలచుకొని ముందుకు సాగారు. వానర వీరులందరూ శ్రీరామచంద్రులవారు శ్రీలక్ష్మణ స్వామి వెంట వెనుకనే ఉత్సాహంగా రాసాగారు. ఈ పవిత్ర తిరుమల కొండపై రెండురోజులు గడిపినా వారందరిలో నూతన ఉత్సాహం, ఎంతో గొప్ప శక్తి కలిగింది. ఆ ఉత్సాహంతో వారందరూ ఎంతో సంతోషంగా గంతులు వేస్తూ ముందుకు సాగారు. శ్రీరామచంద్రులవారు, సోదరుడు శ్రీలక్ష్మణస్వామి వెంటరాగా మనస్సులో శ్రీవేంకటేశ్వరస్వామివారిని ప్రార్థిస్తూ కొండ దిగి ముందుకు సాగారు.

23

అది ద్వాపరయుగంలోని ఒకరోజు. ఆరోజు క్రిష్ణయ్య యమునా తీరంలో గోపికలతో ఆడుతున్నాడు. వారితో ఎన్నో కబుర్లు చెప్తూ, వారితో కలిసి అటూ ఇటూ పరిగెడుతూ ఆడుతున్నాడు. గోపికలకు క్రిష్ణయ్య అంటే ఎంతో ప్రాణం. అదిగో చూడండి! ఆ గోపికలందరూ ఎంత మైమరచి క్రిష్ణునితో ఆడుతున్నారో! వారందరూ కలిసి క్రిష్ణయ్యతో కోలాటం ఆడుతున్నారు. వారిలో రాథ కూడా ఉంది ఇలా ఆడుతూ పాడుతూ రాధా క్రిష్ణులిద్దరూ యమునా తీరానికి వెళ్ళారు. ఎన్నెన్నో అద్భుతమైన చెట్లు. బృందావనం ప్రాంతం అంతా ఎంతో గొప్ప ప్రకృతితో విరాజిల్లుతోంది.

యమునా తీరంలో రాధా క్రిష్ణులిద్దరూ ఇసుక తెన్నెల్లో అటూ ఇటూ పరుగెడుతూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. అదిగో వారిద్దరిని చూడండి! ప్రకృతి, పురుషులను చూస్తున్నట్లే ఉంది కదా! వీరిద్దరి ప్రేమతో ప్రకృతి మొత్తం పులకరించి పోతోంది. ఇలా ఇద్దరూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటే ఇంతలో రాధ ఒక్కసారిగా నొప్పితో

మూల్గింది. ఏమిటా అని క్రిష్ణయ్య అడిగితే తన కాలికి ముల్లు గుచ్చుకుంది అని చెప్పింది. క్రిష్ణయ్య రాధను తన పక్కనే కూర్చొండపెట్టుకుని ఆమె కాళ్ళను తన ఒడిలోకి తీసుకున్నాడు. కొంచెం జరిగి ఆమె పాదం తన చేతిలో ఉండేలా చూసుకున్నాడు. రాధ ఒక పక్క ముళ్ళు బాధతో, ఒక పక్క క్రిష్ణయ్య తనకు చేస్తున్న సపర్యలకు మురిసిపోతూ చూస్తోంది.

క్రిష్ణయ్య నెమ్మదిగా రాధ కుడి పాదాన్ని తన ఎడమచేతిలోకి తీసుకొని ముందుకు వంగి కుడిచేతితో నెమ్మదిగా రాధ కాళ్ళలోని ముళ్ళును తీసివేసాడు. రాధ రెండు చేతులు వెనుకకు ఇసుకలో పెట్టుకొని ఎంత వయ్యారంగా కూర్చున్నదో చూడండి. రాధ కాలిలోనుంచి ముళ్ళు తీసిన క్రిష్ణయ్య నొప్పి తగ్గిందా అని రాధని అడిగాడు. నొప్పి తగ్గిపోయింది అని ఎంతో మురిపంగా చెప్పి ఇకలే ఆడుకుందాము అని అంది.

ఇలా రాధ అంటూ ఉండగానే పెద్దగాలి వీచి క్రిష్ణుని పింఛం ఎగిరి రాధ ముఖంపైకి కనుబొమ్మల మధ్య నుదుటిపై పడి అతుక్కుంది. ఆహా ఆ దృశ్యం చూడండి ఎంత అద్భుతంగా ఉందో అప్పుడు రాధ ఆ పింఛాన్ని నెమ్మదిగా చేతిలోనికి తీసుకొని క్రిష్ణయ్య తలలో పెట్టడానికి చూస్తోంది. రాధ ఆ పింఛాన్ని తీసుకొని క్రిష్ణయ్య మోముపై అటూ ఇటూ నిమిరింది. రాధకు సర్వస్వం క్రిష్ణుడే! వారిది మధుర ప్రేమ. రాధా క్రిష్ణులది ఎంతో అద్భుతమైన ప్రేమ తత్వం అలా ముచ్చటగా ఆ నెమలి పింఛాన్ని క్రిష్ణయ్య మోముపై రాస్తూ తలలో పెట్టింది. అప్పుడే చీకటి పడింది. ఆరోజు వెన్నెల కావడంతో ఆకాశమంతా ఎంతో అద్భుతంగా ఉంది. పైన ఆకాశంలోనించి ఈ సుందర దృశ్యం చూసిన చంద్రుడు ఎంత ఆనందపడుతున్నాడో చూడండి! ఆ ఆనందంలో చంద్రుడు మరింతగా ప్రకాశిస్తున్నాడు.

ఆ వెన్నెల రాత్రి రాధా క్రిష్ణులిద్దరూ యమునా తీరంలో అటూ ఇటూ తిరుగుతూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఇద్దరూ పక్కపక్కనే ఆ ఇసుకలో పడుకొని ఆకాశంలోని చంద్రుని వంక, నక్షత్రాల వంక చూస్తూ సంతోషపడుతున్నారు. రాధకు ఆకాశంలో ఉన్న నక్షత్రాలన్నింటిలో క్రిష్ణయ్య రూపమే కనబడుతోంది. క్రిష్ణయ్యకు ప్రతీ నక్షత్రంలోను రాధనే కనబడుతోంది. ఇలా ఆకాశం మొత్తం రాధా క్రిష్ణులమయం అయిపోయింది. ఈ విశ్వం అంతా వారి ప్రేమ తత్త్వంతో నిండిపోయింది.

క్రిష్ణయ్య లేచి కూర్చొని ఎంతో అద్భుతంగా వేణువు ఊదసాగాడు. ఆ వేణు నాదానికి రాధ ఎంతో పరవశించిపోయింది. అలా పాడుతున్న క్రిష్ణయ్యను రాధ తన చుబుకంపై చూపుడు వేలు పెట్టుకొని ఎంతో ముచ్చటగా చూస్తున్నది. తన ప్రియసఖుని వేణు గానంతో రాధ ఒళ్ళు మర్చిపోయింది. ఒక్కసారిగా ముందుకు వంగి క్రిష్ణయ్య నుదుటున చిన్న ముద్దు ఇచ్చింది. క్రిష్ణయ్య ఎంతో మురిసిపోయాడు.

అలా ముందుకు వంగినపుడు రాధాదేవి శిరోజాలు కొన్ని యమునా నదిపైనుంచి వస్తున్న చిరుగాలికి ఎగిరి క్రిష్ణుని ముఖంపై పడి ఆ దృశ్యం ఎంత అద్భుతంగా ఉందో చూడండి! క్రిష్ణయ్య వేణునాదానికి లోకాలన్నీ పరవశించిపోయాయి. ఇక్కడ యమునా తీరంలో ఆ పౌర్ణమి రాత్రి పక్కనే రాధతో క్రిష్ణయ్య ఎంతో మధురంగా వేణువు ఊదుతుంటే ప్రపంచంలోని ప్రేమ తత్త్వం మొత్తం అక్కడే ఆవిష్కృతమయ్యింది. అది చూసి దేవతలు ఎంతో ఆనందించారు.

ఇంతలో చల్లని చిరుజల్లు ప్రారంభమయింది. చాలా సన్నటి తుంపరులు. రాధ ఆ తుంపరులను దోసిలి పట్టుకుంటోంది. చేతులుమీద ఆ తుంపరులు పడుతుంటే ఎంతో ముచ్చటపడుతోంది.

క్రిష్ణయ్య తలపై, మోముపై ఆ వెన్నెల రాత్రి సన్నటి వర్షపు తుంపరులు పడి క్రిష్ణయ్య మేను అద్భుతంగా వింత రంగుతో శోభిస్తోంది. ఆహా ఎంత మనోహరంగా ఉంది ఆ దృశ్యం! వెన్నెల వెలుగు ఆ తుంపరులపై, క్రిష్ణుడి పింఛం పై పడి ఎంత అద్భుతంగా ఉందో చూడండి. ఇంతలో రాధ క్రిష్ణయ్యను క్రిష్ణా! ఈ రోజు నేను కూడా కాసేపు వేణువు ఊదుతాను అని గోముగా అడిగింది. క్రిష్ణుడు ఎంతో మురిసిపోతూ రాధకు తన వేణువు ఇచ్చాడు. రాధ క్రిష్ణయ్య ఎదపై తలపెట్టుకొని ఆకాశంవైపు చూస్తూ వేణువును ఊదుతుంటే, క్రిష్ణయ్య కూడా ఆ వేణువును పట్టుకొని తన ప్రియ సఖిని ఎంతో ముచ్చటగా చూస్తున్న ఆ దృశ్యం చూడండి. ఎంత అద్భుతంగా ఉందో! రాధ వేణు నాదానికి క్రిష్ణయ్య మురిసిపోయాడు. క్రిష్ణయ్య వేణునాదం జగత్తు మొత్తానికి అయితే రాధ వేణునాదం మాత్రం కేవలం మాధవునికే! ఇదే ఇక్కడ అద్భుత విశేషం ఈ అద్భుత దృశ్యం చూస్తున్న మనం ఎన్ని జన్మల పుణ్యం చేసుకున్నామో కదా!.

రాధా క్రిష్ణులిద్దరూ నెమ్మదిగా లేచి కబుర్లు చెప్పుకుంటూ ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని యమునా నది అలలు ఇసుకను తాకేవద్ద నుంచొని ఆ అలలను ముచ్చగా చూడసాగారు. వీరి వెనుక నుంచి తెల్లని వెన్నెల పడి వీరిద్దరి నీడలు ఆ వెన్నెల వెలుగులో ఎంత అద్భుతంగా ప్రతిబింబిస్తున్నాయో చూడండి. ఇక్కడ ఆశ్చర్యం! యమున ఒడ్డున నుంచున్నది రాధా క్రిష్ణులు ఇద్దరే అయితే ఎదురుగా యమునలో కొన్ని వేల రాధా క్రిష్ణుల ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి. యమున నీటి అలలలో ఈ ప్రతిబింబాలు ఒక లయబద్ధంగా అటూ ఇటూ ఊగుతున్నాయి. ఆహా ఎంత అద్భుతంగా ఉంది ఆ దృశ్యం! రాధ అన్ని వేల తమ ప్రతిబింబాలని క్రింది నీటిలో చూసి క్రిష్ణుని వంక ఆశ్చర్యంగా చూసింది. క్రిష్ణుడు చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వులో రాధకు అర్థం దొరికింది. ఇదంతా క్రిష్ణ మాయ. ఈ ప్రపంచం మొత్తం

రాధా క్రిష్ణుల ప్రేమ తత్త్వమే నిండి ఉందని క్రిష్ణయ్య ఈ ప్రకృతి ద్వారా ప్రపంచానికి చెప్తున్నాడు. రాధ ఈ విషయం గ్రహించింది. అన్ని వేల ప్రతిబింబాలలో వెన్నెల రాత్రిలో యమునా నదిలో చూస్తూ రాధా క్రిష్ణులిద్దరూ పూర్తిగా తన్మయత్వంలో మునిగిపోయారు. వారి ప్రేమను చూసి ప్రకృతి పులకరించింది.

ఇంతలో మరొక అద్భుతం కనిపించింది. ఎదురుగా నీటి అలలలో ఒక్కసారిగా రాధ మాయమై పూర్తిగా క్రిష్ణుని ప్రతిబింబాలే కనబడ్డాయి. మళ్ళీ ఒక్క క్షణంలో క్రిష్ణుని ప్రతిబింబాలు మాయమై యమునా నది మొత్తం ఒక్క రాధ ప్రతిబింబాలతోనే నిండిపోయింది. ఈ దృశ్యం రాధా క్రిష్ణులిద్దరూ ఒక్కరేనని ప్రపంచానికి చెప్తున్నారు. మళ్ళీ కాసేపటికి యమునా నది అంతా అనేక వేల రాధాక్రిష్ణుల ప్రతిబింబాలతో నిండిపోయింది. అలా కాసేపు రాధాక్రిష్ణులిద్దరూ యమునా తీరంలో ఉండి ఎంతో ఆనందంగా గడిపారు. కాసేపటికి యమునలో తిరిగి రాధాక్రిష్ణుల ప్రతిబింబాలు ఒక్కటే కనిపిస్తున్నాయి.

రాధాక్రిష్ణుల ప్రేమ తత్త్వం మాటలలో వర్ణించలేనిది. ఈ సృష్టి మొత్తానికి ఆలంబనం అయిన ప్రేమ తత్త్వం వారిది అంతటి అద్భుత ప్రేమ మూర్తులను ద్వాపరయుగంలో వెన్నెల రాత్రుల్లో యమునా తీరంలో దర్శించగలగడం ఎంతో గొప్ప అనుభూతి. ఎన్నో జన్మల పుణ్యఫలంచేత మనం ఈ అద్భుత దృశ్యాన్ని చూడగలిగాం. ఆహా మన జన్మలు ధన్యం అయ్యాయి కదా! ఇది మనం ఎప్పటికి మర్చిపోలేని ఒక దివ్య అనుభూతి. ఆ రాధాక్రిష్ణులు మనకి అనుగ్రహించిన మహాప్రసాదం.

24

మనలో చాలామంది కష్టాలన్నీ మనకే వస్తున్నాయి అదికూడా ఎంతో ధర్మంగా జీవితం గడుపుతున్నా మనకు కూడా ఒకేసారి ఇన్ని కష్టాలు రావడం ఏమిటి అని అనుకుంటుంటాము. దానితోపాటు ఒకోసారి సమాజంలో, మనదగ్గర బంధువర్గంలో కూడా ఎంతో అధర్మంగా, ఎన్నో అన్యాయాలు చేస్తున్నవారు కొందరు అన్ని సుఖాలు అనుభవిస్తున్నవారు కనబడుతుంటారు. ఇటువంటి సమయంలో నిజంగా దేవుడనేవాడు ఉన్నాడా? ఉంటే ఇలా జరుగుతుందా? అనే అనుమానం రావడం సహజం.

దీనికి సమాధానం ఒక్కటే. ఈ పుస్తకం ఇప్పటివరకు చదివిన మీకు ఒక విషయం అర్థమయ్యి ఉండాలి. అదేమిటంటే మనం ఇంతకుముందు ఎన్నో కోట్ల జన్మలలో పుట్టి ఉన్నాము అని. మరి ఆ కోట్లాది జన్మలలో ఎటువంటి పుణ్యకార్యాలు చేసామో, ఎటువంటి పాపకార్యాలు చేసామో మనకు తెలియదు కదా! ఈ భూమి మీద ప్రస్తుతం జీవిస్తున్న ప్రతీజీవి తన వెనుకటి కోట్లాది జన్మలలో తాను

చేసుకున్న అనేక కర్మల ఫలం అనుభవిస్తూంటుంది. ఈ జీవికి జరిగే అనుభవాలన్నీ ఈ జీవి కోట్లాది జన్మలలో చేసుకున్న పాప పుణ్యాల ఫలితమే! అంతే తప్ప భగవంతుడు ఒకళ్ళని కష్టపెట్టడం, మరొకరిని సుఖపెట్టడం జరుగదు. భగవంతుడి దృష్టిలో మనందరము సమానమే!

మనమే మన కష్టాలకు, సుఖాలకు బాధ్యులం. అయితే మనం ఈ తీవ్ర బాధలు తట్టుకునే శక్తి తగ్గిపోయి భగవంతుడిని, మన బంధువులను, మన స్నేహితులను నిందిస్తుంటాము. కాని మన జీవితంలో జరుగుతున్న ప్రతీ సంఘటన, మనం అనుభవిస్తున్న ప్రతీ విషయము పూర్వ జన్మలలో మనం చేసుకున్న పాప పుణ్యాల ఫలితమే అని గ్రహించాలి. ఇది చెప్పినంత తేలిక కాదు. ఉదాహరణకి ఈ మధ్య నా దగ్గరకి వెంకట్రావు అనే మిత్రుడు వచ్చాడు. అతడు తన చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరిని ఒకేరోజు ఒక ప్రమాదంలో కోల్పోయాడు. వెంకట్రావుని వారి తాత, అమ్మమ్మలే పెంచారు. అటు తండ్రి వైపు, ఇటు తల్లి వైపు ఇరువురు ఒక్కరే కావడంతో వెంకట్రావును తాతగారు, అమ్మమ్మగారే పెంచవలసి వచ్చింది. పెద్ద వయస్సులో వారికి ఎంత కష్టం వచ్చిందో చూడండి.

వెంకట్రావు పరిస్థితి కూడా అంతే కదా. తల్లి దండ్రులిద్దరిని చిన్నప్పుడే కోల్పోవడం అంటే ఎంత బాధాకరం. కాని వెంకట్రావు చక్కగా చదువుకొని ఆ ఊళ్ళోనే స్కూల్ టీచర్‌గా చేరాడు. కొంతకాలానికి వెంకట్రావుకి వివాహం అయ్యింది. రెండు సంవత్సరాలకి వెంకట్రావుకి చక్కటి పిల్లాడు పుట్టాడు. ఆ పిల్లవాడిని చూసి దంపతులిద్దరు ఎంతో మురిసిపోయారు. అయితే పూర్వజన్మ కర్మఫలం వెంకట్రావును ఇంకా వేటాడసాగింది. పిల్లవాడు పుట్టిన రెండు సంవత్సరాలకే వెంకట్రావు భార్య ఒక భయంకర వ్యాధి వచ్చి మరణించింది. వెంకట్రావు బాధ, వెంకట్రావు తల్లిదండ్రుల బాధ

వర్ణనాతీతం. వీరందరి బాధలు పూర్వజన్మ కర్మఫలాలే. వెనుకటి జన్మలలో ఎప్పుడో చేసిన పాపకార్యాల ఫలం ఇప్పుడు వీరందరూ ఇప్పుడు అనుభవిస్తున్నారు.

మనమధ్య ప్రస్తుతం ఎంతో భోగభాగ్యాలు అనుభవిస్తున్నవారు ఇంతకు ముందు జన్మలలో ఎంతో మంచి పనులు చేసిఉంటారు. ఒకజన్మలో పుణ్యఫలం వలననే ఇంత ఎక్కువ ధనం, ఇన్ని పదవులు, ఇన్ని పేరు ప్రతిష్టలు రావు. దాదాపు 400 జన్మలు ఎంతో ధర్మంగా, దానాలు చేస్తూ, సమాజానికి సేవచేస్తూ, తమ తోటివారందరిని సమానంగా చూస్తూ, ఎవ్వరినీ పరుషంగా మాట్లాడకుండా జీవించినప్పుడే ఈ జన్మలో ఇంత భోగభాగ్యాలు లభిస్తాయి. అయితే ఇలా లభించిన లౌకిక సంపదల వల్ల అహంకారం పెరిగి అన్యాయాలు చేస్తే కొన్ని వేల జన్మలలో మళ్ళీ ఎప్పటికీ ఈ భోగభాగ్యాలు లభించవు.

ఈ జన్మలో కనుక అహంకారంతో తనకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారిని దూషించడం, ఎంతో ధర్మంగా బ్రతుకుతున్న వారిని హింసించడం వంటి పనులు చేస్తే వచ్చే వేల జన్మలలో అతి సామాన్యంగా, అది కూడా ఎన్నో కష్టాలు పడుతూ బ్రతకాల్సి వస్తుంది. ఇది ప్రతీ ఒక్కరు గ్రహించవలసిన విషయం. మనుషులు అందరూ ఈ లౌకిక ప్రపంచపు మాయలో పడకుండా ధర్మపరంగా జీవించాలి. అప్పుడే ముందు ముందు ఉత్తమజన్మలు వస్తాయి. ఈ లౌకిక మాయలో పడి అధర్మంగా ఉంటే మాత్రం సామాన్య మానవజన్మలే కాదు, కొన్ని వందల జన్మలు జంతు ప్రపంచంలో కూడా జన్మించవలసి వస్తుంది అని అందరూ గ్రహించాలి.

ప్రస్తుతం మనమధ్య ఉన్న ఒక ధనవంతుడు ఎంతో ధనం సంపాదించాడు. అతడికి ఎన్నో వ్యాపారాలు ఉన్నాయి. అతడికి ఎన్నో

స్థిర, చరాస్తులు ఉన్నాయి. అతనివద్ద వంద మందికి పైగా పనిచేస్తున్నారు. ఇదంతా ఇతడు పూర్వజన్మలలో చేసుకున్న పుణ్యఫలం వలన, అతడిపైన ఇరవై తరాల వెనుక ఇద్దరు మహానుభావులైన దంపతులు చేసిన పుణ్యఫలం వలన ఈరోజు ఇతడు ఇన్ని భోగభాగ్యాలు అనుభవిస్తున్నాడు.

కాని ఇతడు పూర్తి అహంకారంతో ఎన్నో అన్యాయాలు చేస్తున్నాడు. తన దగ్గర పనిచేస్తున్న వారిని ఎన్నో విధాల హింసిస్తున్నాడు. ఈ పాప ఫలం అంతా అతడు వచ్చే జన్మలలో తప్పక అనుభవిస్తాడు. ఒక్కసారి అతడి తరువాత జన్మలు చూడండి! వచ్చే జన్మనుంచి ఈ జన్మలో చేసిన పాప కార్యాల వలన ఇతడు 4000 జన్మలు జంతుప్రపంచంలో జన్మిస్తాడు. అన్ని జన్మలలో అతి హీనంగా బ్రతుకుతాడు.

అదిగో! అతడి వచ్చే జన్మ చూడండి. ఒక వీధి కుక్కలాగా జన్మించి పాత వాసనలు పోక తన భవంతి ఉన్న వీధిలోనే తిరుగుతున్నాడు. చూడండి అతను ఎలా అటూ ఇటూ తిరుగుతున్నాడో. ఎట్లాగైనా లోపలకి వెళదామని ప్రయత్నిస్తున్నాడు. అయితే అక్కడ ఉన్న కాపలా వాళ్ళు ఆ వీధికుక్కని చావబాదారు. అది కుయ్యో మొర్రో అంటూ ఏడుస్తూ, కుంటుకుంటూ ఎలా దూరంగా వెళ్ళిపోతోందో చూడండి. ఆ కాపలా వాళ్ళకి ఈ వీధికుక్క ముందు జన్మలో తమ యజమాని అని ఇన్ని కోట్లకు అధిపతి అని తెలియదు కదా అందుకే ఆ వీధికుక్కని ఎలా కొట్టారో చూడండి. ఆ దెబ్బలకి దాని కాలు విరిగి ఎలా కుంటుకుంటూ వెళుతోందో చూడండి.

ఇంతలో ఒక కారు వేగంగా వచ్చి ఆ కుక్కను గట్టిగా తాకింది. కుంటితనం వల్ల పక్కకు జరగలేక ఆ కుక్క ఆ కారుచక్రాల కింద పడి ఎంత ఘోరంగా మరణించిందో చూడండి. పూర్వజన్మలో

ఎంతో కోటీశ్వరుడైన ఆ వ్యక్తి ఎన్నో అన్యాయాలు చేయడం వల్ల ఈ జన్మలో ఎంతటి ఘోర పరిస్థితుల్లో మరణించాడో చూడండి. మరుజన్మలో ఇతడు ఒక పిల్లిగా జన్మించి పూర్వజన్మ వాసనలచేత తిరిగి అదే ఇంటి దగ్గరలో తిరగసాగాడు.

ఆ వ్యక్తి ధనవంతుడిగా ఉన్నప్పటి మనుమడుకి పిల్లులు అంటే ఎంతో ఇష్టం. అతడీ పిల్లిని దగ్గరకు తీసుకొని ఎంతో ముద్దు చేయసాగాడు. ఒకనాడు ఆ మనుమడు స్కూలుకి వెళుతూ ఆ పిల్లిని ముద్దాడాడు. అది ఆనందంతో ఈ పిల్లవాడి యూనిఫారంపై మూత్రం విసర్జించింది. అంతే ఆ పిల్లవాడికి విపరీతమైన కోపం వచ్చింది. వెంటనే పనివాళ్లని పిలిచి ఈ పిల్లిని ఊరిబయట వదిలిపెట్టి రమ్మని చెప్పాడు. అంత ధనవంతుడి ఇంట పెరిగిన అతనికి మాత్రం అహంకారానికి తక్కువా? క్షణంలో పనివాళ్ళు ఆ పిల్లిని తాళ్ళతో కట్టేసి కారు డిక్కిలో పడేసి ఊరి బయటకు తీసుకెళ్ళి వదిలేసారు. ఎంతో ఖరీదైన కార్లలో కేవలం రెండు సంవత్సరాల క్రితం తిరగిన ఇతడు ఈ జన్మలో కారు డిక్కిలో ఎలా నొక్కివేయబడ్డాడో చూసారా! ఆ పిల్లి రాత్రి అయిన తరువాత తిరిగి ఇంటికి వద్దామని పరుగెత్తి పరుగెత్తి రోడ్డు పక్కనే వస్తోంది. ఇంతలో ఎదురుగా వస్తున్న ఒక లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు వచ్చి ఈ పిల్లి మీదకు వెళ్ళింది. అంతే ఆ పిల్లి జీవితం ఆక్షణంతో అలా ఎంతో దురదృష్టకర రీతిలో ముగిసింది. ఇలా ఆ వ్యక్తి కొన్ని వందల జన్మలు ఇలా జంతుప్రపంచంలో అనేక బాధలు అనుభవిస్తూ జీవించాడు. తిరిగి కొన్ని వేల సంవత్సరాలకు మానవజన్మలోకి వచ్చాడు.

పూర్వజన్మ కర్మఫలాలు మనుషుల్ని ఇలా వెంటాడుతూ ఉంటాయి. మీరు ఈ జన్మలో ఎంతో ధనవంతులై, ఎంతో ఆరోగ్యంగా జీవిస్తున్నానరంటే మీరు పూర్వజన్మలలో ఎప్పుడో ఎంతో పుణ్యం

చేసుకొని ఉంటారని గ్రహించండి. ప్రస్తుత జన్మలో కూడా మీరు మంచి పనులు చేస్తూంటే ముందు ముందు కూడా మంచి జన్మలు పొందుతారు. ఒకొక్కసారి మనం చూస్తున్న ధనవంతులు వారు ఒక 400 జన్మల క్రితం ఒక 20 జన్మలు ఎంతో పుణ్యం చేసుకొనడం వలన ఈ జన్మలో ఈ భోగభాగ్యాలు అనుభవిస్తున్నారు. అయితే వారు అటు తరువాత జన్మలలో చేసిన పాపకార్యాల వల్ల మూటకట్టుకున్న పాపఫలం వచ్చే జన్మలలో అనుభవిస్తారు.

మనచుట్టూ నిత్యం తిరిగే అనేక జంతువులలో కొన్ని అంతకుముందు మానవజన్మలలో జన్మించినవి కూడా ఉండవచ్చు. పెద్దలు సర్వప్రాణులయందు దయ కలిగి ఉండమని చెప్తారు కదా! మీ ఇంట్లో ఉన్న కుక్క మీకు ఎన్నో వేల జన్మల వెనకాల మీ తల్లో, తండ్రో, అన్ననో, తమ్ముడో...ఎవరికి ఎరుక కాబట్టి మనం మన చుట్టూ ఉన్న ప్రాణులన్నింటిని దయతో చూడాలి. వాటికి తినడానికి ఏమైనా ఇస్తూ ఉండాలి. ఇలా చేసే మంచి పనులే మనకు ఎంతో పుణ్యఫలం కలుగచేస్తాయి.

సృష్ఠి మొదటి నుంచి ఇన్ని కోట్లాది జన్మలలో జన్మించి అనేక బంధాలు ఏర్పరుచుకున్నందు వలన ఈ జన్మలో మనచుట్టూ ఉన్నవారందరూ మనకి మరొక జన్మలలో ఎప్పుడో ఏదో విధంగా తారసపడే ఉంటారు. మనం వారికో వారు మనకో ఏదో ఋణపడే ఉంటాము. ఆ ఋణం తీర్చుకోవడానికే ఈ జన్మలో ఇలా దగ్గరకి వచ్చారు. ఈ ఋణాలు తీరగానే మళ్ళీ ఎవరి దారి వారిదే! వారి వారి పూర్వజన్మల కర్మఫలాల ప్రకారం వారు ఈ ఆత్మప్రయాణంలో ముందుకు సాగుతూ వెళ్ళిపోతారు.

ఈ జన్మలో మన తల్లిదండ్రులు, మన పిల్లలు, మన తోడపుట్టినవారు, మన స్నేహితులు ఈ కోట్లాది జన్మలలో ఎప్పుడో

ఎక్కడో కలిసి ఉంటారు. ఈ జన్మ తరువాత ఎవరి ఆత్మ ప్రయాణం వారిదే మళ్ళీ ఎప్పుడో ఎన్నో లక్షల జన్మల తరువాత కలవవచ్చు. లేదా మనకు వారితో కల ఋణం ఈ జన్మతోనే పూర్తిగా తీరిపోతే ఇక మళ్ళీ ఎప్పటికీ కలవకపోవచ్చు కూడా. ఇది ఆలోచించి మన చుట్టూ ప్రతీ ఒక్కరితో మనం ఎప్పుడూ ఎంతో సఖ్యంగా ఉండాలి. ఎవ్వరితోను పరుషంగా మాట్లాడకూడదు.

మనల్ని అందరు ఎప్పుడూ ఆనందంగా ఉండమని చెప్తారు. ఎప్పుడూ ఆనందంగా ఉండడం కోసం ప్రజలందరూ ఎంతో తాపత్రయ పడుతుంటారు. అసలు ఆనందం అంటే ఏమిటి ? ఆనందానికి ఎవరైనా సరియైన నిర్వచనం ఇవ్వగలరా ! ఒకరికి ఒక సినిమా చూస్తే ఆనందం ఒకరికి డబ్బు సంపాదించడం ఆనందం మరొకరికి ఎంత డబ్బు సంపాదించినా ఏమాత్రం డబ్బు ఖర్చుపెట్టకపోవడం ఆనందం. కొంతమంది ఎంత పిసినారిగా ఉంటారంటే వాళ్ళ కుటుంబ సభ్యులకు అనారోగ్యం కలిగినా ఒక్కరూపాయి ఖర్చుపెట్టడానికి వంద సార్లు ఆలోచిస్తారు. వారికి డబ్బును అలా చూసుకొనడంలోనే ఆనందం ! మరొకరికి పది రూపాయలు సంపాదిస్తే ఆ పదిరూపాయలు ఖర్చుపెట్టేస్తేనే ఆనందం ! ఒకరికి ఎప్పుడూ ప్రయాణం చేయడం ఆనందం ! మరొకరికి దేశంలోని పుణ్యక్షేత్రాలు చూడడం ఆనందం ! మరొకరికి ఎటూ కదలకుండా ఇంట్లో కూర్చోవడం ఆనందం !.

ఒక్కసారి ఆలోచించండి ఆనందం ఇన్ని రకాలుగా ఉంటుందా? లేక ఇవన్నీ ఆనందాలు అని మనం భ్రమ పడుతున్నామా? ఆనందాన్ని ఇంత, అంతా అని లెక్కించలేము. ఒక పెద్ద వ్యాపారవేత్తకి ఒకరోజు కోటి రూపాయలు సంపాదిస్తే వచ్చే ఆనందం ఆ ఆఫీసు ప్రక్కనే ఉన్న టీస్టాల్ లో ఐదు రూపాయలు ఇచ్చి

బయట స్టూలుపై కూర్చొని ఒక కాఫీత్రాగే వ్యక్తి ఆనందంతో సమానం అవ్వచ్చుకదా ! ఆనందం అనేది ఆత్మకు, మనస్సుకు, శరీరానికి సంతోషం ఇచ్చేదే అసలైన ఆనందం. ఎప్పుడైతే ఆత్మ, మనస్సు ఆనందమైన స్థితిలో ఉంటాయో అప్పుడు శరీరం కూడా ఆనందంగా ఉంటుంది. మనం ఎప్పుడూ మన చుట్టుప్రక్కల విషయాలన్నీ శాశ్వతం అని తలవకుండా వాటితో బంధం పెట్టుకోకుండా ఈర్ష్యా ద్వేషాలకు లోనవకుండా జీవిస్తే అప్పుడే మన ఆత్మ, మనస్సు, శరీరం ఆనందంగా ఉంటాయి. అదే స్థిత ప్రజ్ఞతగా చెప్పబడుతుంది. ఎవరైతే నిత్య జీవితంలో మంచి పనులు చేస్తూ ఆ పుణ్యఫలం కూడా వారికి అంటకుండా జీవిస్తారో వారు నిశ్చలమైన మనస్సుతో ఎప్పుడూ ఆనందంగా ఉండగలుగుతారు.

ఇన్ని కోట్లాది జన్మలలో ఈ 70-80 సంవత్సరాల జన్మ ఎంత చిన్నది? ఈ మాత్రానికే ఇన్ని కోపతాపాలు ఎందుకు? ప్రతీ ఒక్కరు ప్రశాంతంగా జీవించడం అలవాటు చేసుకోవాలి. మనచుట్టూ వారందరినీ ఎంతో ప్రేమతో చూడడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతిని ప్రేమించాలి. మన చుట్టూ ఉన్న సమస్త ప్రాణికోటిని ఎంతో దయతో చూడాలి. అప్పుడే మనం ముందు ముందు ఎంతో ఉత్తమజన్మలలో జన్మించి చివరికి ఆ పరమేశ్వరునిలో ఐక్యం కాగలుగుతాము.

శ్రీలక్ష్మీశ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు!
సర్వేజనా సుఖినోభవంతు!
సమస్త కళ్యాణానిభవంతు!





విశ్వపతి కలం పేరుతో ప్రసిద్ధులైన తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహరావు, నాగ రత్నాంబ దంపతులకు 1956లో జన్మించారు. విశ్వపతి 1978లో బి.ఇ. 1983లో ఎం.టెక్ చదివి, 1984 నుంచి 1988 దాకా ఆల్విన్ కంపెనీలో పనిచేసారు. తరువాత యమ్.వి.యస్.ఆర్. ఇంజినీరింగ్ కాలేజీలో చేరారు. విశ్వపతి 1984 నుంచి 1990 వరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కార్టూన్‌లు వేశారు. ఆయన కార్టూన్లు వివిధ మ్యాగజైన్లలో ప్రచురించబడ్డాయి.

విశ్వపతి 1998 నుంచి వేదిక్ లోగో డిజైన్ రంగంలో ఉన్నారు. వేద శాస్త్రాల ఆదారంగా ఇప్పటిదాకా ప్రపంచ వ్యాప్తంగా 6,000 పైగా సంస్థలకు పేర్లు నిర్ణయిం, లోగోలు డిజైన్ చేశారు. ఈ సంస్థలన్నీ ఈరోజు ఎంతో ప్రముఖ స్థానంలో ఉన్నాయి.

స్వతహాగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తులు అయిన విశ్వపతి ఇప్పటిదాకా 28 ఆధ్యాత్మిక పుస్తకాలు రాసారు. వీటిలో 18 పుస్తకాలు శ్రీనివాసుని పైననే ఉండడం విశేషం. వీరు రాసిన ఈ పుస్తకాలన్నీ వీరు పూర్తి ఉచితంగా పంచుతున్నారు. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులచేత నిత్యం చదవబడుతున్నాయి. వీరి పుస్తకాలు ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన హార్వర్డ్, కార్నెల్, కేంబ్రిడ్జి, ఆక్స్ఫర్డ్, హేయదేల్బర్గ్, రాయల్ డెన్మార్క్ లైబ్రరీ, ఫిలిప్పీన్స్ విశ్వవిద్యాలయ లైబ్రరీలలో ఉంచబడ్డాయి.

వీరికి ఈ పుస్తకాలు రాస్తున్నప్పుడు ఎన్నో దివ్యానుభూతులు కలిగాయి. వీరు పూర్వజన్మల బంధాల విశేషాలతో రచించిన MET AGAIN పుస్తకం ఎందరి జీవితాలనో ప్రభావితం చేసింది. ఈ కొత్త పుస్తకం 'శ్రీమద్ యుగదర్శనం' లో తాను ధ్యానంలో ఉన్నత స్థితిలోకి వెళ్ళినప్పుడు గత యుగాలలోకి ప్రయాణించినప్పుడు తనకు కలిగిన అనేక అద్భుత అనుభవాలను వివరించారు. ఈ పుస్తకం చదివిన మీకు కూడా ఎన్నో దివ్యానుభూతులు కల్గుతాయని విశ్వపతి నమ్మకం.

Mr. T.V.R.K. Murthy (Viswapathi)
viswapathi@yahoo.com I Ph. : 98494 43752
www.lordofsevenhills.com